# రూతు గ్రంథ ధ్యానము



శ్రీమతి. కెజియా వరప్రసాద రెడ్డి

# రూతు గ్రంథ ధ్యానము


రచయిత్రి

శ్రీమతి కెజియా వరప్రసాదరెడ్డి



ప్రతులకు

టి.పి. వరప్రసాదరెడ్డి

షాలోమ్ చర్చ్, జె.యన్.టి.యు పోస్టాఫీస్

అనంతపురము - 515002

సెల్: 94402 85883

Date of Publishing: 9-9-2013

వెల : రూ. 30.00

<u>ప్రతులకు:</u>

**1. లోగోస్ బుక్ సెంటర్**

10/1, అరండల్‌పేట గుంటూరు – 522 002

ఫోన్ : (0863)2336927 సెల్:9866296843

**2. టి.పి. వరప్రసాదరెడ్డి**

షాలోమ్ చర్చి, జె.యన్.టి.యు పోస్టాఫీస్

అనంతపురము – 2

సెల్: 94402 85883

**3. మోరే ప్రార్థన మందిరము**

1088, 3వ ఫేజ్, కె.పి.హెచ్.బి. కాలనీ,

హైదరాబాద్–72, సెల్: 7396202017

**4. జి. రాజారావు**, పెద్దకాకాని–522 509,

గుంటూరు జిల్లా . సెల్: 9959466175

**5. టి. రత్నారెడ్డి**, మేనేజర్, ముత్తూట్ ఫైనాన్స్,

గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

సెల్: 9490000789..

# రూతు గ్రంథ పరిచయము

బైబిలులో వ్రాయబడిన 66 పుస్తకాలలో స్త్రీల పేర్లతో వ్రాయబడిన రెండు పుస్తకాలలో మొదటి పుస్తకమే ఈ 'రూతు గ్రంథము'. 3 పేజీలు 4 అధ్యాయాలు కలిగిన చిన్న పుస్తకమైనప్పటికీ యిందులో స్త్రీలకు మరి ముఖ్యముగా అత్త కోడళ్ళకు అతి మంచి పాఠములు ఉన్నాయి. ఇంకనూ కుటుంబ జీవితానికి, వ్యక్తిగత జీవితానికి యవ్వన జీవితానికి, ఆత్మీయ జీవితానికి ఉపయోగకరమైన ఎన్నో సందేశాలు ఈ గ్రంథములో మనకు దొరకుతాయి. ఇది ఎన్నిమారులు చదివినా బోర్ కొట్టని గ్రంథము. ఇది స్త్రీలందరితో మాట్లాడే సజీవ గ్రంథము. ఈ గ్రంథములో కనిపించే ముగ్గురు స్త్రీలలో (నయోమి, ఓర్పా, రూతులలో) రూతు జీవితం ఎంతో ప్రశంసించతగిన జీవితం. ఈ గ్రంథ ధ్యానము వ్రాస్తున్న నాకు కూడ చాలా చాలా ప్రియమైనది. ఈ 'రూతు గ్రంథము'లో ఆమె జీవితాన్ని ధ్యానిస్తున్నప్పుడు కోడలి పాత్రను పోషించుటలో ఆమెకు సాటి క్రైస్తవ స్త్రీలలో ఎవ్వరూ లేరని అనిపిస్తుంది. ఒక అన్యజాతిలో నుండి వచ్చినదైనప్పటికి ఎంత చక్కని మాదిరిగల, అత్తపట్ల ప్రేమ, గౌరవము, బాధ్యతగల, పరిచర్య చేయగల, పరిశుద్ధతను కాపాడుకొనగల యోగ్యురాలిగా తన్నుతాను అగపరచుకొనగలిగిన ఘనురాలు ఈ రూతు. అట్టి ఆత్మీయమైన హీరోయిన్ యొక్క సాక్ష్యజీవితము వ్రాయబడిన పుస్తకమే ఈ 'రూతు గ్రంథము'.

ఈ పుస్తకములో వ్రాయబడిన సంగతులు 'న్యాయాధిపతులు' ఏలినకాలంలో జరిగాయని రూతు 1:1వ.లో చదివి గ్రహించగలుగుచున్నాము. ఈ గ్రంథమును వ్రాసినది 'సమూయేలు' అని ఎక్కువమంది నమ్ముచున్నారు. న్యాయాధిపతులు ఏలిన దినములందు దేవునెరిగిన ఇశ్రాయేలీయులే దేవుని కట్టడలను, ఆయనయందు భయభక్తులను విడచి, అరాచకంగా జీవిస్తున్న సమయములో ఎలీమెలెకు, ఆయన ఇద్దరు కుమారులు నిజదేవుడైన యెహోవాయందు భయభక్తులు మానుకున్న తరుణంలో దేవుడు వారిని మరణమునకు అప్పగించిననూ, ఆ యింటిలోని ముగ్గురు స్త్రీలలో ఇద్దరు స్త్రీలైన నయోమి, రూతులు దేవుని యొద్దకు, ఆయన ప్రజల యొద్దకు తిరిగి ఏలాగున వచ్చారో ఈ గ్రంథములో వ్రాయబడింది. దేవుని పిల్లలు తప్పుచేస్తే దేవుడు ఎలాగున వారిని క్రమశిక్షణలోనికి తెచ్చుటకు శిక్షను పంపిస్తాడో, వారు క్రమములోనికి వచ్చిన తరువాత ఎలాగున వారిని దర్శించి వారికి తన కృపను, చూపించి దీవిస్తారో కళ్ళకు కట్టినట్లుగా వ్రాయబడిన గ్రంథమే ఈ 'రూతు గ్రంథము'.

ఈ గ్రంథములో మోయాబులో ఉన్న రూతు యూదా గోత్రములోని బెత్లెహేమువాడైన బోయజును అనగా బెత్లెహేములో పుట్టిన మన యేసు ప్రభువుకు సాదృశ్యముగా వున్న బోయజును వివాహము చేసికొనుట మనము చూడగలము. ఈ

కుటుంబములో అనేక సమస్యలున్నాయి. 1) కరువులు 2) అనారోగ్యము 3) రిక్త హస్తాలున్నాయి 4) పరాయి దేశములో వున్నారు 5) ఆ యింట్లో ఒకటికి మూడు మరణాలున్నాయి 6) వృద్ధురాలు ఆ యింటిలో వున్నది 7) అత్తకు భారంగా వున్న ఇద్దరు యవ్వన విధవరాండ్రున్నారు. 7 రకములుగా సంపూర్ణసంఖ్యలో సమస్యలున్నాయి. ఆ యింటిలో. కాని అందరి యిండ్లలో నేడు ఉంటున్న అత్త, కోడళ్ళ సమస్య మాత్రము ఆ యింటిలో లేదు. ఇది ఈ కుటుంబ విశేషం. ఇది స్త్రీలందరూ గమనించగల ముఖ్యమైన విషయము.

ఈ గ్రంథములో ముగ్గురు విధవరాండ్రున్నారు. కనుక ఈ గ్రంథాన్ని 'విధవరాండ్ర గ్రంథము' అని పిలువవచ్చు. ఈ గ్రంథములో 4వ అధ్యాయములో 5సార్లు గాక! గాక! గాక! గాక! గాక! అని దీవెన వచనములు వ్రాయబడ్డాయి. కనుక ఈ గ్రంథము లోని యింటివారందరూ చివరికి దీవించబడుటచే ఈ గ్రంథానికి 'దీవెనల గ్రంథమని' కూడ పేరుపెట్టవచ్చు. అలాగుననే ఈ గ్రంథమును చదువుచున్న ప్రియ సోదరీలారా! మీరును ఈ గ్రంథమును చదివి, ధ్యానించి ఆ వాక్యముల ప్రకారము నడచుకొనుట ద్వారా మనుష్యులందరి ద్వారాను, ప్రభువైన యేసుక్రీస్తు ద్వారాను దీవించబడుదురుగాక! రూతు ఎంతగా దీవించబడిందంటే ఈ గ్రంథము చివరలో ఆమె దావీదుకు తల్లిగాను, మరి ముఖ్యముగా యేసుప్రభువుకు తల్లిగాను పిలువబడేంత స్థితికి ఆమె వచ్చిందంటే అది ఎంత దీవెనకరమో! మీరే ఆలోచించండి. ఇక ప్రార్థనా పూర్వకముగా 'రూతు గ్రంథ ధ్యానమును' చదవండి.

## రూతు గ్రంథ విభజన

**1వ. అధ్యాయ విభజన:- మోయాబు నుండి బోయజు కాపురమున్న బెత్లెహేముకు వచ్చిన రూతు.**

ఎ. 1:1-6వ. మోయాబులో నయోమి కుటుంబము.

బి) 1:7-15వ. బెత్లెహేముకు ప్రయాణంలో (అత్తా, కోడండ్ర) సంభాషణ

సి) 1:16-18వ. రూతు ప్రయాణంలో (అత్తతో చేసిన) తీర్మాణం.

డి) 1:19-22వ. నయోమి యెహోవాపై చెప్పిన విరుద్ధ సాక్ష్యము.

**2వ. అధ్యాయ విభజన:- బోయజు పొలమునకు వచ్చిన రూతు**

ఎ) 2:1-2వ. అత్త సెలవు తీసుకున్న రూతు

బి) 2:3-7వ. పరిగె ఏరుకుంటున్న రూతు

సి) 2:8-16వ. రూతుతో సంభాషిస్తున్న బోయజు

డి) 2:17-22వ. బోయజును గురించి సాక్ష్యమిస్తున్న నయోమి, రూతు.

3వ. అధ్యాయ విభజన:- బోయజు కళ్ళమునకు వచ్చిన రూతు

ఎ) 3:1-7వ. కళ్ళములోని బోయజును చేరుటకు అత్తచే సిద్ధపరచబడిన రూతు

బి) 3:8-9వ. బోయజును మనవి చేసిన రూతు

సి) 3:10-15వ. బోయజుచే చక్కని సాక్ష్యమును, జవాబును, ఆహారమును పొందిన రూతు.

డి) 3:16-17వ. బోయజు తనకు చేసినదంతయు అత్తకు తెలియజేసిన రూతు.

ఇ) 3:18వ. బోయజును గూర్చి చక్కని సాక్ష్యమిస్తూ, అతని జవాబుకై కనిపెట్టమని రూతుతో చెబుతున్న నయోమి.

**4వ. అధ్యాయ విభజన:- బోయజు యింటికి వచ్చిన రూతు.**

ఎ) 4:1-10వ. రూతు పనిమీద వున్న బోయజు

బి) 4:11-17వ. దీవించబడిన రూతు. బోయజుల సంతానము మరియు నయోమి.

సి) 4:18వ. బోయజు వంశావళి

## రూతు గ్రంథ ధ్యానము

ఎ) **1:1-2వ. నయోమి కుటుంబ పరిచయము:-** 1వ. ఈ గ్రంథములో వ్రాయబడిన విషయాలన్ని న్యాయాధిపతులు ఏలిన దినములలో జరిగాయి. న్యాయా 17:6వ.లో వ్రాయబడినట్లు ఆ దినములలో ఇశ్రాయేలీయులకు రాజు లేడు. కనుక ప్రతివాడును తన తన ఇష్టానుసారముగా ప్రవర్తించుచూ వచ్చారు. రాజు వుంటేనే ప్రజలు క్రమంగా ప్రవర్తిస్తారు. రాజు అంటే ఎవరు మన రాజు? యెష 33:22వ.లో వ్రాయబడినట్లు “యెహోవా మన రాజు, న్యాయాధిపతి, శాసనకర్త, ఆయన మనలను రక్షించును" అని వ్రాయబడింది. ఈ పుస్తకాన్ని చదువుచున్న ప్రియ సోదరీ! నీ జీవితంలో రాజు వున్నాడా? ఆయనను నీ జీవితంలోకి ఎప్పుడైనా ఆహ్వానించావా? 'ఎలీమెలెకు' పేరు 'దేవుడే నా రాజు' అని అర్థము. కానీ ఎలీమెలెకు తన నిజ జీవితంలో ఆ దేవున్ని చూపించుట లేదు. తాను కరువులో వున్నప్పుడు రాజైన తన దేవుని సెలవు తీసికొని మోయాబుకు వెళ్ళవలసి వుండింది. కాని తన రాజు సెలవు తీసికొనకుండానే లోకానికి సాదృశ్యమైన మోయాబుకు వెళ్ళాడు. రాజైన దేవుని క్రమము తన జీవితంలో లేకుండా పోయింది. తన ఇష్టానుసారంగా వెళ్ళాడు. కనుక తనలోను తన పిల్లలలోను భార్యలోనూ ఏ క్రమము పాటించలేకపోయి అందరూ ఎంతగానో వారి జీవితాల్లో నష్టపోయారు. ప్రసంగి 11:9వ.లో “యవ్వనుడా! నీ యవ్వనమందు సంతోషపడుము. నీ యవ్వన కాలమందు నీ హృదయము సంతుష్టిగా వుండనిమ్ము. అయితే వీటన్నిటినిబట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చును" అని వ్రాయబడిన ప్రకారము, క్రైస్తవులారా!

పేరులో మాత్రమే ప్రభువును కలిగియుండి నీ జీవితంలో ఆ ప్రభువుని రాజుగా స్వీకరించకపోతే, నరకమనే తీర్పులోనికి మీరు వెళ్ళవలసి వుంటుంది. నరకమున అగ్ని ఆరదు, పురుగు చావదు గనుక అట్టి నరకాగ్ని నుండి తప్పించుకొని నిజక్రైస్తవులవ్వాలని ప్రభువు పేరట కోరుచున్నాను.

ఎలీమెలెకు కరువులో మోయాబుకు వెళ్ళాడు. తనకు వచ్చిన కరువే ఆ ఊరిలోనే ఉంటున్న బోయజుకు కూడా వచ్చింది. బోయజు కరువు గుండానే వెళ్ళాడు. వేరే దేశానికి పరుగు పెట్టలేదు. దేవుని మీద విశ్వాసముంచాడు. కానీ ఎలీమెలెకు కొన్నిరోజుల కొరకని వెళ్ళి మోయాబులో 10సం॥ ఉండిపోయాడు. అలాగే లోతు అబ్రాహామును విడచిపెట్టి సొదొమ దగ్గర, ఆ తరువాత సొదొమలో, ఆ తరువాత సొదొమ గవినిలో కనబడుతున్నాడు. కరువు సమయంలో ఏలీయా కూడా ఎలీమెలెకువలె తన స్వంత తలంపుతో వేరే దేశానికి వెళ్ళలేదు. దేవుని పైనే ఆధారపడగా కాకోలములచేత దేవుడతనిని పోషించలేదా? సారెపతు విధవరాలిచేత పోషించలేదా? కీర్త 33:18వ.లో "కరువులో సజీవులుగా చేస్తాను. మరణమునుండి వారి ప్రాణమును తప్పించెదను" అని దేవుని వాక్యము సెలవిచ్చుచుండగా ప్రక 3:10వ.లో "లోకమంతటికీ రాబోవు శోధన కాలములో నేను నిన్ను కాపాడెదను" అని ఫిలదెల్ఫియా సంఘముతో చెప్పుచుండగా ఏలీయావలె ప్రభువు మాటలను, వాగ్దానాలను విశ్వసించి ప్రభువు మాటలను అనుసరించాలని మనము నేర్చుకోవాలి.

ఎలీమెలెకు బేత్లెహేము నుండి మోయాబుకెళ్ళాడు. బేత్లెహేము అంటే 'రొట్టెల యిల్లు' అని అర్థము. అది స్థానిక సంఘమునకు గుర్తు. మోయాబు ఇహ లోకమునకు గుర్తు. ఈ లోక స్నేహము దేవుని దృష్టికి వైరమని మీరెరుగరా! అని యాకోబు 4:4వ.లో మనము చదువుచుండగా ప్రక 21:3వ.లో ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడా ఉన్నది అని వ్రాయబడివుండగా ఆయన నీతో కాపురము చేయాలనుకుంటూ వుండగా నీవు లోకస్థుల మధ్య కాపురముండాలనుకుంటున్నావా? అలాగున లోకస్నేహము చేస్తే యాకో 4:4వ. వ్యభిచారిణులారా! అని ప్రభువు సంబోధిస్తున్నాడు. ఈ సంగతి గ్రహించారా? ఎలీమెలెకు తానొక్కడే లోకంలోనికి వెళ్ళలేదు 'తాను చెడిన కోతి వనమెల్లా చెరిచింది' అన్నట్లు తన భార్య పిల్లలను కూడ వెంటబెట్టుకొని మోయాబుకెళ్ళాడు. అతని భార్య పేరు 'నయోమి'. నయోమి పేరుకు 'మధురము' అని అర్థము. బేత్లెహేములో రొట్టెల యింటిలో ఉన్నప్పుడు ఆమె అనుభవము పేరుకు తగ్గట్టుగా 'మధురంగా' ఉండింది. కానీ, మోయాబుకు వెళ్ళిన తరువాత ఆ మాధుర్యము కాస్త తన జీవితంలో అంతరించిపోయింది. నిజమే, విశ్వాసి దేవుని సన్నిధిని, సంఘాన్ని విడచి వెళ్ళినప్పుడు కలిగిన చేదు అనుభవాలు యోనా 2వ అధ్యాయములో వ్రాయబడ్డాయి. ప్రియసోదరీ! మోయాబులో వున్నప్పుడు నయోమి జీవితం చేదుగా వుండింది. ఇప్పుడు నీ జీవితంలో ఎలా వుంది? ఇప్పటికి ఇప్పుడే నీ జీవితాన్ని వాక్యమను అద్దములో పరిశీలించుకో. ప్రభువుకు యిష్టపూర్వకంగా వుందా?

లేక అయిష్టంగా వుందా? ఉండవలసిన చోట ఉన్నదా? లేక ఉండకూడని చోట ఉన్నదా? పరీక్షించుకొని సరిదిద్దుకుంటే ప్రభువుకు ప్రీతిపాత్రంగా జీవించగలవు.

ఎలీమెలెకు పెద్ద కుమారుని పేరు మహ్లోను. ఆ పేరుకు మహావ్యాధి గలవాడని అర్థము. పాపము కంటే మహావ్యాధి ఏముంది? రెండవ కుమారుని పేరు కిల్యోను. ఆ పేరుకు కృశించుట లేక క్షీణించుట అని అర్థం. ఒక వ్యక్తి కృశించి, క్షీణిస్తూ వున్నాడంటే ఏదైనా వ్యాధి శరీరంలో వుంటేనే గాని క్షీణించడు కృషించడు కనుక ఎలీమెలెకు ఇద్దరు కుమారులు కూడా మోయాబు అనే లోకానికి వెళ్ళినప్పుడు వారు పాపపు వ్యాధితో కృశించి 10 సంవత్సరముల తరువాత మోయాబులోనే చనిపోయారు. జబ్బు ద్వారా దేవుడు వారిని హెచ్చరించాడు. అయినా వారు దేవుని వైపు తిరుగలేదు. యిర్మీ 5:3. నీవు వారిని కొట్టితివి గాని వారికి దుఃఖము కలుగలేదు. వారిని క్షీణింప చేసియున్నావు కాని వారు శిక్షకు లోబడకున్నారు" అని వ్రాయబడిన రీతిగా వారు దేవునికి లోబడలేదు. ఆయనవైపు తిరుగలేదు.

2వ వచనములో వారు ఎఫ్రాతీయులు అనగా రెండంతల ఫలము ఫలించెడి వారని అర్థము. వారు బేత్లెహేములో ఫలభరితమైన జీవితాన్ని జీవించలేక పంటలేదని, ఫలము లేదని చిన్న కష్టానికే రొట్టెల ఇల్లైన బేత్లెహేమును విడచి ఇహలోకానికి గుర్తుగా వున్న మోయాబుకు వెళ్ళారు. ప్రియ సోదరీ! నీవు కూడ ఏదైనా కష్టమొస్తే నీ రాజైన ప్రభువు దగ్గరికి రావాలి. కానీ, ఆయనకు దూరంగా వెళ్ళి నీవు బాగుపడగలవా? నీ శ్రమలో ఆయనకు మొఱ్ఱపెట్టే అనుభవమున్నదా? ఆయనకు దూరంగా వుండి నీవేమి బాగుపడగలవు? నాకు వేరు ఉండి మీరు ఏమి చేయగలరు? అని ప్రభువు చెబుతున్నాడు. విస్తారమైన డబ్బు పెట్టుకొని డబ్బుద్వారా నా కష్టాన్ని తీర్చుకోగలనని డబ్బు చూచుకొని, బలాన్ని చూచుకొని, వయసును చూచుకొని, జ్ఞానాన్ని చూచుకొని సామర్థ్యాన్ని చూచుకొని నేను వీటన్నిటి ద్వారా నా జీవితాన్ని మ్యానేజ్, మేయింటెన్ చేసికోగలను అని అనుకున్నాడు ఎలీమెలెక్. మ్యానేజ్ (manage) కాదు కదా, డ్యామేజ్ (damage) చేసుకున్నాడు. ఓర్పా, యోనా, తప్పిపోయిన కుమారుడు లాంటి తండ్రికి దూరమైన వాళ్ళలో ఎవరు బాగుపడ్డారు? కరువు వచ్చినా కదలకుండా, ఇశ్రాయేలు దేశాన్ని విడువకుండా వుండిన ఏలీయాను కాకోలముల ద్వారా, సారెపతు విధవరాలి ద్వారా కెరీతు వాగు ద్వారా దేవుడు పోషించలేదా? నాడున్న దేవుడు నేడు కూడా నీకు తోడుగా వుండదా?

**బి) రూతు 1:3-6 మోయాబులో ఎలీమెలెకు కుటుంబము వారి వివరాలు:-** 3వ. వచనములో మోయాబుకు వెళ్ళిన ఎలీమెలెకు చనిపోయాడని వ్రాయబడింది. బ్రతుకడానికని వెళ్ళాడు. కానీ బ్రతకలేక చచ్చాడు. ఎలీమెలెకు ఆత్మీయంగా దేవునికి దూరమయ్యాడు. శరీరకంగా కూడ చచ్చి మనుష్యులకు శాశ్వతంగా దూరమయ్యాడు. దావీదు నేను దేవుని మందిరములో పచ్చని ఒలీవచెట్టుగా వున్నానన్నాడు. మోయాబులో మందిర అనుభవమతనిలో లేకుండా

పోయింది. అబ్రాహాము ఎక్కడికెళ్ళినా బలిపీఠాలు కట్టాడు. ప్రార్థనలు చేశాడు. ఎలీమెలెకు జీవితంలో అలాంటి దైవిక కార్యాలు ఏమి కానరాలేదు. అందుకే అతని జీవితం ఫలభరితం కాలేకపోయింది. ఆశీర్వాదం పొందలేకపోయాడు. ప్రియసోదరీ! నీ జీవితంలో ఈ పాఠం తప్పనిసరిగా నీవు నేర్చుకోవాలి. అదేంటంటే ప్రభువు సెలవులేనిది నీవు ఎక్కడికీ నీ స్వంతంగా వెళ్ళకూడదు. ప్రభువైన నీ రాజుతోనే నీవు ప్రేరేపించబడాలి. నీ స్వంతంగా నీవేమి చేయకూడదు. నీ మీద దృష్టియుంచి నీకు ఆలోచన చెప్పే దేవుని ఆలోచన ఏమిటో ప్రార్థించి తెలిసికోవాలి. కానీ ఎలీమెలెకు అలా చేయలేదు. చివరకు ఎలీమెలెకు చనిపోయాడు. ఇప్పుడు నయోమి ఆమె యిద్దరు కుమారులు నిలిచియుండిరి అని 1:3వ.లో వ్రాయబడింది. కానీ,ఎంతకాలము నిలిచారు? 10 యేండ్లు మాత్రమే 4వ.లో 10 యేండ్ల తరువాత వారు మోయాబు స్త్రీలను పెండ్లి చేసుకున్నారని వ్రాయబడింది. మహ్లోను, కిల్యోను ఇద్దరూ ఇశ్రాయేలు జాతికి చెందినవారు. నిర్గ 34:16; ద్వితీ 3:4; ఎజ్రా 9:11,12; 2 కొరి. 6:14-18; ద్వితీ 7:1-3వ.లలో అన్యులతో మీరు వియ్యమొందకూడదు. వారి కుమారునికి నీ కుమార్తెను ఇవ్వకూడదు, నీ కుమారునికి వారి కుమార్తెను పుచ్చుకొనకూడదు. నన్ను అనుసరింపకుండ యితర దేవతలను పూజించునట్లు వారు నీ కుమారుని మళ్ళించుదురు. అందునుబట్టి యెహోవా కోపాగ్ని నీ మీద రవులుకొని ఆయన నిన్ను త్వరగా నశింపచేయును" అను మాట ప్రకారము పెళ్ళి చేసికొనకూడని మోయాబు స్త్రీలను వీరు పెళ్ళి చేసికొనిన కారణమున కిల్యోను మహ్లోనులపై దేవుని కోపాగ్ని రవులుకొని వారిద్దరూ చనిపోయారు. అలాగున నయోమి ఇప్పుడు తన ఇద్దరు కుమారులను, భర్తను పోగొట్టుకున్నదై పోయింది. కీర్త 77:27వ. ప్రకారము బేత్లెహేము విడచి దేవుని ఆజ్ఞలు పాటించక ఆయనను విసర్జించి నశించాడు. దేవుని విడచి, వ్యభిచరించు వారందరిని ఆయన కిల్యోను, మహ్లోనులవలె సంహరిస్తాడని తెలుసుకుంటున్నాము. దృష్టాంతములుగా ఈ సంగతులు వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుట కొరకై వ్రాయబడ్డాయి.

కిల్యోను భార్య పేరు ఓర్పా. ఓర్పా పేరుకు 'కెంపు' అని అర్థము. మీ పాపములు 'కెంపు' వలె ఎఱ్ఱనివైనను అన్నమాట ప్రకారము, కెంపు ముదురు ఎఱుపు రంగులో ఉంటుంది. ముదిరిన పాప జీవితానికి కెంపు గుర్తుగా వున్నది. ఓర్పా పాప జీవితానికి, శరీర జీవితానికి గుర్తుగా ఉంది. రూతు అనగా స్నేహశీలి, సౌందర్యము అని అర్థాలు. "ఈ రాజు నీ ప్రభువు. అతడు నీ సౌందర్యము కోరినవాడు" అని కీర్త 45:10వ.లో చదవగలము. దేవుడు ఇష్టపడే ఆత్మీయ సౌందర్యము గలది రూతు. సాధారణముగా "కోడలికి అత్తకు పోసిన పప్పులు ఉడకవు" అంటారు. కానీ, రూతు అత్తతో స్నేహము చేయడానికే ఇష్టపడింది. మోయాబులాంటి లోకస్నేహం చెయ్యడానికి తాను ఇష్టపడలేదు. సాధారణముగా, అత్తకు, కోడలికి మధ్య పచ్చిగడ్డి వేసినా భగ్గుమంటుంది అనే మాట లోకంలో వాడుకగా అనుకుంటూ ఉంటారు. కానీ, ఈ గ్రంథంలో నయోమి, రూతుల మధ్య ప్రేమ, ఆదరణ, అభిమానాలు ఉన్నట్లు మనం గమనిస్తున్నాము. ఓర్పా ఆరంభములో

రూతుతోపాటు అత్తను వెంబడించడానికి ఒప్పుకొని అత్తగారు పరీక్ష పెట్టేవరకు కన్నీరు కార్చుచు అత్తను వెంబడించింది. తనతో కూడా వస్తే, వారికేమీ లాభముండదని, తమకు భవిష్యత్తే లేదని తమ తమ జన్మభూములకు తల్లిదండ్రుల దగ్గరకు వెళ్ళమని అత్త ఎప్పుడైతే చెప్పిందో అప్పుడు ఓర్పా తన అత్తకు వీడ్కోలు ముద్దుపెట్టి తన జన్మ భూమికి తన తల్లిదండ్రుల యొద్దకు తన ప్రజల యొద్దకు వెళ్ళిపోయింది. చరిత్రపుటలో నుండి కనుమరుగయ్యింది. తన అత్త యొక్క పరిస్థితులు (ముగ్గురి ప్రాణాలని పోగొట్టుకున్న) తన హృదయాన్ని కుదిపివేసినా, కన్నీరు వచ్చినా, ఓర్పా మోయాబుతో సంబంధాన్ని విడువలేకపోయింది. నీ ప్రజల యొద్దకు నీతో కూడా వచ్చెదమని ఓర్పా రూతుతో కలసి చెప్పింది. కానీ నీ దేవుని యొద్దకు వచ్చెదనని రూతు చెప్పినట్లు తేల్చి చెప్పలేదు. హృదయపూర్వకముగా చెప్పలేదు. ప్రియ సోదరీ! నీవు కూడ లోకమనే మోయాబులో ఎన్నో నష్టపోయావా? కలిగిన నష్టాలు చాలు. ఇక ఎంతసేపు లోకంలో ఉండినా కలిగే నష్టము అపారమే. ఇప్పుడే, తక్షణమే, రొట్టెల ఇల్లయిన సంఘానికి వెళ్ళడానికి బయలుదేరు.

**సి) 1:7-15వ. బేత్లెహేముకు ప్రయాణములో (అత్త, కోడండ్ర) సంభాషణ:-** ప్రయాణములో నయోమి తన యిద్దరు కోడండ్రను చూచి చనిపోయిన వారి యెడలను, నా యెడలను మీరు దయ చూపారని చెప్పింది. నిజానికి యెష 16:6వ. ప్రకారము మోయాబీయులు బహు గర్వము గలవారిని, గర్వక్రోధము గలవారిని, వారు 'వదరుబోతులు' అని వ్రాయబడింది. కానీ రూతు ఓర్పాలు అత్తయైన నయోమికి దయచూపారని తెలుస్తోంది. నేడు అత్తకు దయచూపే కోడండ్రు చాలా తక్కువగా ఉన్నారు. ఈ ఇద్దరు కోడండ్రు చనిపోయిన వారికి అనగా తమ భర్తలకు, తమ మామగారికి కూడా దయచూపారని తెలుస్తోంది. అవును కోడండ్రు దయచూపే వారుగా వుండాలి. 1 తిమో 5:8లో "ఎవడైనను స్వకీయులను, విశేషముగా తన యింటివారిని సంరక్షించక పోయిన యెడల వాడు విశ్వాస త్యాగము చేసినవాడై అవిశ్వాసికన్న మరీ చెడ్డవాడై యుండును" అని వ్రాయబడిన ప్రకారము మనము మన యింటివారిని తప్పక సంరక్షించాలి.

ఈ విషయములో రూతు తన భర్త చనిపోయినప్పటికీ తనకంటే ముందుగా భర్తను, తన ఇద్దరు కుమారులను పోగొట్టుకున్న ఒంటరిదైపోయిన అత్తను చేరదీసి పరిగెను ఏరుకొనియైనా అత్తను పోషించినదని రూతును గూర్చి 2వ అధ్యాయంలో చూస్తున్నాము. 1 తిమో 5:16వ.లో వ్రాయబడినట్లు విశ్వాసురాలైన ఏ స్త్రీ యింటనైనను విధవరాండ్రుండిన యెడల సంఘము నిజముగా అనాథలైన విధవరాండ్రకు సహాయము చేయుటకై దానిమీద భారము లేకుండా ఆమెయే వీరికి సహాయము చేయవలెను" అను ఈ వాక్యాన్ని రూతు తాను చదువకపోయినను, ఈ వాక్యమును ఎరుగక పోయినను దేవుని ఆత్మ ప్రేరేపణతో ఆమె ఆ వాక్యాన్ని ఆ దినాల్లోనే నెరవేర్చింది. ఈ దినాల్లో భర్త సంపాదించిన ఆహారాన్నే అత్తమామలకు సరిగా పెట్టని కోడళ్ళు, ఇక తామే సంపాదించిన ఆహారాన్ని పెడతారని

సమ్మాలా? ఆ దినాలను మనము చూడగలమా? 2:10వ.లో బోయజు రూతుతో "నీవు నీ అత్తకు చేసినందతయూ నాకు తెలిసినదని చెప్పి 12వ.లో యెహోవా నీవు చేసిన దానికి సంపూర్ణమైన బహుమానమిచ్చునని చెప్పాడు. ప్రియసోదరీలారా! మన అత్తలకు మనము ఏమి చేశామో పరమ బోయజుకు తెలుసు. ఏమి చేయలేదో అది కూడా పరమ బోయజుకు తెలుసు. వారికి మనము చేసిన పరిచర్యనుబట్టి దేవుడు మనకు సంపూర్ణ బహుమానమిస్తాడట. పాతిక బహుమానం కాదు, సగము బహుమానం కాదు, సంపూర్ణ బహుమానం ఇస్తాడట. మన అత్తకు మనం పరిచర్య చేస్తే ఆ అత్త మనకు సంపూర్ణ బహుమానం ఇవ్వలేకపోవచ్చు. ఒకవేళ అత్త పరిచర్య చేసిన తన కోడలికి బహుమానంగా ఏమైనా యిచ్చినా అది సంపూర్ణ బహుమానం కాకపోవచ్చును. కానీ ప్రభువిచ్చే బహుమానం సంపూర్ణంగా నూరంతలు వుంటుంది. తమ అత్త, మామలను చక్కగా చూచుకొనిన వారందరూ విశ్వాసుల తీర్పులో సంపూర్ణబహుమానాలు తీసికొనుచుండగా, ప్రియసోదరీ! నీ సంగతేంటి? ఆ వేళ బహుమానం రాలేదని బాధ పడితే ఏమి లాభం? కనుక సంపూర్ణ బహుమానం మనం పొందుకోవాలంటే అత్తా. మామలకు పరిచర్యను మనమెంత శ్రద్ధగా చేయాలో కదా! ఈ సందర్భములో కోడండ్రకు కొన్ని సలహాలు ప్రభువు ప్రేరేపణతో వ్రాయాలనుకుంటున్నాను.

**కోడండ్రైన వారికి కొన్ని సలహాలు:-**

(1.) మన తల్లిదండ్రులను మనమెలా ప్రేమతో సంరక్షిస్తామో కోడండ్రమైన మనము అత్తమామలను కూడ అంతకంటే ఎక్కువగా ప్రేమించాలి. సంరక్షించాలి. రూతువలె దయతో వారికి పరిచర్య చేయాలి.

(2.) వయస్సులో వున్నప్పుడు నన్ను మా అత్త సతాయించింది. ఆమె మంచములో పడినప్పుడు నేను ఆమెను సతాయిస్తాను అనకూడదు.

(3.) వారు తమ బి.పి.లను బట్టియు, అనారోగ్యాలను బట్టియు ఒక మాట దుబారుగా మాట్లాడినా ఓర్చుకోవడం అవసరం. శత్రువులను ప్రేమించిన ప్రభువును ఈ సందర్భములో జ్ఞాపకం చేసికోవడం మంచిది.

(4.) ముసలివారికి పళ్ళుండవు గనుక మెత్తటి పదార్థాలు వారు తినడానికి పెడితే మంచిది. గట్టి పదార్థాలు వారు నమలలేరు గనుక.

(5.) వారి బలహీనతల నిమిత్తమై సమయానికి మందులు ఇవ్వాలి.

(6.) వృద్ధాప్యములో శక్తిహీనతతో ఏమైనా క్రిందపడవేస్తే వారిని గద్దించకుండా (1తిమో 5:1) దయతో వారిని ఓర్చుకోవాలి.

(7.) వారి రుచిని యెరిగి ఆహారపదార్థాలను వండడం వారికెంతో సహాయకరం. ఏ విధానంలో వంటలు తయారుచేస్తే వారికి తినబుద్ధి అవుతుందో వారి ఇష్టా అయిష్టాలు కనుక్కొని వంటలు చేస్తే, వారికి తృప్తికరంగా వుంటుంది.

(8.) అనేక మంది కోడళ్ళు తమ భర్తలను గౌరవించి, ప్రేమించి బాగా చూచుకుంటారు. కాని అట్టి భర్తను కనిన అత్తమామలకు మాత్రము అట్టి విలువను గౌరవాన్ని చూపరు.

(9.) అత్త, మామ ఇంటిలో వుంటే నేను కాపురానికి రాను అని కోడలు తన భర్తతో అనకూడదు. అత్త మామలు ఒకవేళ మనయింటికి వచ్చినా 10 రోజులకంటే ఎక్కువగా వుండకూడదు అని భార్యలు భర్తలను శాశించకూడదు. "నేను కావాలో, మీ తల్లిదండ్రులు కావాలో సాయంకాలంలోపల తేల్చుకో" అని భార్యలు భర్తలతో బాంబులాంటి మాటలు అని వారిని యిబ్బందిపాలు చేయకూడదు. అత్త, మామలు చనిపోతే వాళ్ళ ఆస్తిపాస్తులు, వెండి బంగారములు, వస్తువులు, వాహనాలు, వస్త్రాలు పంచుకోవాడానికైతే ఆసక్తిని కనబరుస్తారు కానీ అత్తమామలు బ్రతికియున్న కాలంలో వాళ్ళ సంరక్షణను కొంచమైనను పట్టించుకొనని అన్యాయపు కోడండ్రుగా వుండకూడదు.

(10.) నీ అత్త మామను నీవు దయగా చూస్తే రేపు నీ కోడలు కూడా నిన్ను దయగా చూస్తుంది. మోసపోకుడి దేవుడు వెక్కిరించబడడు. మనుష్యులు ఏ పంటను విత్తుతారో అదే పంటను కోస్తారు. (గల. 6:7వ.)

(11.) ఏశావు భార్యల్లాగ అత్త మామలని విసికించి, వారికి వేదన కలిగించకూడదు. (ఆది 26:34). ఇస్సాకు వయస్సు 100 సం॥ ఉన్నప్పుడు ఏశావు హేతు కుమార్తెలను పెళ్ళి చేసుకున్నాడు. 100 సం॥రాల మామను, అత్త వయస్సు తెలియదు ఆమెను వేదనకు ఆ కోడండ్రు గురిచేశాడంటే, వారి వయస్సును కూడా ఆ స్త్రీలు గమనించలేకపోయారా? అనిపిస్తుంది. ఆది 26:46వ.లో తన కోడండ్ర వలన రిబ్కా ప్రాణము విసికిపోయిందట. వారి వలన నా బ్రతుకుకు ఏమి ప్రయోజనము? అని రిబ్కా చెబుతోంది? అలాగైతే అత్తల ప్రాణానికి సంతోషం కలిగించాలి కోడళ్ళు. అత్త బ్రతుకుకు కోడలు ప్రయోజనకరంగా వుండాలి. ప్రియసోదరీ! నీ అత్త ప్రాణానికి నీ వలన సంతోషం కలుగుతోందా? నీ వలన అత్తకు ప్రయోజనం వుందా? లేక నిష్ప్రయోజనమా? నీ భర్తకు, నీ పిల్లలకే నీవు ప్రయోజనమా! వారికి డిప్రెషన్ తెప్పించకూడదు. కోడళ్ళారా! నేను పెళ్ళి చేసుకున్నది నిన్నేగానీ మీ అమ్మను కాదు అని భర్తతో భార్య అనకూడదు. ఆది 26:46 వచనము మళ్ళీ మళ్ళీ చదువుకోండి.

(12.) కొందరు తమ భర్తలు చూచినప్పుడే అత్తమామలను బాగా చూచుకుంటారు. భర్త లేనప్పుడు అత్త మామలను సరిగా చూడరు. అలా చేయకూడదు.

(13.) అప్పుడప్పుడు వారు కోరే కోరికలు గమనించి వీలైనంతవరకు వారి రుచుల ప్రకారం ఆహారపదార్థాలు చేసిపెడితే వారి దీవెన మనకు మన పిల్లలకు లభిస్తుంది. ఆది 27:4లో ఇస్సాకు ఏశావును "నేను నిన్ను ఆశీర్వదించునట్లు నా కిష్టమైన రుచిగల భోజ్యములను సిద్ధపరచుటకు వేటాడిన మాంసము తెమ్మన్నాడు". ఏశావు వేట మాంసము తెచ్చినా వండిపెట్టే బాపతు కాదుకదా ఈ కోడళ్ళది. మామ దీవెన పోగొట్టుకున్నారు ఆ కోడళ్ళు.

(14.) అన్ని సెలవులకూ అమ్మగారిఇంటికే వెళ్ళకూడదు. అత్తగారింటికి కూడా వెళ్ళాలి.

అత్తను ప్రేమించిన దానికి సూచనగా నీ ప్రేమను క్రియారూపకంగా చూపించడం మంచిది. రూతు అత్తకు పేలాలు తీసుకెళ్ళింది. మూట గట్టుకొని వెళ్ళింది. ఓ కోడలా! నీవు కట్టే మూటలన్ని అమ్మకేనా? అత్తకు వద్దా? నీ అత్త యింటికి "వట్టి చేతులతో వెళ్ళొద్దు" అని బోయజు రూతు 3:18వ.లో చెప్పాడు. అయితే ఈసారి నీ అత్త యింటికి వెళ్ళేటప్పుడు నీకు అంత మంచి భర్తను అందించిన నీ అత్తగారికి ఏమేమి తీసుకెళ్తావు? ఆలోచించుకో అత్తకు మూటలు కట్టు, నీ ప్రేమ ఆ మూటలో అత్తమామలకు చూపించు.

(15.) కోడలు యిల్లు వదలి బయటకు వెళ్ళేటప్పుడు అత్తకు చెప్పివెళ్ళాలి. రూతు 2:1వ.లో బోయజు పొలానికి వెళ్ళేటప్పుడు నయోమి అనుమతి తీసుకొని వెళ్ళినది.

(16.) వంట చేసేటప్పుడు ఇంటిపెద్దయైన అత్తతో "అత్తా ఈ రోజు ఏమి వంట చేసుకుందాం?" అని అడిగి వారి సలహా తీసుకుంటే మంచిది.

(17.) ముసలి అత్తమామలకు వంటచేసి పెట్టడమే నా బాధ్యత అనుకొనక దినములో కొద్దిసేపు వారితో మాట్లాడితే, మా కోడలు మాతో కలువుగోలుగా వుంటుందని వారు సంతోషిస్తారు. వారి మంచి చెడ్డా కూడా అడిగి తెలుసుకోవాలి. అలాచేస్తే వారి నిండు దీవెనలు మీకు మీ పిల్లలకు వుంటాయి.

(18.) తోటి కోడండ్రందరూ కలసి ఒక్కటైపోయి అత్త మీద ధ్వజమెత్తకూడదు. కోడండ్రందరూ కలసి అత్తను గూర్చి చెడుగా ఇతరులకు చెప్పుకోవడం వల్ల యింటి గుట్టు బయటికి వేసిన వాళ్ళవుతారు. ఇతరులకు మీరు చులకనవుతారు. అత్తలు గయ్యాలులైతే కోడండ్రు వారి కొరకు ప్రార్థించి, ప్రభువు ప్రేమను చూపించి వారిని మంచిగా మార్చే ప్రయత్నం చేయాలి. మన ప్రవర్తన ఆయన దృష్టికి మంచిగా ఉంటే మన శత్రువులను కూడా దేవుడు మిత్రులుగా మార్చుతారు. (సామె. 16:7).

(19.) ముందు దినాలకంటే, మన దినాలలో వాక్య వివరములు ఎక్కువగా మనకు తెలుసు గనుక ఒకవేళ అత్తమామలు పొరపాటునగాని, లేక తెలిసియో లేక తెలియకయో మనలను సరిగా అర్థము చేసికొనక, పరుల మాటలు వినుట ద్వారానో మనలను అపార్థము చేసికొని ఏమైనా మనమనస్సుకు కష్టము కలిగించే రీతిగా వారు మాట్లాడినా లేక మనలను గురించి యితరులకు వేరువిధంగా చెప్పినా వారి మీద పగకానీ, అసహ్యతగాని మన మనుస్సులో ఉంచుకోకూడదు. "ప్రభువు మధ్యాహ్నమందు నీ నిర్దోషత్వాన్ని బయటపెడతా" నన్నాడు. వారు బ్రతికినంత కాలము వారి మాటలను మనస్సులో ఉంచుకోకూడదు. వారు మన మీద కోపపడిన్పటికీ, వారి మీద ప్రేమయే చూపాలి. మన ప్రభువు పాపాత్ములందరు తనకు విరోధముగా మాట్లాడిన మాటలను, దూషణలను, నిందలను, అవమానములను, దిగంబరత్వాన్ని వేసిన ఉమ్ములను, కొట్టిన దెబ్బలను క్షమించమని తండ్రిని వేడకొనలేదా? ప్రభువులాగ ప్రియసోదరీ! నీ అత్తను, మామను క్షమిస్తావా? ఇకనైనా నీవు ప్రేమతో దయతో వారిని చూచుకుంటావా?

(20.) ప్రభువునందు ఒక అత్తాకోడళ్ళను నేనెరుగుదురు. "నీవు, నీ పిల్లలు నన్ను చూస్తారా? అని ఒక అత్త తన కోడలితో అన్నది. చివరకు ఆ కోడలు, అమె పిల్లలే ఆ అత్తను ముసలితనమందు మంచిగా చూచుకొని పరిచర్య చేశారు. ఆ అత్త తాను చనిపోయేముందు ఆ కోడలు చేసిన పరిచర్యకై ఆమెకు చేతులెత్తి వందనాలు చెప్పింది. మేలు చేతనే కీడును జయించాలి అన్నాడు మన ప్రభువు. కీడుతో కీడును జయించలేము. ఇది ప్రభువు చూపిన మార్గము.

(21.) కొద్దిమంది కోడళ్ళు అత్త, మామలు బ్రతికినంతకాము వారికి ఎన్నడైనా మనసార పరిచర్య చేయరు. కానీ చనిపోయిన దినాన అత్తగారి శవము దగ్గర నిలబడి అమెమీద తెగ ప్రేమ, వున్నట్లు శవమైన అత్తకు విసనకర్ర తీసుకొని విసరుతూ ఉంటారు. అలా వేషధారణగా వుండకూడదు. దేవుడు వివాహము ద్వారా మనకిచ్చిన బాంధవ్యాలను చక్కగా కాపాడుకోవాలి. వారితో తెగతెంపులు చేసుకోవడానికి నిముషము పట్టదు. చక్కని సాక్ష్యము రూతువలె తెచ్చుకోవడానికి జీవితకాలమంతా పడుతుంది. దేవుడు మనకు ఇచ్చిన బాధ్యతలను చక్కగా నిర్వర్తించాలి. ఈ బాధ్యతను ప్రతి కోడలు తన చేతనైన రీతిగా ప్రేమతో తగ్గించుకొని అత్తమామలకు ప్రేమతో, ఓర్పుతో పరిచర్య చేస్తే ప్రతి కోడలూ ఒక 'రూతు' అవుతుంది. అప్పుడే ఆ కోడలు రూతులాగ దీవించబడుతుంది. అలాంటి రూతుల కోసం చదువరులందరూ ప్రార్థిద్దాం.

నేను చదివిన ఒక దిన పత్రికలో "కోడలు పాటించవలసిన కొన్ని సలహాలు ప్రయోజనకరమైనవి క్రింద పొందుపరుస్తున్నాను.

1. అత్తగారంటే మీరు ఏరికోరి పెండ్లి చేసుకున్న మీ భర్తగారి తల్లి. మీకు అమ్మలాంటిదే.

2. పాతకాలం మనిషి. పెద్దావిడ గనుక మాట కొంచెం తేడాగా వున్నా, మన్నించాలే తప్ప కయ్యానికి కాలు దువ్వకూడదు.

3. మీ భవిష్యత్తు అంతా ఈ కుటుంబంలోనే కనుక ఇంట్లో అందరి స్నేహాన్ని ప్రేమను పొందటానికి ప్రయత్నించాలి.

4. మీరు యింటికి యజమానురాలు. అందరిపట్ల బాధ్యతగా, గౌరవంగా వుండడం అలవర్చుకోండి.

5. అలగటం, ఆడపడుచులను, మరుదుల్ని సతాయించడం లాంటివి చేయకండి.

7. అత్తగారిలో అమ్మను చూచుకోండి. ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును అని సూక్తిని పాటించి ఆమెతో ప్రేమగా ఉండండి. సహజీవన మాధుర్యాన్ని మనసారా అనుభవించాలంటే ఈ జాగ్రత్తలు తప్పనిసరి.

ఇట్లు నయోమి "మీరు నా మీద దయచూపారు గనుక యెహోవా మీ మీద దయచూపునుగాక" అని మొదటిసారిగా దీవించింది. అవును మనము అత్తలకు దయచూపిస్తే అత్తలు మన మీద దయ చూపలేకపోవచ్చు (వారి ముసలితనంలో) కానీ దేవుడు మన

మీద దయ చూపిస్తారు. ఆయన దయామయుడు. ఆయన దయ ఆయుష్కాలమంతా వుంటుంది. ఆయన దయగల మాటలు పలికేవాడు. దయాదాక్షిణ్యమూర్తి. యెహోవా దయాళుడు. దయతో యాజకత్వమిచ్చాడు లేవీయులకు. మీలో ఒక్కొక్కతె పెళ్ళి చేసుకొని తన యింట నెమ్మది నొందునట్లు యెహోవా అనుగ్రహించును గాక! అని రెండవ దీవెన దీవించింది. ఈ అత్త కోడళ్ళను దీవించే అత్త ఈలాంటి అత్తలు ఈ దినాల్లో ఉన్నారంటారా? ఏమో? తెలియదు మరి. అటువంటి అత్తలు వేళ్ళమీద లెక్కపెట్టగలిగినంత మందే ఉన్నారేమో! యెహోవా దయచూపును గాక! యెహోవా నెమ్మది అనుగ్రహించును గాక! అని రెండు దీవెన వచనాలతో కోడండ్రను, దీవిస్తోంది. ఇది వీడ్కోలు దీవెనలుగా వున్నాయి. వీడ్కోలు దీవెనలున్నాయి అంటే, వీరి పెళ్ళి దినాన వీళ్ళను తన యింటిలో చేర్చుకున్న తొలిదినాన కూడ వీరిని ఆశీర్వదించే వుంటుందని నేను నమ్ముతున్నాను. అవును అత్తలు తమ కుమార్తెలను దీవించడము యెరుగుదురేమో? కానీ కోడండ్రను దీవించుట యెరుగుదురా? మన కుమార్తెలు 20 లేక 25 సం॥లు మాత్రమే మన యింటిలో వుంటారు. ఆ తరువాత వివాహమై అత్తగారింటికి వెళ్తారు. ఇక మరణ పర్యంతము అత్త గారింటిలోనే వుంటారు. అలాగే మరో యింటి అమ్మాయి మన యింటికి కోడలుగా వచ్చి మరణ పర్యంతము మన యింటిలోనే వుంటుంది. కనుక మన యింటికి వచ్చిన అమ్మాయే, మన కోడలే, మనకు కుమార్తె లాంటిది అని అనుకోవాలి. అందుకే మాదిరికరమైన అత్తగా నయోమి తన కోడండ్రను కుమార్తెలారా! అని 10వ॥లో సంబోధిస్తోంది. అత్తలారా! మీరెన్నడైనా మీ కోడండ్రను కుమారీ! అని పిలువకపోయినా మీ కుమార్తెలాంటిదానిగా ఎన్నడైన భావించారా? మన కోడండ్రను, కుమారులను, కుమార్తెలను, అల్లుళ్ళను మనము ప్రతి రోజు దీవిస్తూనే ఉండాలి. దీవెన వచనము పలుకడం ఎంతో శ్రేష్టం. కొద్దిమంది అత్తలు కోడలిని శపిస్తూనే వుంటారు. శపించడం వారికి ప్రీతి. కానీ నయోమి తన కోడండ్రను దీవించి వారిద్దరికి నయోమి ముద్దు పెట్టింది. మన పిల్లలకు ముద్దు పెట్టిన రీతిగా కోడండ్రకు కూడా ముద్దు పెట్టాలి. ఈ సంగతి నయోమి మనకు నేర్పిస్తోంది. నేర్చుకుందాం. ఇస్కరియోతు యూదా యేసు ప్రభువుకు ముద్దు పెట్టెను గాని ఆ ముద్దు కపటముతో కూడినది.

వారి భర్తలు చనిపోయినా వారు తన కుమారుల పేర్లనే భరిస్తూ జీవితమంతా ఒంటరిగా జీవించాలని కోరుకొనక వారు తలిదండ్రుల యొద్దకు వెళ్ళి తిరిగి పెళ్ళిళ్ళు చేసుకోవాలని, వారి యింట నెమ్మది కలిగి జీవించాలని వారి మంచిని కోరుతోంది నయోమి. కోడళ్ళు మన యింట నెమ్మదిని అనుభవిస్తున్నారో లేదో అత్తలైన వారు గమనించి తెలుసుకోవాలి. వారి నెమ్మది కొరకై ప్రయత్నం చేయాలి. మరియు నయోమి తన కోడండ్రతో 13వ వచనంలో యెహోవా నాకు విరోధి అయ్యాడు. అది మిమ్మును నొప్పించినంతటికంటె నన్ను మరి యెక్కువగా నొప్పించినదని చెబుతోంది. అంటే నయోమి కోడండ్రకు కలిగిన నొప్పిని గమనించిన అత్తగా నేటి అత్తలకు మాదిరిగా వుందన్న మాట. 2:19లో "నేడు నీవెక్కడ పనిచేసితివి. నేడు నీవు ఎక్కడ ఏరుకొంటివి?" అని 3:16 నీ పని ఎట్లు జరిగినది?

అని కోడలి పనిలో సాధకబాధలను నయోమి అడిగి తెలుసుకుంటున్నది. నయోమి తన కోడలైన 'రూతు' వ్యక్తిగత విషయాలను తల్లివలె అడిగి తెలుసుకుంటున్నది. నేటి అత్తలు కూడా అలా చేయాలి. 2:22 అలా నయోమి కోడలి పనిని గురించి అడిగి తెలుసుకొని బోయజు 2వ అధ్యాయములో యిచ్చిన సలహాలనే తాను కూడా యిచ్చింది. మరొక చేనిలోని వారికి కనబడకూడదని రూతుతో చెప్పింది. అత్తలు కోడళ్ళకు తమ అనుభవాలనుబట్టి తమ కోడళ్ళకు సలహాలు ఇవ్వాల్సిన వారుగా ఉన్నారు. కోడండ్రు సలహాలు తీసికొనవలసిన వారుగా ఉన్నారు. మన భద్రత కోసము మన క్షేమంకోసం వారిచ్చిన సలహాలను మనము పాటించాలి. "పెద్దవారి మాటలు సద్ది మూటలతో సమానము" అనే సామెత ప్రకారం వారి అనుభవ సాక్ష్య సలహాలు మన జీవితాలకు మంచి భద్రతను కలిగిస్తాయి.

3:3వ. కోడలు పొలంలో పరిగె ఏరుకొని తెస్తున్న ఆహారాన్ని తినుకుంటూ హాయిగా కూర్చుని స్వలాభాన్ని కోరుకొనక అత్తయైన నయోమి రూతు భవిష్యత్తును రూతు విశ్రాంతిని ఆలోచించి ఆమె వివాహాన్ని గురించిన భారము కలదై తాను ఎవరిని పెళ్ళి చేసుకోవాలో ఆ విషయాన్ని గురించి కోడలికి చక్కని సలహాలనిస్తోంది. 4:15వ.లో నయోమికి మహ్లోను, కిల్యోను అను తన కుమారుల లాంటి 7గురు కుమారులకంటే తన కోడలు 'రూతు' ఆమెకు ఎక్కువట. సాధారణంగా అత్తలకు కొడుకే కోడలికంటే ఎక్కువగా కనబడతాడు. కానీ నయోమికి మాత్రం కోడలే ఎక్కువ. ఇది యదార్థంగానే నయోమి చెబుతోంది. ప్రియ సోదరీ! నీ కుమారులు పనికిమాలినవారై, నీ కోడలు మంచి పనికి వచ్చేదిగా వున్నదేమో. అటువంటి నీ కోడలిని ఎన్నడైనా అభినందించావా? అభినందించాల్సిన సమయమొచ్చినప్పుడు కోడలిని చక్కగా అభినందించాల్సిందే, అప్రిషియేట్ చేయాల్సిందే. నీ కోడలిని ఎప్పుడు కూడా నీవు తక్కువ చేసి మాట్లాడకూడదు. కొడుకును మాత్రమే ఎక్కువచేసి మాట్లాడుతూ, కోడలిని తక్కువ చేసి మాట్లాడి ఆమె మనస్సును బాధపెట్టకూడదు.

ఈ అత్తగారైన నయోమి ఎట్టిదై యుండగా ఓర్పా, రూతు ఆమె యెడల దయచూపారు? అని అంటే సామె 13:15 ప్రకారము 'సుబుద్ధి దయను సంపాదించును' అను మాట ప్రకారం నయోమి సుబుద్ధి కలిగినది కాబట్టే ఆ ఇద్దరు కోడండ్రు ఆమె మీద దయచూపారు. కోడళ్ళు క్రొత్తగా కాపురానికి వచ్చినప్పుడు వారికి తిండి విషయంలో, వస్త్రాల విషయంలో, పనుల విషయంలో, వారి అనారోగ్యాల విషయంలో వారి కష్టాలలో అన్ని విషయాలలో వారికి సుబుద్ధి గలదై వుండిందన్నమాట. పైన కొన్ని విషయాలలో అత్తయైన నయోమి కోడలైన రూతు విషయంలో కనుపరచిన సుబుద్ధిని మనము చదివాం. "సుబుద్ధి గల భార్య యెహోవా యిచ్చిన దానము" అని సామె 19:14లో మనమెరుగుదుము. కానీ సుబుద్ధి గల భార్యలు మాత్రమే కాదు సుబుద్ధి గల అత్తలు కూడా యెహోవా ఇచ్చిన దానమే అవుతుంది. అత్తలారా! పెద్దలైన మీరు సుబుద్ధి గలవారై వుంటే మీ కోడండ్రు (మీకంటే చిన్నవారు) మీపట్ల సుబుద్ధి గల కోడళ్ళుగా ఉంటారు. కోడళ్ళకే కాదు వాక్యము మీకు కూడ వాక్యము అవసరం. ఈ సందర్భంలో అత్తలకు ఉండవలసిన సుబుద్ధి విషయమై ప్రభువు ప్రేరణతో కొన్ని సలహాలు వ్రాస్తున్నాను.

**అత్తలకు కొన్ని సలహాలు:-**

1). అత్తగారు సుబుద్ధి గలిగి వుండాలంటే, ఆమె బుద్ధి అనేది ఆమె పెట్టే దానిలో ఆమె యిచ్చే దానిలోనే తెలిసిపోతుంది. క్రొత్తగా మన యింటికి కాపురానికి వచ్చిన కోడలు 6 ఇడ్లీలు తినిందని ప్రక్కింటివాళ్ళతో అత్త చెప్పడం మంచి బుద్ధి అవుతుందా? నాన్నా! క్రొత్తగా వచ్చావని సిగ్గుపడొద్దు, నీకు ఎంత కావాలో అంత తింటూ వుండు. ఏమైనా కావాలంటే అడుగు, మొహమాటపడవద్దు. ఇది నీ ఇల్లు అని క్రొత్త కోడలికి అత్తగారు ధైర్యం చెప్పి భరోసా ఇవ్వాలి.

2) కోడలంటే పనిచేసే పనిమనిషి కాదు, వంట చేసే వంట మనిషి కాదు, బట్టలు ఉతికే చాకలి మనిషికాదు. ఆమె మన కుమారుని భార్య. కోటి క్రొత్త ఆశలతో క్రొత్త కాపురం పెట్టడానికి మన ఇంటికి వచ్చిన కొత్త కోడలు ఆమె అని అత్తలమైన మనం తెలిసికోవాలి.

3) తెలియక క్రొత్త కోడలు ఏమైనా తప్పు చేస్తే క్షమించాలి. కానీ కోడలు తప్పు చేస్తే "అంతా వాళ్ళ అమ్మ బుద్ధే, ఈమెను కాదు ముందు వాళ్ళమ్మను అనాల్సింది, అంతా ఆ జాతి బుద్ధే" అని కోడలిని కించపరచకూడదు. మన కుమార్తె తప్పుచేస్తే ఎన్నిమార్లు క్షమించామో అలాగే తెలియక కోడలు తప్పుచేస్తే క్షమించుకోవాలి.

4) నీ పాత విధానములోనే కోడలు పనిచేయాలి అనుకొనకూడదు. కోడలు తన క్రొత్త ఐడియాల ప్రకారము అధునాతన పద్ధతిలో ఏవైనా పనులు చేస్తే దానికి అనుమతించాలి, అప్రిషియేట్ చేయాలి. ఎంకరేజ్ చేయాలి. 'నా పద్ధతిలోనే చేయాలి' అని మొండిపట్టు పట్టకూడదు.

5) కోడలు, కొడుకు ఇద్దరూ సంతోషంగా వుంటే అత్త చూచి ఆనందించివారి చల్లని దాంపత్య జీవితాన్నిబట్టి ప్రభువును స్తుతించాలి. అత్తవైన నీవు ఒకప్పుడు నీ యవ్వనంలో నీ భర్తతో అలాగే ఆనందంగా వుండాలని కోరుకున్నదానివే కదా! ఆ విషయాన్ని గుర్తు తెచ్చుకో! కోడలి ఆనందాన్ని కోరుకో.

6) ఆ అమ్మాయి మన యింటిలో భయం, భయంగా కాకా ఫ్రీగా వుండేటట్లు ధైర్యపరచి మాట్లాడాలి.

7) మనమంద్రు, మనుమరాండ్రు ఏమైనా తప్పులు చేస్తే అంతా వాళ్ళ అమ్మలాగే చేశారని కోడలని తక్కువ చేసి మాట్లాడకూడదు. మనమంద్రు, మనుమరాండ్రు మంచిపనులు చేస్తే అంతా వాళ్ళ నాన్నలాగే చేశారని కొడుకుల్ని గొప్ప చేసి మాట్లాడకూడదు.

8) కోడలిని గురించి అత్త తన కొడుకుకు ఏమేమో విరోధంగా చెప్పి కొడుకు మనసును పాడుచేసి, వారి క్రొత్త కాపురంలో కలతలు తీసికొని రాకూడదు.

9) ఆ అమ్మాయి ప్రార్థన చేసికొనుటకు బైబిలు చదువుకోవడానికి కొంత సమయాన్ని ఆ అమ్మాయికి అత్త కల్పించాలి. ఎప్పుడు పనులు చేయించడం మాత్రమే కాదు.

10) ఫ్యామిలి గెట్ టు గెదర్ జరిగినప్పుడు పనులన్ని కోడలికి మాత్రమే చెప్పకూడదు.

మన కూతురికి కూడ చెప్పాలి. పనిభారమంతా కోడలికే అప్పగించకూడదు. చాలామంది కూతుర్లకు పని చెప్పరు. కోడళ్ళకే పని చెబుతారు. అలాకాక అందరూ కలిసి పనులు చేసుకోవాలి.

11) మన కూతురికి ఎన్ని రూపాయల చీర తీశామో మన కోడలికి కూడా అన్ని రూపాయల చీరనే తీసివ్వాలి. మన కుమార్తె పెళ్ళి తరువాత వేరే ఇంటికి వెళ్ళింది. కానీ వివాహం ద్వారా మన ఇంటికి వచ్చిన కోడలే మన కూతురు అనుకోవాలి.

12) పని అయిపోయిన తరువాత కొంచెము విశ్రాంతి (rest) తీసికొని రమ్మని అత్త కోడలికి చెప్పి ఆ అమ్మాయి విశ్రాంతిని గురించి పట్టించుకోవాలి.

13) కోడలు అన్నము కడుపునిండుగా తినిందా లేదా అని అత్త కోడలిని గమనిస్తూ ఉండాలి. ఆమెను గమనించుకోవాలి. వంట చేసేటప్పుడు తినివుంటుందిలే అనుకోనకూడదు.

14) రోగమో, బలహీనతయో వస్తే "మీ అమ్మ వాళ్ళింటికి వెళ్ళి బాగు చేయించుకొనిరా" అని వాళ్ళమ్మ దగ్గరికి పంపకూడదు. మీ అనారోగ్యాలలో అమ్మాయిని మీ పరిచర్య కొరకు వాడుకొని, ఆమె అనారోగ్యంలో ఆమెను బాగు చేయించుకొని రమ్మని ఆమె అమ్మ గారింటికి పంపించడం మంచిది కాదు. ఈ యింటిలో ఆమెతో చాకిరి చేయించుకొని, ఆమెకు అనారోగ్యమైతే వాళ్ళ అమ్మగారింటికి పంపడము ఎంత కరెక్ట్? ఎంత సబబు? ఆ అమ్మాయిని ప్రేమతో మనమే బాగు చేయిద్దాం. అవసరమైతే ఆమె అమ్మనే మన యింటికి పిలిపిద్దాం.

15) నీ బిడ్డను కాపురానికి పంపేటప్పుడు అన్ని పనులు నేర్పించి పంపలేకపోతే నేను ఒప్పుకోను అని అత్తగారు తన కోడలి తల్లియైన వియ్యంకురాలితో చెప్పి, వచ్చే కోడలిని భయపెట్టకూడదు.

16) పతి ప్రియురాలై, శిశు ప్రియురాలై, నిందించుటకు విరోధికి అవకాశమియ్యకుండా వుండాలని కోడలికి అత్తగారు దైవోపదేశం చేయాలి.

నేను చదివిన ఒక దిన పత్రికలోని అత్తలకు వ్రాయబడిన కొన్ని మంచి సలహాలు ప్రయోజనకరమని క్రింద పొందుపరుస్తున్నాను.

1. అత్తనని 'అహం' వద్దు. అత్తవైన నీవు కూడా ఒకింటి కోడలివే అనే సత్యం మరువవద్దు. కోడలంటే మీ అధికారం లాగేసుకొనే శత్రువు కాదు.

2. కోడలిది కూడా మీ బిడ్డ వయస్సే. పొరపాటు చేసినా తల్లిలా కడుపులో పెట్టుకోవాలి.

3. 'కోడలు' అంటే ఇంట్లో కీలకమైన వ్యక్తి. అన్ని విషయాలు ఆమెతో కూడా చర్చించండి.

4. కోడలు, కుమారుడు సరదాగా మాట్లాడుకుంటూవుంటే బాధ పడకండి. క్రొత్తగా కాపురానికి వచ్చిన రోజుల్లో మీ భర్తతో మీరు అలాగే వుండాలనుకున్నారనేది గుర్తు చేసుకోండి.

5. చెట్టాపట్టాలు వేసుకొని వారిద్దరూ బయటికి వెళ్తుంటే అసూయ పడవద్దు. పెళ్ళైన

క్రొత్తలో అలా తిరగాలని మీరు అనుకున్నవారే అందులో తప్పేముంది? ఆధునికులు కనుక వారి అభిరుచుల్ని, చిలిపి సరదాలను తప్పుపట్టవద్దు.

6. కట్నాలు, కానుకలు తక్కువ తెచ్చిందని ఆమెను గౌణగవద్దు. డబ్బు లాంఛనాలకన్నా మీలో ఒకతెగా ఇమిడిపోయే కోడలు దొరికిందనేది ఎక్కువ సంతోషం కదా!

7. మీ కుటుంబ పద్ధతులు పాటించలేదని తిట్టవద్దు. దాదాపు 2 శతాబ్దాలపాటు ఒక పద్ధతికి అలవాటు పడిన వ్యక్తి హఠాత్తుగా మారాలంటే కష్టం. అలా మారడానికి మీరెంత కష్టం అనుభవించారో గుర్తు చేసుకొని, మంచి మాటలతోనే వారికి నచ్చచెప్పండి.

8. మీ మాటే చెల్లాలని అనుకోవద్దు. ఒకవేళ ఆమె ఈరోజు మీ మాట విన్నా మనస్సులో మీ పట్ల విముఖత పెంచుకుంటుంది.

9. కోడల్ని, కూతురుని ఒకేలాగ చూడండి. కోడలు కూడా మీలాంటి మరొకరి కన్నకూతురే అని గుర్తుంచుకోండి.

10. కోడల్ని కూతురిగా చూస్తే, ఆమె మిమ్మల్ని తల్లిలా చూస్తుందనే వాస్తవాన్ని మరచిపోకండి.

ఈలాగున రూతు 1:8లో ప్రకారము నయోమి తన కోడండ్రతో మీరు నా యెడలను, చనిపోయిన వారి యెడలను దయచూపారని చెప్పిన సందర్భములో అత్త, కోడండ్రకు కావలసిన ఉపదేశాలను, సలహాలను కొన్నింటిని మనము జ్ఞాపకము చేసికొన్నాము. నయోమి అంతేకాక మీలో ఒక్కొక్కతె పెండ్లి చేసికొని తన యింట నెమ్మది నొందునట్లు యెహోవా దయచేయును గాక! అని దీవించింది. ఇంట నెమ్మదినిచ్చేవాడు దేవుడే కానీ ఇక ఏదియూ, ఎవరును ఇవ్వలేరు. 119:65 నీ ధర్మశాస్త్రమును ప్రేమించువారికి ఎంతో నెమ్మది కలదు అను మాట ప్రకారము ఇంటిలో నెమ్మది దొరకదు కాని యెహోవా మనకిచ్చిన ఇంటిలో ఆయన ఇచ్చిన వాక్యాన్ని చదివినప్పుడే నెమ్మది కలుగుతుంది. ధర్మశాస్త్రాన్ని అనగా 5 పుస్తకాలను మించి 61 పుస్తకాలు కలిపి మొత్తము 66 పుస్తకములు కలిగిన గ్రంథాన్ని చదువుచున్నావా? సమయమప్పగించి ధ్యాన పూర్వకముగా చదువుచున్నావా? మరియవలె వాక్యమును ఆయన పాదాల దగ్గర గడుపుతున్నావా? రోజుకు ఎంత సమయం స్త్రీలు వాక్యం దగ్గర గడుపుతున్నారు? ఎంత ఎక్కువ సమయం గడిపితే అంత మంచిది. కీర్త 94:13వ. ప్రకారం నీతిమంతుల కష్ట దినములు పోగొట్టి వారికి నెమ్మది నిచ్చు వాడు దేవుడే. మనకు నెమ్మదిచ్చాడు. కానీ తన కుమారుని మాత్రం విలా 3:27 ప్రకారము "నెమ్మదికిని ఆయనకును బహుదూరము చేశాడు". కనుక ఈ లోకములో మనకు నెమ్మది నిచ్చువాడు ప్రభువే. ఇలా చెప్పి నయోమి తన కోడళ్ళకు ముద్దు పెట్టింది. 9వ-10వ. లో అంతట వారు యెలుగెత్తి ఏడ్చారని వ్రాయబడింది. లోకంలో ఎవరైనా అత్త దూరము వెళ్తూంటే ఏడుస్తారా? ఏడ్వరు. 'అత్త లేని కోడలు ఉత్తమురాలు, కోడలు

లేని అత్త గుణవంతురాలు' అని సామెతలు చెప్పుకుంటారు. కానీ ఈ కుటుంబములో మాత్రము అత్త ఎడబాటు వారికి దుఃఖమును కలిగిస్తోంది. ఇక్కడ అత్త ద్వారా వారు దేవున్ని తెలుసుకున్నారు. ఆయన మార్గాన్ని తెలుసుకున్నారు. మనకు ప్రభువును చూపింది పరిశుద్ధాత్మడే. ఆ పాపాన్ని గూర్చి నీతిని గూర్చి రాబోవు తీర్పును గూర్చియు మనకు తెలిపినవాడు పరిశుద్ధాత్మడే. (యోహా 16:8) కాబట్టి నయోమిని పరిశుద్ధాత్మ దేవునికి సాదృశ్యముగా చెప్పుకుంటే మంచి వాక్య తలంపులు మనము గ్రహించగలము.

పరిశుద్ధాత్మ కొరకు, లేదా దేవుని కొరకు ఈ వేళ మనము ఏడ్చేవారుగా, చింతపడేవారుగా, భారం కలిగిన వారుగా వుంటున్నామా? యోహా 20:13వ.లో మగ్దలేని మరియను దూతలు ప్రభువు అమ్మా! ఎందుకు ఏడ్చుచున్నావు? అంటే నా ప్రభువును ఎవరో ఎత్తికొని పోయిరి" అని చెప్పి ఆమె ప్రభువు కొరకు ఏడుస్తోంది. స్త్రీలు చీరల కొరకు ఇండ్ల కొరకు, లోక వస్తువుల కొరకు, బంగారు నగల కొరకు ఏడుస్తారు. కాని ప్రభువు కొరకు సంఘాల కొరకు ఏడుస్తున్నామా?

పౌలుకు సంఘములను గూర్చిన చింత వుండింది. (2కొరి. 11:28). ఎఫెసు సంఘములో మృగముల్లాంటి వారికోసం 3 సం॥లు కన్నీటితో మానక బుద్ధి చెప్పాడు. ప్రార్థనల్లో తిమోతి కూడ కార్చే కన్నీళ్ళను పౌలు 1 తిమో 1:3-5లో జ్ఞాపకం చేసుకుంటున్నాడు. ఎఫె 4:30 ప్రకారము మనము "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడదు" కానీ మనము ఆయన కొరకు, ఆయన సంఘాల కొరకు కన్నీటి ప్రార్థన చేయవలసినవారై యున్నాము. కారణము యెష 8:13వ.లో "మీరు ఆయన కోసమే దిగులుపడవలెను" అని వ్రాయబడి ఉన్నది.

12వ. నా కుమార్తెలారా! పురుషులు లేక మీరు ఒంటరికత్తెలై యుందురా అది కూడదు అని నయోమి కోడండ్రతో చెబుతోంది. అవును దేవుని వాక్యము 1 తిమో 5:14లో కావున యవ్వన స్త్రీలు వివాహము చేసికోవాలని వ్రాయబడింది. ఒంటరికత్తెలై వుండకూడదు. పురుషుడైన ఆదామునే దేవుడు నరుడు ఒంటిరిగా వుండుట మంచిది కాదు అని చెప్పిన దేవుడు, స్త్రీ ఒంటరికత్తెయై యుండుటకు ఒప్పుకుంటాడా? దేవుడు ఏకాంగులను సంసారులుగా చేయువాడు (కీర్త 68:6). చాలామంది యవ్వనరాండ్రు నేడు పెండ్లి విషయము అసల్యము చేస్తున్నారు. సంబంధాలన్ని పోగొట్టుకుంటున్నారు. పెళ్ళిళ్ళ విషయములో "హై థింకింగ్" కలిగి వుంటున్నారు. ఏ సంబంధాన్ని ఒప్పుకోకుండ చివరికి 'వయస్సు అధికమై' పెళ్ళి కాక నిలబడిపోతున్నారు. పెళ్ళి చేసుకున్నా 'పిల్లలను కనము మాకు పిల్లలు వద్దు' అంటున్నారు. 1 తిమో 5:14లో యవ్వన స్త్రీలు వివాహము చేసికొని పిల్లలను కని' అని వ్రాయబడింది. "పిల్లలను కని వారిని కష్టపడి పెంచినా వారు లోబడక పోవడం ఈ బాధలన్ని ఎందుకు అనుభవించాలి?" అని ఈనాడు చాలామంది ముఖ్యంగా అమెరికాలో ఒక్కొక్క ఇంటిలో ఒకటి లేక రెండు కుక్కలను, పిల్లులను, ఎలుకలను, పెంచుకుంటున్నారు. భక్తి గల దేవుని పిల్లలు పెళ్ళి చేసుకున్నా పిల్లలు పుట్టకపోతే అనాథలైన పిల్లలనైనా

పెంచుకుంటున్నారు కానీ ప్రభువును నమ్మని వారు చాలామంది కుక్కలనే పెంచుకుంటున్నారు. పిల్లలను కని వారిని పెంచమని దేవుని వాక్యం చెబుతోంది.

కావున ప్రభువు సంఘమనే కన్యకను కూడ ఒంటరిగా వుండకూడదని పౌలు ద్వారా 2 కొరి 11:2 ప్రకారము క్రీస్తుకు అను ఒకే పురుషునికి సమర్పించి ప్రధానము చేశారు. కనుక సంఘమా! నీవు ఒంటరికత్తెవి కావు. నీవు ప్రభువుతో కూడా వున్నావు. ఆయన మనతో, మనలో ఎల్లప్పుడూ వుంటున్నాడు.

13వ.లో నయోమి యెహోవాను గూర్చి విరుద్ధ సాక్ష్యము పలుకుతోంది. (ఎ) 13వలో. యెహోవా విరోధి అయ్యాడని, (బి) 20వలో సర్వశక్తుడు నాకు చాలా దుఃఖము కలుగజేసెను. (సి) 21వ. యెహోవా నన్ను రిక్తురాలినిగా చేసెను. (డి) యెహోవా నా మీద విరుద్ధముగా సాక్ష్యము పలికెను. (సి) సర్వశక్తుడు నన్ను బాధపరచెను అని 5 రకాలుగా నయోమి ప్రభువును గూర్చి విరద్ధమైన సాక్ష్యము పలికినది. మొదటిది యెహోవా విరోధి అయ్యాడని చెప్పింది. దేవుడు మనకు ప్రాణ స్నేహితుడు. తన ప్రాణాన్ని మన కొరకు ధారపోసిన దేవుడు. కాని దేవుడు ఎప్పుడు విరోధి అవుతాడు? న్యాయా 2:10-15వరకు చదివితే 'ఎప్పుడైతే యెహోవా ఎదుట ఇశ్రాయేలీయులు కీడుచేసి, యెహోవాను విసర్జించి బయలుదేవతలను పూజించి, వాటికి సమస్కరించి యెహోవాకు కోపము పుట్టించారో, అప్పుడు దేవుడు దోచుకొనువారి చేతికి వారిని అప్పగించాడు. వారు ఇశ్రాయేలీయులను దోచుకున్నారు. వారిని వారి చుట్టునున్న వారి శత్రువుల యెదుట నిలువలేక, వారు పోయిన ప్రతి స్థలములో వారికి బాధ కలుగజేయుటకు యెహోవా వారికి శత్రువయ్యాడట. వారికి మిక్కిలి ఇబ్బంది కలిగించాడట. పై వాక్యమునుబట్టి నయోమి ఇద్దరు కుమారులు కెమోషు దేవతను పూజించే మోయాబు దేశానికి వెళ్ళి విగ్రహారాధికులైన స్త్రీలను పెండ్లి చేసుకున్నారు. కనుకనే దేవుని కోపము వారిమీదికి వచ్చింది. దేవుని నిబంధనను వారు వ్యర్థము చేశారు కనుక దేవుని కోపము వారిమీదకి వచ్చి వారిద్దరూ పిల్లలు పుట్టకముందే భార్యలను అనాథలను చేసి వెళ్ళిపోయారు. దేవుని చిత్తాన్ని మనమెన్నడు వ్యర్థము చేయకూడదు. మనము దేవుని మాట చొప్పుననే జీవించాలి. దేవునికి విరోధులమై జీవించి కొద్దికాలము యిహలోక యిచ్ఛల కొరకు దేవుని నిబంధనను అధిగమించి దీర్ఘకాల నష్టాన్ని పొందుట భావ్యమా? కనుక "ప్రభువు లేని ప్యాలెస్‌లెందుకు? ప్రభువుతోటి పూరి పాకయేమేలు" అని ఒక భక్తుడన్నట్లు నయోమి కుమారులు, భర్త దేవుడు లేని చోటుకెళ్ళారు. అక్కడైనా ఎలీమెలెకు ఒక్క బలిపీఠాన్నైనా అబ్రాహాములాగ కట్టలేదు. కనీసం ఎన్నడైనా ప్రార్థించినట్లుగా ఋజువుపరిచే ఒక్క వాక్యమైన ఆయన విషయంలో వ్రాయబడలేదు. నిజదేవున్ని ఆరాధించని అందమైన అన్యులైన అమ్మాయిలను వివాహమాడి, ప్రభువు ఆజ్ఞలను

విసర్జించినందున గొప్ప నష్టాన్ని మరణరూపంలో పొందారు. మహా వ్యాధిగల మహెూన్లను, మరియు కృషించిన కిల్యోను.

రెండవదిగా రూతు 1:20వ.లో సర్వశక్తుడు నాకు చాలా దుఃఖము కలుగజేసెను అని నయోమి యెహోవా దేవున్ని అంటున్నది. దేవుడు మనల్ని దుఃఖపెట్టుట వలన తాను సంతోషించే శాడిస్ట్ గాడ్ కాదు. యెష 65:13 వ.లో నా సేవకులు సంతోషించెదరు. నా సేవకులు హృదయానందముచేత కేకలు వేసెదరు అని దేవుడు వ్రాయించాడు. తన పిల్లలు దుఃఖిస్తే తాను కూడా దుఃఖపడేవాడు. యోహా 11:33వ.లో "లాజరు చనిపోయిన సందర్భములో మరియ ఏడ్చుచు ఆమెతో కూడ వచ్చిన యూదులును ఏడ్చుటయు యేసు చూచి కలవరపడి ఆత్మలో మూల్గెను" అని చదువుచున్నాము. 36వ.లో "యేసు ప్రభువు అతనిని ఎక్కడ ఉంచితిరి" అని అడుగగా వారు "ప్రభువా వచ్చిచూడుమని" ఆయనతో చెప్పగా "యేసు కన్నీళ్ళు విడిచెను" అని వ్రాయబడింది. 38వ.లో కాబట్టి యూదులు అతనిని ఏలాగు ప్రేమించెనో చూడుడని చెప్పుకున్నారు. భక్తులు శ్రమల కొలిమిలో వున్నప్పుడు (షద్రక్, మేషాకు, అబెద్నెగో) ప్రభువు వారితో నాలుగవవాడై వారితో కూడ అగ్ని మధ్యను సంచరించలేదా? ఏడ్చువారితో ఏడ్వండి. సంతోషించువారితో సంతోషించుడి అని చెప్పే ప్రభువు మనకు చాల దుఃఖము కలిగించాలనుకునే దేవుడా? ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి అని వ్రాయించిన దేవుడు మనల్ని చాలా దుఃఖపరుస్తాడా? కాదు కాదు మన పాపములను, అపరాధములను బట్టి మనమే ఆయనను ఏడ్పించాము. మనమే ఆయన మనకిచ్చిన స్థానం నుండి ఆయనకు దూరంగా వెళ్ళి మనమే దుఃఖాలను కొని తెచ్చుకుంటాం. మీ సంతోషము పరిపూర్ణమగునట్లు అడగండి అని చెప్పిన ప్రభువు (యోహా 16:24) మనకు సంపూర్ణ సంతోషాన్నిచ్చి తాను మరణమగునంతగా దుఃఖాక్రాంతుడయ్యాడు. గెత్సెమనే తోటలో, ఆ దుఃఖమునుబట్టి ఆయన చెమటలో రక్తము మిళితమై శరీరం బయటికి వచ్చింది. ఆయన సన్నిధిలో సంపూర్ణ సంతోషము (కీర్త 16:11) మనకిచ్చి, ప్రభువు మరణమగునంతగా ఆయన ప్రాణము దుఃఖములోనికి మునిగిపోయి చివరకు ప్రాణమే పెట్టాడు.

1:20లో నయోమి రెవసారి యెహోవా నన్ను రిక్తురాలినిగా చేశాడని ఆయన మీద వ్యతిరేక సాక్ష్యము చెప్పింది. అంటే ఒకప్పుడు ఆమె నిండు హస్తములతో వుండిందన్నమాట. కరువునుబట్టి డబ్బును చేతిలో పెట్టుకొని మోయాబులో కొనుక్కొని తినటానికి ఆమె, ఆమె కుటుంబం వెళ్ళారు. ఇప్పుడు డబ్బులన్ని ఖర్చయ్యాయి. చేతిలో చిల్లి గవ్వలేదు. ఒకప్పుడు దేవుడు ఆది మానవునికి ఆది 1:26లో 'మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి అని అన్నీ మానవుని చేతికి అప్పగించాడు. తన బిడ్డల కడుపులను దానములతో నింపే (కీర్త 17:14) దేవుడుగా

ఉన్నాడు. తమ ఆస్తిని తమ పిల్లలకు విడిచిపెట్టే రీతిగా వారిని దేవుడు నింపియున్నాడు. కానీ ప్రభువు, ఆయన ఆజ్ఞలను మనము విడిచి తిరిగితే రిక్తహస్తాలే కనబడుతాయి. తప్పిపోయిన కుమారుడు తండ్రి ఇచ్చిన ఆస్తినంతటిని తీసికొని దూరదేశానికి వెళ్ళి దుర్వ్యాపారము వలన రిక్తహస్తాలతోనే తండ్రి ఇంటికి రాలేదా? అలాగే నయోమి మోయాబులో ఆత్మలను, ఆనందాన్ని ఆస్తిని అంతటిని పోగొట్టుకొని రిక్తహస్తాలతో యూదా దేశానికి వచ్చింది. తప్పిపోయిన కుమారుడు తండ్రి ఇంటికి వచ్చినప్పుడు తండ్రి సమస్తముతో ఎలా దీవించాడో ప్రభువు తప్పిన మనల్ని తన సంఘమనే ఇంటికి వచ్చినప్పుడు కోల్పోయిన వాటన్నిటిని మనకిచ్చి మన హస్తాలను, యిండ్లను, కడుపులను, అన్నింటిని నింపుతాడు. సంఘమంటే సమస్తమును పూర్ణముగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది. ప్రియ సోదరీ! ప్రభువునకు గత కొన్ని సం॥రాలుగా దూరమైపోయిన నీవు ఆత్మీయముగా రిక్తహస్తాలతో, రిక్త హృదయముతో వుంటున్నావా? దేవుని వాక్యమనే ధనము, ఐశ్వర్యము లేకుండా ఆత్మీయ కరువుతో వుంటున్నావా? నీ లోక సంబంధమైన డబ్బు నీకు ఆత్మీయ ఐశ్వర్యాన్ని ఇవ్వలేదు. తిరిగి బైబిల్ నొద్దకు రా. వాక్యము దొరికే రొట్టెల యిల్లైన నీ స్థానిక సంఘానికి రా! వాక్యముతో నీ రిక్త హృదయం నింపబడుతుంది. ఎందుకంటే ఆయన మందిరములో ఆ వాక్య ఆనంద ప్రవాహమున్నది. (కీర్త 36:8). మన రిక్తతను పోగొట్టుట కొరకై ప్రభువు ఫిలి 2:7వ ప్రకారముగా ప్రభువు "మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా చేసుకున్నాడు కదా! మన కొరకై రిక్తుడై పుట్టి ప్రభువు ఏ కనీస వసతులు, వస్తువులు, వాహనాలు, ఏవీ కూడా లేని పేద కుటుంబములో పుట్టాడు. మగ శిశువు జన్మిస్తాడని 9 నెలలకు పూర్వమే తెలుపబడినను మరియ ఆ శిశువుకు తొడిగించడానికి ఒక అంగీనైనను ఆమె కుట్టించలేకపోయిందంటే ఆమె ఎంత పేదదో ఆలోచించాలి. ఊయలలేని రిక్తుడుగా ప్రభువు పశువుల తొట్టిలో జన్మించడానికి ఇష్టపడ్డాడు. పన్ను కట్టడానికి అరషెకెలు లేకుండా పుట్టిన రిక్తుడుగా తన్ను తానే చేసుకున్నాడు ప్రభువు. ఈ లోకపు దాసులకైనా అంతో యింతో పైసలుంటాయి. కానీ దాసుని స్వరూపాన్ని దాల్చిన ప్రభువుకు అరషెకెలు లేదు. మనలను భాగ్యవంతులుగా చేయటానికి ఆయన మన నిమిత్తమై దరిద్రుడుగా రిక్తుడుగా జన్మించి మనలను సమస్తముతో నింపాడు. ప్రభువు ప్రేమను తలపోయుచుండగా హృదయము ద్రవీభవిస్తుంది కదా!

4వసారిగా నయోమి 1:21వ.లో "యెహోవా నా మీద విరుద్ధమైన సాక్ష్యము పలికెను" అని గుంపుకూడి తన యొద్దకు వచ్చిన బేత్లెహేము ఊరివారందరికి యెహోవా మీద విరుద్ధ సాక్ష్యము చెప్పింది. దేవుడు ఎప్పుడు మనకు విరోధియై విరుద్ధ సాక్ష్యము చెబుతాడు? యెష 63:10లో వారు తిరుగుబాటు చేసి ఆయన పరిశుద్ధాత్మను దుఃఖింపచేయగా ఆయన వారికి విరోధియాయెను అని వ్రాయబడింది. అన్యులతో

వియ్యమొందకూడదని ప్రభువు వారికి చెప్పగా వారు తిరుగుబాటు చేసిన కారణాన దేవుని ఆత్మను వారు దుఃఖింపచేయగా దేవుడు నయోమి కుటుంబానికి విరోధి అయ్యాడు. పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి అని వాక్యము ఎఫె 4:29,30 మనకు తెలుసు కదా. అలా పరిశుద్ధాత్మను దుఃఖపరిస్తే దేవుడు తానే వారితో యుద్ధము చేస్తాడట. ఆ ప్రకారము దేవుడు నయోమి కుటుంబానికి విరోధి అయ్యాడు.

5వసారి 1:21 వచనములోనే నయోమి సర్వశక్తుడు నన్ను బాధపరచాడు అని చెప్పింది. దేవుడు నిర్నిమిత్తముగా ఎవరిని బాధపరచడు. బాధపరచబడు వారి నిరీక్షణాస్పదము ఎన్నటికిని నశించదు. మన నిరీక్షణాస్పదము ప్రభువే. (కీర్త 9:18) ప్రభువే మన బాధలన్ని సిలువలో అనుభవించాడు. కానీ బాధలు మనమెప్పుడు తెచ్చుకుంటాము? యిర్మీ 2:19వ నీ దేవుడైన యెహోవాను విసర్జించుటయు నీకు నా యెడల భయభక్తులు లేకుండటయు బాధకును, శ్రమకును కారణమగునని నీవు తెలిసికొని గ్రహించునట్లు నీ చెడుతనము నిన్ను శిక్షించును. నీవు చేసిన ద్రోహము నిన్ను గద్దించునునని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. ఈ వాక్యమునుబట్టి యెహోవాను విసర్జించి భయభక్తులు మానుకుంటే బాధ శ్రమ వస్తాయని వ్రాయబడినది. కనుక ఇదే విషయమే నయోమి కుటుంబంలో జరిగింది. ప్రియ సోదరీ! మనము కూడా మన జీవితాలను పరీక్షించుకొని దేవున్ని ఎక్కడైనా విసర్జించామా? (లేక ఆయన న్యాయవిధులను, ఆజ్ఞలను ) బాధ, శ్రమ అందుకే వచ్చాయేమో ఆలోచించుకుంటే మంచిది. కీర్తన 107:17లో బుద్ధిహీనులు తమ దుష్ట ప్రవర్తనచేతను, తమ దోషములచేతను బాధ తెచ్చుకొందురు అని వ్రాయబడింది.

ఈ 5సార్లు దేవుని గురించి నయోమి విరుద్ధ సాక్ష్యము చెప్పింది. ప్రియ సోదరీ! ప్రభువును నమ్ముకున్న క్రొత్తలో, ఆత్మీయంగా ఉజ్జీవంగా సాగిన దినాలలో మంచి సాక్ష్యాన్ని ప్రభువును గూర్చి చెప్పావేమో! కొన్ని సం॥ములు గతించాక ప్రస్తుతము ప్రభువును గురించి నీ సాక్ష్యము ప్రభువుకు అనుకూలంగానా? లేక విరుద్ధంగా సాక్ష్యము చెబుతున్నావా? ఒకటికి 5సార్లు నయోమి విరుద్ధ సాక్ష్యము చెప్పింది. నిజంగా ప్రభువు మనకు విరోధియా? ఆయన మనలను బాధపరుస్తాడా? మనలను రిక్తహస్తాలతో పంపుతాడా? చాలా బాధ కలిగిస్తాడా? క్రింది వాక్యము ఏమి చెబుతుందో చూద్దాం. యోబు 34:10-12 దేవుడు అన్యాయము చేయుట అసంభవము. సర్వశక్తుడు న్యాయము తప్పడు. దేవుడు ఏ మాత్రము దుష్కార్యము చేయడు. నరుల క్రియలకు తగినట్లుగా ఫలము ఆయన వారికిచ్చును. అందరికి వారి వారి మార్గములను బట్టి వారికి, ఫలమిచ్చును. యోబు 23:5. ఆయన తన అధిక బలముచేత నాతో వ్యాజ్యమాడునా? ఆయన ఆలాగున చేయక నా మనవి ఆలకించును. యెహె 2:3-4 విగ్రహములు పెట్టుకొను పట్టణమా! నీవు చేసిన నరహత్యలచేత నీకు నీవే

నేరస్థాపన చేసికొంటివి. నీవు పెట్టుకొనిన విగ్రహములచేత నిన్ను నీవే అపవిత్రపరచుకొంటివి అని వ్రాస్తున్నాడు ప్రభువు. నీకు నీవే శిక్ష తెచ్చుకొంటివి. శిక్షా సంవత్సరములు వచ్చుటకు నీవే కారణమైతివి. విలా 3:32,33 హృదయపూర్వకముగా ఆయన నరులకు విచారమునైనను, బాధనైనను కలుగజేయడు. ఆయన బాధపెట్టినను తన కృపాసమృద్ధినిబట్టి జాలిపడును. ఈ మాటలన్నిటినిబట్టి యెహోవా తన ప్రజలను బాధపెట్టడు. కాని మనమే మన ప్రవర్తన ద్వారా బాధను తెచ్చుకుంటున్నాము అని అర్థమవుతుంది. మన జీవితాలను సరిచేసుకొని ప్రభువును గూర్చి మన జీవితంలో ఆది నుండి అంతము వరకు మంచి సాక్ష్యమును ఇద్దాం. ఇలా నయోమి తాను తన కోడండ్రకంటే ఎక్కువ నొప్పిలో ఉన్నప్పటికి కోడండ్ర మేలును కోరుకుంటూ మీరు మీ తల్లిదండ్రుల యిండ్లకు వెళ్లమని వారితో చెప్పినప్పుడు వారిద్దరూ ఎలుగెత్తి ఏడ్చారు. ఓర్పా తన అత్తను ముద్దు పెట్టుకొని వెళ్ళిపోయినట్లు 14వ.లో చూస్తున్నాము. 8వ.లో అత్త ముద్దుపెట్టింది. 14వ.లో ఓర్పా ముద్దు పెట్టింది. ముద్దు ప్రేమకు గుర్తుగా వున్నది. ఓర్పా ప్రేమ ఉన్నట్లు ముద్దు పెట్టి అత్తను విడిచి వెళ్ళిపోయింది. "పగవారు లెక్కలేని ముద్దులు పెట్టును" అని సామె 27:6లో వ్రాయబడినది. రూతువలె అత్తను హత్తుకోలేని ఓర్పా ముద్దు పెట్టడమెందుకు? ఇస్కరియోతు యూదా ముద్దుపెట్టి ప్రభువును బంట్రౌతులకు అప్పగించాడు. ప్రేమ ఉన్నట్లు ముద్దు పెట్టిన నటన యెందుకు? కానీ రూతు పైకి ముద్దు పెట్టకపోయినా ప్రేమగలదై అత్తను హత్తుకుంది. అత్త పరిశుద్ధాత్మకు సూచనగా వుందని ఇంతకు మునుపు ధ్యానించాము. ఓర్పా మాత్రము ఇస్కరియోతు ముద్దుపెట్టి ప్రభువును మరణానికి అప్పగించి వెళ్ళినట్లు అత్తను ఒంటరితనానికి అప్పగించి వెళ్ళిపోయింది. ప్రియసోదరీ! నీవు ప్రభువును విడిచి వెళ్తావా? ఆయన నిన్ను విడవను నిన్ను యెన్నడును యెడబాయనని చెప్పాడే. (హెబ్రీ 13:5). భక్తి విడచినవాని మార్గములు వానికే వెక్కసమవుతాయని బైబిల్ (సామె 14:14) వ్రాయబడింది. నాకు వేరుగా వుండి మీరేమియు చేయలేరని వాక్యములో (యోహా 15:5) వ్రాయబడింది. దేమా ఇహలోకమును స్నేహించి నన్ను విడచి థెస్సలోనీకకు వెళ్ళెనని పౌలు 2 తిమో 4:10లో అన్నట్లు, అందరూ నన్ను విడచి వెళ్ళిపోయారని పౌలు 2 తిమో 4:16వ. అన్నట్లు ప్రభువును గాని ప్రభువు సేవకులను గాని విడచి వెళ్ళినవారు మేలు పొందినట్లు బైబిలులో ఎక్కడనూ చదవము. తండ్రిని విడచి చిన్న కుమారుడు ఆస్తిని తీసుకొని లోకంలోకి వెళ్ళిపోయాడు. పట్టి చేతులతో పందుల పొట్టుకు కూడా నోచుకోలేని పరిస్థితిలో తండ్రి యింటికొచ్చాడు. కీర్త 73:27లో నిన్ను విడచి వ్యభిచరించు వారినందరిని నీవు సంహరించెదవు . నిన్ను విసర్జించువారు నశించెదరు అని వ్రాయబడినది. యెహోవాను విడచి వేరొకని అనుసరించువారికి శ్రమలు విస్తరించును అని కీర్తన 16:4వ.లో వ్రాయబడినంది. ఈ మాటలన్నిటినిబట్టి ఓర్పా రూతు 1:15వ.లో నిజదేవుడైన యెహోవాను విడచి పరిశుద్ధాత్మకు గుర్తుగా వున్న అత్తను విడచి తన జనుల యొద్దకు, తన దేవుని

యొద్దకు వెళ్ళి బాగుపడినట్లు బైబిల్‌లో ఏ లేఖనములోను మనకు కనిపించదు. ఇంతటితో బైబిల్‌లో అమె ప్రస్తావన ముగిసిపోయింది. చరిత్రలో కనుమరుగయ్యింది. ఈ లోకమునైనను ఈ లోకములో ఉన్నవారినైనను ప్రేమించవద్దని, ఎవడైనను లోకమును ప్రేమిస్తే దేవుని ప్రేమ వానిలో ఉండదని 1 యోహా 2:15 చెబుతుంది. దేవున్ని విడిచి బాగుపడినవాళ్ళెవరూ లేరు. 15వలో నయోమి రూతుతో "నీవును నీతోడి కోడలి వెంబడి వెళ్ళమని" చెప్పింది. కానీ తన తోడి కోడలును రూతు వెంబడించలేదు. ఓర్పా రూతుకు రోల్ మాడల్ కాదు. తన 'రోల్ మాడల్' తన అత్తయే. ఈ విషయాన్ని 14వ.లో మనము గమనించవచ్చు. నా వెంబడి రమ్మని చెప్పిన ప్రభువే మన రోల్ మాడల్‌గా ఎంచుకొని చివరివరకు వెంబడిద్దాం. ప్రియసోదరీ! ప్రభువును విడచిన నీవు అనేక కష్టాలలో, శ్రమలలో వెళ్తున్న నీవు తిరిగి ప్రభువు నొద్దకు వస్తావా? ఆయన యొద్దకు వచ్చు వారిని ఆయన ఎంతమాత్రమును త్రోసివేయడు.

**IV. 16వ. -17వ. ప్రయాణంలో రూతు చేసిన తీర్మాణము:-** రూతు గ్రంథమంతటిలో చాలా ప్రాముఖ్యమైన వచనాలుగా 16,17 వచనాలు వున్నాయి. రూతు అత్తతో చేసిన తీర్మాణము లేక ఒడంబడిక ఈ రెండు వచనములలో వ్రాయబడింది. రూతు యొక్క జీవితము దీవించబడడానికి ఈ తీర్మాణమే ప్రాముఖ్య కారణము. రూతు చేసిన తీర్మానములో ఆత్మీయ అర్థమును గ్రహించడానికి, నయోమిని కుమారుడైన యేసుక్రీస్తుకుగాని, పరిశు ద్ధాత్మకు గాని సాదృశ్యంగా తీసుకొంటే, మనకు మంచి పాఠాలు దొరుకుతాయి. 16వ.లో రూతు తన అత్తతో - "నా వెంబడి రావద్దనియు, నన్ను విడచిపెట్టమనియు నన్ను బతిమాలుకొనవద్దు" అనింది. " నా వెంబడి రావద్దు" అని బతిమాలుచు తన్ను విడచిపెట్టుము అని బతిమాలుచున్న అత్త వెంబడి రూతు ఎందుకు వెళ్తోంది? అత్త దగ్గర, వెండి, బంగారు, ఆస్తిపాస్తులు, మేడ మిద్దలు వుండుటనుబట్టి వాటిని ఆశించి వెంబడిస్తోందా? కానేకాదు. నయోమి రిక్తహస్తాలతో వుంది. అక్షరార్థంగా చూస్తే "కోడలు అత్తను వెంబడించాలి. అత్తను విడిచిపెట్టకూడదు" అనే పాఠాన్ని ప్రభువు ప్రతి కోడలికి నేర్పిస్తున్నాడు. అత్త రిక్తురాలైనా లేక సమృద్ధిగలదైనా, కోడలు అత్తను విడిచిపెట్టక వెంబడించాలి అనే సత్యాన్ని ఇప్పుడిప్పుడే ప్రభువుని నమ్ముకున్న క్రొత్త విశ్వాసి, మోయాబీయులను అన్యుల్లోనుండి వచ్చిన రూతు ఈనాటి అధునాతన యుగములోని కోడళ్ళకు మంచి పాఠాన్ని నేర్పుతోంది. ఈనాడు అత్త లేని కోడలే ఉత్తమురాలు అనుకుంటున్నారు. మరి దేవుని వాక్యమేమో కోడలు అత్తను విడువకుండ వెంబడించాలని చెబుతోంది. రూతు పలికిన మాటలను అలాగే వ్రాయించుటకు దేవునికి యిష్టమైంది. తాను వెళ్ళే చోటికి అత్త రాలేదు కానీ అత్త వెళ్ళు చోటికి కోడలు వెళ్ళాలి అని రూతు పాఠం నేర్పుతుంది. "నీవు నివసించు చోటనే నేను నివసించెదను" అని అత్తతో చెప్పింది. అత్త యిల్లు 'అద్దాల మేడ' కాదు. 10 యేళ్ళ

నుండి మూతవేయబడి బూజుపట్టిన పాత యిల్లు. అందులోనే నివసింస్తుందట రూతు. ఈనాడు అత్తతో నివసించడానికి ఇష్టపడుతున్నారా నేటి కోడళ్ళు? భర్తతో కలకాలం నివసించాలనుకుంటారు. కానీ అటువంటి నీ భర్తను కని, పెంచి, నీకిచ్చిన అత్తతో నివసించుటకు కాదుకదా! ఒక కోడలు – "మీ అమ్మ, నాన్న మన యింటిలో 10 రోజుల కంటే ఎక్కువ వుండకూడదు" అనిందట. ఇలాంటి కోడళ్ళు అత్తలతో నివసించే కోడళ్ళేనా? క్రైస్తవ ఇంటిలో పుట్టి సంఘానికి వచ్చే వాళ్ళే అత్తలతో పేచీలు పెట్టుకొని అత్తతో నివసించక, అత్తయింటికి వెళ్ళక రోజూ అమ్మగారింటికి వెళ్ళే వాళ్ళుగావున్నారు. ఇదేమైనా న్యాయమా ఈ కోడళ్ళకు? రూతు తన అత్తతో "నీ జనమే నా జనము, నీ దేవుడే నా దేవుడు" అన్నది. చాలామంది అత్త దేవున్నే దేవునిగా (యేసుక్రీస్తును) నమ్ముకుంటున్నారు. కానీ, అత్త జనాన్ని తమ జనముగా భావించడములేదు. కీర్త 45:10వ.లో "మరువుము నీ స్వజనమును, మరువుము నీ తండ్రి యింటిని" అన్న వాక్యాన్ని ఎరగమన్నట్టే వుంటున్నారు. వీరికి ప్రతిరోజూ బైబిలు చదివే అలవాటే వున్నట్టు లేదు" అందుకే "దేవోక్తి లేని యెడల ప్రజలు కట్టులేక తిరుగుదురు" అని వ్రాయబడింది. బైబిలులో వ్రాయబడిన బాధ్యతలు, కట్టడలు, ఆజ్ఞలు విధులు, ధర్మాలు, సంబంధ బాంధవ్యాలు ఎన్నియేండ్ల క్రైస్తవులుగా వుంటున్నప్పటికీ తల్లిగారింటివారే మా జనము అనుకుంటున్నారు. అత్తను, అత్త సంబంధికులను తమ యిండ్లకే రానీయకుండా వుంటున్నారు. ఎక్కడ వాళ్ళు వస్తారేమో అనుకొని వారితో అటాచ్‌మెంట్ పెట్టుకోనే పెట్టుకోరు. అలా పెట్టుకోవడానికి ప్రయత్నమే చేయరు. ముఖాలు చాటేస్తూ వుంటారు. అలాగే "నీవు మృతి నొందు చోటనే నేను మృతి పొందుతాను" అని రూతు అత్తతో అంటోంది. ఇలాగున అత్తను చావుమట్టుకు వెంబడించి, విడువకుండ, ఆమెతో నివసించి ఆమె జనమును, ఆమె దేవున్ని స్వీకరించి ఆమెతో మరణము వరకు వెంబడించాలనుకునే రూతులాంటి కోడళ్ళు ఈ దినాల్లో మచ్చుకైనా కనబడతారా? "మరణము తప్ప మరి ఏదైనను నిన్ను నన్ను ప్రత్యేకించిన యెడల యెహోవా నాకు ఎంత కీడైనా చేయును గాక" అని రూతు పలికిన పలుకులలో మనకర్థమయ్యేదేమిటంటే అత్తను తననుండి దూరంగా వుంచాలనుకునే ప్రతి కోడలికి దేవుడు ఎంతకీడైనా చేస్తాడని రూతు మనకు పాఠాన్ని నేర్పిస్తోంది. ఎంత మంచి కోడలో కదా రూతు! అత్తలకు విరోధులై దూరంగా నివసిస్తున్న కోడళ్ళందరు 'రూతు' దగ్గర కౌన్సిలింగ్ తీసుకోవాలి. రూతు తీసుకున్న తీర్మానాన్ని వినిన తరువాత తనతో కూడ వచ్చుటకు ఆమెకు మనస్సు కుదిరినదని నయోమి గ్రహించినప్పుడు అందును గురించి రూతుతో మాటలాడుట మానివేసింది. నయోమి మానకుండ తన కోడలితో నావెంబడి రావద్దు, రావద్దు అని చెబుతూ చెబుతూ రూతుకు పరీక్ష పెడుతూ వచ్చింది. కానీ రూతు ఆ పరీక్షలో నెగ్గింది. పరీక్షలో ఓడింది ఓర్పా. రూతు మనస్సు కుదిరించుకొనుటలో నెగ్గింది. ప్రియ సోదరీ! మరి నీ అత్త మీద నీకు మనస్సు కుదిరిందా? భర్తతో మనస్సు కుదిరిందేమో! కానీ నీకు భర్తనిచ్చిన అత్తతో మనస్సు

కుందిరిందా? ఆమె మనస్సు, నీ మనస్సు ఒకటేలా కుదిరిందా? వేర్పాటు ధోరణే నీలో వుందా? ఆమెకు నాకు అసలు గిట్టదండీ! అంటున్నావా? ఆమెను చూస్తూ నాకు ఒళ్ళు మీద తేళ్ళూ, పాములు ప్రాకినట్లుంటుంది అంటున్నావా? ఈలాగున రూతు తన వివాహ దినమున ఒక యవ్వన పురుషునితో అనగా భర్తతో చేసే ఒడంబడిక లేదా తీర్మాణాన్ని తన అత్తతో చేసింది. ఇది ప్రపంచంలోనే ఒక ఏకైక, వింతైన, ఎక్కడా మనము వినలేని చూడలేని తీర్మాణమని నా మట్టుకు నాకు అనిపిస్తుంది. ఇటువంటి అసాధారణమైన గుణగణాలు కలిగిన రూతు యొక్క గ్రంథాన్ని ధ్యానపూర్వకంగా చదివితే ఈ లోకంలోని అత్తాకోడళ్ళందరూ తమ కఠిన మనస్సులను మార్చుకుంటారని నా నమ్మకం. యుగాంతమందున్న మన అందరికీ బుద్ధికలగటానికే దేవుని వాక్యం వ్రాయబడింది కదా!

ఇంతవరకు ఈ అత్తాకోడళ్ళ అక్షరార్థ పాఠాలనే చదివాం. ఇక వీరిద్దరిలో దేవుడు మనకు నేర్పించాలనుకున్న ఆత్మీయ పాఠాల్ని నేర్చుకుందాం. 16వలో కోడలైన రూతు "నా వెంబడి రావద్దనియు, నన్ను విడిచిపెట్టుమనియు బ్రతిమాలవద్దని" అత్తతో చెబుతుండగా కోడలిని ఒక విశ్వాసిగాను, అత్తను పరిశుద్ధాత్మ దేవునికిగాని, కుమారుడైన దేవునికి గాని పోల్చుకుంటే పరిశుద్ధాత్మ దేవుడు విశ్వాసిని ఎప్పుడూ పరిశుద్ధాత్మ ప్రేరేపణకు విధేయత చూపమని (అపొ. 5:32), ఆత్మను ఆర్పకుడి అని (1 థెస్స. 5:19, పరిశుద్ధాత్మను దుఃఖపెట్టకూడదని న్యాయా 13:25లో వలె సంసోనును యెహోవా ఆత్మ రేపినట్టు, పరిశుద్ధాత్ముడు విశ్వాసులమైన మనతో, ఆయా విషయాలల్లో మనలను బ్రతిమాలుతూ రూపుతూ పాపిని యోహా 16:8లో వున్నట్లు పాపాన్ని గూర్చి, నీతిని గూర్చి, రాబోవు తీర్పునుగూర్చి ఎప్పుడూ ఒప్పిస్తూ, నమ్మిన విశ్వాసులమైన మనల్ని యోహా 8:13లో వ్రాయబడినట్లు సర్వసత్యములోనికి నడిపిస్తూ ఈలాగు తనను వెంబడించాలని, తన మాట వినాలని తన నడిపింపులోనే మనముండాలని ఎల్లప్పుడు జ్ఞాపకం చేస్తూనే వుంటాడు. కానీ నయోమి రూతుకు పరీక్ష పెట్టి రూతు మనస్సును తెలుసుకోవాలని నా వెంబడి రావద్దు, నన్ను విడువమని బ్రతిమాలింది. రూతు అసలు మనస్సు తెలుసుకున్న తరువాత ఇక నయోమి ఆమెతో ఆ విషయం మాట్లాడడం మానివేసింది. మనము కూడా పరిశుద్ధాత్మ ప్రేరేపణ ప్రకారము చేసిన తరువాత పరిశుద్ధాత్ముడు ఆ విషయములో మనలను హెచ్చరించడం మానేస్తాడు.

మరియు రూతు 'నీవు వెళ్ళు చోటికే నేను వచ్చెదను. నీవు నివసించు చోటనే నేను నివసించెదను' అని తన అత్తతో చెప్పినట్లు మనమును పరిశుద్ధాత్మ వెళ్ళు చోటికే మనమును వెళ్ళాలి. యెహె 1:20లో ఆ జీవులు కదలగా ఆ చక్రములును వాటి ప్రక్కను జరిగెను. అవి నేలనుండి లేచినప్పుడు చక్రములు కూడా లేచెను. యెహె 1:20లో ఆత్మ ఎక్కడికి పోవునో అక్కడికే అవి పోవలసినవైపుకే పోవుచుండెను" అని వ్రాయబడిన ప్రకారము

మనమును పరిశుద్ధాత్మ ఎక్కడికి నడిపిస్తాడో ఆ స్థలానికే, ఆపనికే, మనమును వెళ్ళాలి. పౌలు పరిశుద్ధాత్మ ఆటంకపరిచినప్పుడు బితూనియకు వెళ్ళక ఆత్మ నడిపింపు ప్రకారమే మాసిదోనియకు వెళ్ళాడు. అక్కడే లుదియ, ఆమె ఇంటివారు జైలు అధికారి, వారి ఇంటివారు పుతోను దయ్యము పట్టిన చిన్నది అనేకులు రక్షించంబడగా ఫిలిప్పీ సంఘము ఏర్పరచబడినది. పరిశుద్ధాత్మ ప్రకారము సేవచేస్తే సంఘాలు కట్టబడతాయి. రూతు అత్తతో నీవు నివసించు చోటననే నేనును నివసించెదనన్నట్లు కీర్త 23:6లో దావీదు కూడా "చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను" అన్నాడు. దేవుడు విశ్వాసము ద్వారా మన హృదయములో నివసిస్తున్నాడు. (ఎఫెసీ 3:18వ) మందిరములో కూడ నివసిస్తున్నాడు. నేను వారిలో నివసించి సంచరింతును అని 2 కొరి 6:18లో ప్రభువు అన్నాడు. చివరకు ప్రభువు "నేనున్న స్థలములో మీరును నివసించులాగున" అని ప్రభువు యోహా 14:3లో చెప్పినట్లు పరలోకములో కూడ యుగయుగములు ప్రభువుతో నివసిస్తాము. ఈ వాక్యము వింటున్న ఓ స్త్రీ! నీవు "ఈ మూడు స్థలాలలో ప్రభువుతో కూడా నివసిస్తున్నాను" అని చెప్పగలవా? ప్రభువును ఇంకా నీ హృదయములో చేర్చుకోలేదా? ప్రభువును హృదయములోనికి చేర్చుకొని దేవుని నివాసస్థలమైన మందిరములో చిరకాలము నివసిస్తావా? సమూయేలు చిన్నతనము నుండే దేవుని మందిరములో నివసిస్తున్నాడు. ఒకవేళ నీ హృదయంలో ప్రభువు వున్నట్లయితే ఆయన మందిరంలో అనగా జీవము గల దేవుని సంఘములో నీవు నివసిస్తున్నావా? అనగా నియామక కూడికల కొరకై మందిరానికి వస్తున్నావా? పర 2:14వ.లో నీ ముఖము నాకు కనబడనిమ్ము అని ప్రభువు చెబుతున్నాడు. మందిరంలో నీ ముఖము ఆయనకు కనబడుతుందా? చివరకు ప్రభువుతో నూతన యెరూషలేమను పరిశుద్ధ పట్టణము తన భర్త కొరకు అలంకరించబడిన పెండ్లి కుమార్తె వలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్ద నుండి దిగిరాగా ఆ పట్టణములో దేవుని నివాసము మనుష్యులతో కూడ వుంటుంది. ఆయన మనతో కాపురముంటాడు. ఆయన మనతో, నివసిస్తాడు. మరి ఆయన వున్నచోట, ఆయనను వెంబడిస్తూ, ఆయనతోనే నివసించుటకు నీవు రూతువలె తీర్మానము దేవునితో చేసుకో. లేకపోతే నీ నివాసము అగ్ని గంధకములతో మండు గుండములో పాపులందరితో యుగయుగములు బాధపడుతూ బ్రతకలేక చావలేక, నీళ్ళు, ఆహారము లేక ఏడుస్తూ పళ్ళుకొరుకుతూ క్షణం తీరికలేక అగ్నిలో కాలుతూ నివసించాల్సివుంటుంది. ప్రభువుతో నివసిస్తే నూతన యెరూషలేము పట్టణములో నీ భాష్ప బిందువులు తుడిచివేయబడి, దేవునితోడు కలిగి, మరణము దుఃఖము, ఏడ్పు, వేదనలేకుండా యుగయుగములు సంతోషానందములతో నిత్యము జీవించగలవు.

ఇంకనూ రూతు నీ జనమే నా జనము, నీ దేవుడే నా దేవుడు అని అత్తతో తీర్మానముతో చెప్పింది. అలాగున ఆత్మీయ రూతువైన నీవు యేసు ప్రభువు దేవుడే నా

దేవుడనియు, ఆయన జనమైన 'విశ్వాసులే నా జనులు' అని తీర్మాణము చేసుకున్నావా? చాలామంది యేసుక్రీస్తు దేవున్ని తమ దేవునిగా నమ్ముకొంటున్నారు కానీ యేసు ప్రభువు జనాంగమైన విశ్వాసులతో కలువకుండా అన్యులతోనే సహవాసము చేస్తుంటారు. దేవుడు కావాలి కానీ, దేవుని జనాంగముతో సాంగత్యము వద్దు అని అనుకుంటూ వుంటారు. వాక్యములో మన సహవాసము ఎవరెవరితో చేయాలి? 1 యోహాను పత్రికలో 1:3లో మన సహవాసమైతే తండ్రితో కూడను, ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను వున్నదని వ్రాయబడినది. యెహోవా సాక్ష్యులు యెహోవానే ఒప్పుకుంటారు. క్రీస్తు ప్రభువును ఒప్పుకోరు. అలాగే ఇశ్రాయేలీయులు తండ్రియైన యెహోవాను మాత్రమే కాని కుమారుడైన యేసుక్రీస్తును ఒప్పుకోరు. ప్రభువుతోను, తండ్రితోను ప్రార్థనలో, బైబిల్ చదువునప్పుడు, ఆయన సన్నిధిలో కనిపెట్టునప్పుడు సహవాసములో వుంటాము. ఎంతసేపైనా ఎంతకాలమైనా తండ్రి కుమారులతో మనము సహవాసము చేయవచ్చు. కీర్తనాకారుడైన దావీదు కీర్తన 23:6లో యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను అన్నాడు. ప్రియసోదరీ! ప్రభువుతో నీవు సహవాసము చేస్తున్నావా? అలా చేయడం మంచిదే కాని, పరిశుద్ధులతో కూడ మనం సహవాసము చేయాలి. దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపుతుంది. కాని సత్ సాంగత్యము దేవుని పిల్లలతో కలిగి వుండాలి. లోతు అబ్రాహాముతో నివసించడము విడచిపెట్టి సొదొమలో అన్యులతో కలిసి నివసించాడు. ఆ కారణములనుబట్టి లోతు అన్ని విధాల ఎంత నష్టపోయాడో మనము యెరుగుదుము. కనుక దేవుని జనమే మన జనము. ప్రభువును నమ్మిన వారేమన జనము. జుగుప్స భోగభాగ్యములను అనుభవించుటకంటె దేవుని ప్రజలతో శ్రమయే మేలు అని మోషే చెప్పాడు కదా! షూనేమీయురాలు నా స్వజనులలో నేను కాపురమున్నాను అని ఎలీషాతో చెప్పింది. అలాగే మనము మన స్వజనులైన దేవుని జనమైన విశ్వాసుల మధ్యనే జీవించి సహవాసము చేయాలి. విశ్వాసులే నా బంధువులు అనుకోవాలి. దేవుని పరిశుద్ధ జనముగా మనమును 1 పేతురు 2:9 దేవుని సొత్తైన ప్రజలుగా వున్నాము గనుక మనము ఎన్నటెన్నటికి ప్రభువు జనముతోనే వుండడానికి ప్రయత్నించాలి. యాకోబు కూడ 'షెకెము' అనే అన్యజనుల ఊరు ఎదుట తన కొరకు ఇల్లు కట్టించుకున్నాడు. అందువలన యాకోబు ఒక్కగానొక కుమార్తెయైన 'దీనా' ఆ దేశము నేలిన హివ్వీయుడైన హమోరు కుమారుడైన షెకెముతో శయనించి అవమానపరచబడింది. కానీ దేవుని ప్రజలమధ్య ఇల్లు కట్టించుకొని, దేవుని ప్రజల మధ్య జీవించివుంటే ఈ పని జరిగేది కాదు కదా! మన సహోదరుల మధ్య స్వంతవారి మధ్య జీవించినప్పుడు కూడ కొన్నిసార్లు చాలా సమస్యలు వస్తాయి నిజమే. కానీ యూదా (యాకోబు కుమారుడైన) తన సహోదరులను అనగా తన జనమును విడచి 'హీరా' అను అదుల్లామీయుని యొద్ద వుండుటకు వెళ్ళి అక్కడ 'షూయా' అను ఒక కనానీయుని కుమార్తెను పెళ్లి చేసుకున్నాడు. అన్యుల పెండ్లి చేసుకున్నాడు. అన్యులతో సాంగత్యము, పెళ్ళి చేసుకున్నాడు. దేవునికిని ఆయన జనానికిని దూరమైతే మనము దేవుని నిబంధనను మరచిపోతాము ఆత్మీయ నష్టమును పొందుతామని తెలుసుకుంటున్నాము.

ఇక్కడ రూతు తన జనము ఇక నుండి మోయాబీయులు కాదని ఇక నుండి అత్తగారి జనమైన యూదులే తన జనమని చెబుతోంది. అత్తతో వుండడానికి మాత్రమే కాకుండ, అత్త దేవునితో మాత్రమే కాకుండ తన అత్త జనముతో కూడ వుండడానికి ఇష్టపడుతోంది. ఈనాడు చాలామంది క్రైస్తవ విశ్వాస కోడండ్రు తమ అత్త దేవున్ని నమ్ముకుంటున్నారు. కానీ అత్త జనమును మాత్రము ఇష్టపడటము లేదు. అమ్మ తరుపున జనము వస్తే చక్కని వంటలు చేసి పెడతారు. అత్త తరపున జనము యింటికి వస్తే అనారోగ్యంగా వుందని దుప్పటి కప్పుకొని పండుకోవడమో లేక మా అమ్మకు బాగులేదని తల్లిగారింటికి వెళ్ళడమో చేస్తున్నారు. కీర్తనలు 45:10వ.లో కుమారీ! ఆలకించుము. ఆలోచించి చెవియొగ్గుము నీ స్వజనమును నీ తండ్రి ఇంటిని మరువుము! అని ప్రభువు వ్రాయించిన వాక్యాన్ని ఈనాటి కోడండ్రు గమనించుటయే లేదు. తండ్రిని, తల్లిని పూర్తిగా మరచిపోవాలని కాదు ఆ వాక్య భావము. అత్తగారింటిలో బాధ్యతలు నెరవేర్చుటను ఇష్టము లేక వాటిని తప్పించుకోవటానికి అమ్మగారింటికి అవసరము లేకున్నా వెళ్తున్నారు. ఆడపడచులు ఇంటికి వస్తే ఎక్కడ ఎక్కువ పనులు చేయాల్సి వస్తుందనో వాటిని తప్పించుకోవడానికి అమ్మగారింటికి వెళ్తున్నారు. ఈలాంటి వారికి అత్తవద్దు. అత్త జనము వద్దు. కానీ అత్తమామలు చనిపోతే వారి ఆస్తులు, వారి వస్తువులు వారి ఇల్లు పంచుకోవడానికి మాత్రము ఎగబడుతుంటారు. కానీ అత్త మామలకు వారి జనమునకు మాత్రము ఎలాటి ప్రేమను చూపటానికి గానీ, పరిచర్య చేయటానికి గాని యిష్టపడరు. వాళ్ళు యిష్టము లేకపోతే వారి ఆస్తులు, వారి యిల్లు వస్తువులు మాత్రమే ఇష్టమా? ఇది న్యాయమేనా? ప్రభువు తీర్పులో నిలబడినప్పుడు ఈలాటి కోడండ్రు ఏమి జవాబు చెప్పగలరో ఆలోచించుకోవాలి. ఈనాటి కోడళ్ళు రేపటి అత్తలవుతారు కదా! ఏమి విత్తితే అదే పంటను ఎక్కువ మోతాదుల్లో కోయవలసి వస్తుంది కదా! బహు జాగ్రత్తగా ఆలోచించుకోవాలి. కానీ రూతుకు మాత్రము అత్త కావాలి, అత్త జనము కావాలి, అత్త దేవుడు కావాలి. అలాగే ఈనాటి కోడళ్ళు అత్తవైపు బంధువులతో కూడ చక్కని సాక్ష్యం పొందుకోవాలి. అలా మన సాక్ష్యాల ద్వారా దేవునికి మహిమ కలగాలి. అంత మంచి సాక్ష్యము తెచ్చుకున్న రూతు నేడు కోడళ్ళందరికీ సజీవ సాక్ష్యంగా నిలచింది కదా! క్రైస్తవ కోడళ్ళారా! మీరందరూ ఈ సంగతులు క్షుణ్ణంగా గమనించాలని ప్రభువునుబట్టి మిమ్మల్ని ఒక దైవసేవకురాలిగా మీ వెల్‌విషర్‌గా మరీ మరీ కోరుచున్నాను.

"రూతు నీ జనమే నా జనము" అని అత్తతో చెప్పిన తరువాత " నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది. అత్త దేవుడు యెహోవా దేవుడు. ఆమె దేవత కెమోషు దేవత. ఎవరూ ఈ లోకంలో తమ దేవుండ్లను మార్చరు. ఒకవేళ మరో దేవున్ని వాళ్ళు పూజించాలనుకున్నా, తమ పాత దేవున్ని, పితరుల ఇష్ట దేవుతలను కుల దేవుండ్లను ఇంటి

దేవుళ్ళను, ఎట్టి సమయాల్లోనూ మార్చకుండ పాత, క్రొత్త దేవుళ్ళను ఆరాధిస్తూనే ఉంటారు. కానీ రూతు "నీ దేవుడే నా దేవుడు" అని ఖరాఖండిగా చెప్పేసింది. ఎందుకు? అలా ఖండితంగా చెప్పగలిగింది? లేఖనాల్లో 1 థెస్స 1:9లో థెస్సలొనీకయులు, విగ్రహములను విడిచిపెట్టి 1. జీవము గలవాడును, 2. సత్యవంతుడును 3. మృతులలోనుండి దేవునిచేత లేపబడిన యేసును 4. పరలోకమునుండి వచ్చే యేసును, 5. రాబోవు ఉగ్రత నుండి మనలను తప్పించే యేసుని గురించి విని ఎలాగు ఆయనవైపు తిరిగారో అలాంటి దేవుని సంగతులు అత్త ద్వారా రూతు విని దేవునివైపు తిరిగింది. కోడలికి దేవున్ని గురించి చెప్పిన నయోమి అదే దేవున్ని గురించి తన పిల్లలకు చెప్పి వుండదా? ద్వితీ. 6:6 ప్రకారము నేను నీకాజ్ఞాపించు మాటలు నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింట కూర్చుండునప్పుడు, త్రోవను నడుచునప్పుడు, పండుకొనునప్పుడు వాటిని గూర్చి మాటలాడవలెనని దేవుడు చెప్పినట్లుగా నయోమి తన కుమారులకు తప్పక చెప్పిందా లేదా? చెప్పివుంటే "బాలుడు నడవ వలసిన త్రోవను వానికి నేర్పుము. పెద్దవాడైన తరువాత వాడు దాని నుండి తొలగిపోడు" అను సామె 22:6వ.లోని వాక్య ప్రకారము పెద్దవారైన తరువాత నయోమి పిల్లలు దేవుని నిబంధనలో తొలగిపోక వుండేవారేమో! తల్లిదండ్రులిద్దరూ అలా చెప్పి వుంటే ( వారు అలాగున వారి ద్వారా విని) త్రోవ తొలగి వుండేవారు కాదేమో. లేక యెహె 14:14లో వ్రాయబడినట్లు "నోవహు, దానియేలు, యోబు ఈ ముగ్గురును అట్టి దేశములో నుండినను వారు తమ నీతిచేత తమ్మునుతామే రక్షించుకొందురు గానీ కుమాళ్ళనైనను, కుమార్తెలనైనను రక్షింపచాలకుందురు" అని చెప్పినట్లు నయోమి పిల్లలు రక్షించబడలేదేమో? తమ అపరాధములనుబట్టి వారు నశించిపోయారేమో కానీ, కోడలైన రూతు మాత్రము యెహోవా దేవున్ని తన దేవునిగా తన అత్త చెప్పుట ద్వారా నమ్ముకుంది. ప్రియ సోదరీ! నీ దేవుడెవరు? నీ దేవుడు జీవము గలవాడేనా? సత్యవంతుడేనా? నీ కొరకు ప్రాణదానము చేసి మృతిని జయించి తిరిగి లేచినవాడేనా? పాప జీవితమైన నరకము నుంచి విడిపించిన వాడేనా? నీ కొరకు పరలోకాన్ని నిర్మించిన దేవుడేనా? నమ్మదగిన దేవుడేనా? క్రొత్త భూమిని, క్రొత్త ఆకాశాన్ని కలుగజేసేవాడేనా? మాటచేత సర్వసృష్టిని కలుగజేసినవాడేనా? నీతి స్వరూపడేనా? న్యాయవంతుడేనా? నీ దేవుని ప్రభావము సర్వభూమి మీద కనబడుతోందా? (కీర్త 57:5,11) నీ దేవుని కీర్తి సర్వభూమి మీద కనబడుతోందా? (కీర్త 48:10) అత్త నయోమి చెప్పినప్పుడు కోడలైన రూతు నమ్ముకుంది. మరి బైబిలు ఆ దేవున్ని గురించి ఏమి చెబుతుందో చదవండి. ఆయన మహిమ ఆకాశ విశాలమంత వ్యాపించి యున్నది. (కీర్త 113:4) ఆయన విశ్వాస్యత ఆకాశమందు స్థిరపరచబడియున్నది. (కీర్త 89:2). ఆయన సత్యము మేఘమండలము వరకు వ్యాపించియున్నది. (కీర్త 57:9). ఆయన కృప ఆకాశముకంటే ఎత్తైనది. (కీర్త 57:9). ఆయన నీతి మహాకాశముకంటే ఎత్తైనది. (కీర్త 71:19). ఘనత ప్రభావము సౌందర్యము, బలము, పరిశుద్ధత ఆయన

సన్నిధిలో నున్నవి. (కీర్త 96:6). ఆయన సమస్త దేవతలకంటే పైగా అత్యధికముగా ఔన్నత్యము పొందినవాడు. (కీర్త 96:6). సకల దేవతలు ఆయనకు నమస్కారము చేయును. కీర్త 97:9. దుష్ట మృగములుండు పర్వతముల సౌందర్యము కంటే ఆయన అధిక తేజస్సు కలవాడు. కీర్త 76:4. ఆయన జ్ఞానమునకు మితిలేదు. యెహోవా దీనులను లేవనెత్తువాడు. (కీర్త 147:5). ఆయన గర్జనము ఆయనను ప్రసిద్ధి చేయును (కీర్త 36:33) ఆయన భీకరమైన మహిమను ధరించుకొనిన వాడు. (యోబు 37:23). అంతరిక్షములో ఆయన బలాతిశయమున్నది. కీర్త 68:4. ఆయన తన ప్రజలకు బలపరాక్రమములను అనుగ్రహించువాడు. కీర్త 68:35. బలమును నడికట్టుగా కట్టుకున్నవాడును, తన శక్తిచేత పర్వతములను స్థిరపచువాడు. ఆయన సముద్రముల ఘోషను, దాని తరంగముల ఘోషను అణచువాడు. కీర్త 65:7. జనముల అల్లరిని చల్లార్చువాడు. ఆయన కార్యములు ఎంతో భీకరమైనవి. ఆయన బలాతిశయమును బట్టి నీ శత్రువులు లొంగి ఆయన యొద్దకు వచ్చెదరు. సర్వలోకము ఆయనకు నమస్కరించి ఆయనను కీర్తించును. నీతిన్యాయములు ఆయన సింహాసనమునకు ఆధారములు. కృపా సన్నిధానములు ఆయన సన్నిధానవర్తుదు. కీర్త 87:14. పురాతన కాలము నుండి ఆయన సింహాసనము స్థిరమైనది. సదా కాలమున్నవాడు. ఆయనే (కీర్త 93:2). దేవతలందరికి పైన మహాత్మ్యము గల మహారాజు. అన్యజనులలో ఆయన నామము భయంకరమైనది. (మలా 1:14). రాజులకు రాజు, యూదులకు రాజు అన్యజనములకును రాజు. ఆయన సైన్యములకధిపతియగు యెహోవా అను పేరు వహించినవాడు. ఆయన అధికబలముచేతను, చాచిన బాహువుచేతను, భూమ్యాకాశములను సృజించినవాడు. ఆలోచన విషయములో ఆయనే గొప్పవాడు. క్రియలు జరిగించు విషయములో శక్తి సంపన్నుడు. కరుణా వాత్సల్యములుగలవాడు. శాంతమూర్తియు, అత్యంత కృపగలవాడు. తాను చేయనుద్దేశించిన కీడు చేయక పశ్చాత్తాపపడువాడు. (యోవే 2:13). యెహోవా గొప్పకార్యములు చేసెను. (యోవేలు 2:21). అనుదినము తప్పక సేవించబడే దేవుడు (దాని 6:16). ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. అదెన్నటికి తొలగిపోదు. ఆయన రాజ్యము ఎన్నటికీ లయము కాదు. (దాని 7:14). ఆయన విడిపించువాడు, రక్షించువాడు. పరమందును, భూమి మీదను సూచకక్రియలను, ఆశ్చర్యకార్యములను చేయువాడు. (దాని 6:27). గర్వముతో నటించువారిని ఆయన అణపశక్తిగలవాడు. (దాని 6:37). ఆయన సూచక క్రియలు ఎంతో బ్రహ్మాండమైనవి. ఆయన అద్భుతములు ఎంతో ఘనమైనవి. ఆయన రాజ్యము శాశ్వత రాజ్యము. ఆయన ఆధిపత్యము తరతరములు నిలుచుచున్నది. (దాని 4:3) ఇవ్విధముగా రక్షించుటకు సమర్థుడగు దేవుడు గాక మరి ఏ దేవుడును లేడు. (దాని 4:29).

దేవుడు దేవతలకు దేవుడు రాజులకు రాజు ప్రభువులకు ప్రభువు. దాని 4:47లో మర్మములను బయలుపరచగల దేవుడు (దాని 2:28). అంధకారములోని సంగతులు ఆయనకు తెలియును. వెలుగు యొక్క నివాసములు ఆయన యొద్ద ఉన్నవి. యెహోవా

కృపగలవాడు. ఆయన వాత్సల్యత ఎడతెగక నిలుచుచున్నది గనుక మనము నిర్మూలము కాకున్నవారము. ఆయన సర్వోన్నతుడైన దేవుడ, సర్వశక్తిగల దేవుడు. నిన్న, నేడు నిరంతరము ఏకరీతిగా ఉన్న దేవుడు. మారని మార్పులేని దేవుడు. యుగయుగములకు రాజు. యుగయుగములకు దేవుడు. సదాకాలమునకు దేవుడు. అన్యజనులకు రాజు. అన్యజనులకు దేవుడు. ఆయనయందు ఏ చెడుతనము లేదు. (కీర్త 92:14). పాపమెరుగని దేవుడు. ఆయన యందు పాపము లేదు. అబద్ధమాడనేరని దేవుడు. ఆకాశ మహాకాశములు పట్టజాలని దేవుడు. తన జేనతో ఆకాశాన్ని కొలిచే దేవుడు. భూమిలోని మట్టిని కొలపాత్రలో వేసి కొలిచే దేవుడు. ఆయన తన పుడిసిటితో జలములు కొలచినవాడు. త్రాసుతో పర్వతములను తూచినవాడెవడు? తూనికచేత కొండలను తూచినవాడు. ఆయన మంత్రియై ఆయనకు బోధపరచినవాడెవడు? ఎవనితోను పోల్చుటకు వీలులేని దేవుడు. ఏ రూపమును ఆయనకు సాటి చేయలేము. (యెష 40:12-14). ఆది, మధ్య, అంతరములు లేని దేవుడు. అల్ఫ, ఓమేగ, ఆయనే. వేల్పులలో ఆయనకు సములెవరు? పరిశుద్ధతనుబట్టి మహానీయుడు. స్తుతికీర్తనలనుబట్టి పూజ్యనీయుడు. ఆకాశము ఆయన సింహాసనము భూమి ఆయన పాదపీఠము.

అట్టి గొప్పదేవుడు పాపమానవుల కొరకై నరావతారమెత్తి నరుడై పుట్టి మానవ ఖర్మను సిలువలో మోసి, నరకయాతన అనుభవించి ప్రాణదానము చేసి మరణాన్ని జయించి పునరుత్థానము నొంది పరమును నిర్మిస్తున్న దేవున్ని గూర్చి నీవు ఇంతగా తెలుసుకొని కూడా ఇంకా ఆయనను నమ్ముకోలేదా? ఆ యేసు ప్రభువు దేవుడే నా దేవుడు అని నమ్మలేవా? తుచ్ఛమైన పాపములను నెరవేర్చుకునేందుకొరకు దేవున్ని నమ్మక వాయిదా వేస్తావా? ప్రభువైన యేసునందు విశ్వాసముంచండి. అప్పుడు నీవు నీ ఇంటి వారును రక్షింపబడగలరు. యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులౌతారు. (కీర్త 114:15).

అలాగున రూతు యెహోవా దేవున్ని తన దేవునిగా నమ్ముకుని తన అత్తతో "నీవు మృతి పొందు చోటను నేను మృతి చెందుదును" అని చెబుతోంది. ఎవరైన తన భర్త మృతి చెందిన చోట మృతిపొంది అచ్చటనే పాతిపెట్టబడాలనుకుంటారు. కానీ అత్త మృతి చెందిన చోట మృతిపొంది అచ్చటనే పాతిపెట్టబడాలనుకుంటారా? ఈనాడు కోడళ్ళు తమ భర్తలతోనే వుండాలనుకుంటారు. అట్టి నీ భర్తను కనిపెంచి పెద్దచేసి నీకు భర్తగా అందించిన ఆ అత్తను నీవు నీ అమ్మగా చూచుకుంటున్నావా? రూతు మరణము వరకు, పాతిపెట్టబడేవరకు కూడ వెంబడించింది. మన ప్రభువును మనము అలాగున వెంబడిస్తున్నామా? అంతవరకు ఆయనను ప్రేమిస్తున్నామా? పౌలు ఫిలి 3:10లో ఏ విధము చేతనైనను మృతులలో నుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణవిషయములో, సమానానుభవము గలవాడనై ఆయనను, ఆయన పునరుత్థాన

బలమును ఎరుగు నిమిత్తమును ఆయన శ్రమలలో పాలివాడనగుట యెట్టిదో ఎరుగు నిమిత్తము, సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకొనుచున్నాను అన్నాడు. అత్త మరణములోను, పాతిపెట్టబడడములోను సమానానుభవము కావాలని రూతు కోరుకున్నట్లు మన పరలోకపు మన ప్రభువు మరణానుభవములో మనమును సమానానుభవము కోరుకోవాలి. ఆయన మరణము సిలువ మరణము. ఆయన మరణములో గొల్గొతా అనుభవములో రక్తము, చెమటలు కార్చాడు. శ్రమల గిన్నెను ఆయన ఎదుట పెట్టబడింది. ఆ సిలువ శ్రమలు ఆయన అనుభవించాడు. ముళ్ళు మేకులు, ప్రక్కలో గాయము, పిడిగ్రుద్దులు, అరచేతులతో దెబ్బలు. దిగంబరత్వము, ఒంటరిగా తండ్రిచేత విడబడుట, సిలువ భారము మోయుట ఆయన వస్త్రములు చీట్లు వేసి పంచుకొనుట, దప్పిగొనుట, చీకటి శక్తులతో పోరాటము. రక్తము గాయాలనుండి స్రవించుట. ఎండబాధ, ఆకలి గొనుట, అన్యాయపు తీర్పు, శిష్యులు విడచిపోవుట. అన్నిటికంటే ముఖ్యము తండ్రి ఆయన చేతిని విడుచుట యెహెూవా అతని మీదికి వ్యాధిని పంపుట. తండ్రి పరము నుండి ఆయన ఎముకలమీదికి అగ్నిని కురిపించుట. ఆ అగ్ని ఆయనను ఎడతెగక కాల్చుట, బలము చిల్లపెంకువలె అగుట, సురూపము కోల్పోవుట, పెద్ద కేక వేసి ఆఖరుకు మరణించుట, సమాధి చేయబడుట, ఇవన్ని యేసుక్రీస్తు మరణానుభవములో వున్న బాధలు. ఈ యేసుక్రీస్తు యొక్క మరణానుభవముతో సమానానుభవము పౌలు తనకు కావాలనుకున్నాడంటే ఎంత గొప్ప సంగతి! కారణమేమంటే ఆయన మరణానుభవములో పాలుపొందితేనే గానీ పునరుత్థాన బలము పొందలేదు. ఆయన పునరుత్థాన బలమున ఎరుగాలంటే మరణానుభవము పొందాలి. భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి పునరుత్థానుడైన ప్రభువు మేఘాలలో ఆరోహనుడై తండ్రి యొద్దకు వెళ్ళాడంలో ఆయన శక్తి ఎంత అపరిమితమైందో అది ఎరుగదాన్ని పౌలు కోరుకుంటున్నాడు. ఇది ఎంత అరుదైన ఆత్మీయ కోరిక? అందరు ప్రభువును నమ్మక సుఖానుభవము కొరకు ఆశిస్తారు. పౌలు మాత్రము ఆయన నుండి సుఖానుభవం కంటే శ్రమానుభవమే కోరుకుంటున్నాడు. ఆయన ఆలోచన ఎంత భిన్నంగా ఉందో కదా! ఇంతగా యేసయ్యను మనం ప్రేమిస్తున్నామా?

ఇక్కడ మన పాఠ్య భాగములో రూతును మరణము మట్టుకు ప్రేమిస్తుండగా కోడళ్ళందరికీ ఎంత మంచి మాదిరిగా నిలబడిందో కదా! ఎంతమందికి మాదిరి జీవితమో కదా అమెది! క్రైస్తవ విశ్వాస కోడళ్ళందరూ ఈ రూతులాగ వుంటే ప్రతి ఇల్లు ఒక స్వర్గసీమగా వుంటుంది కదా! ప్రక 1:9లో పత్మాసులో పరవాసియైన యోహాను "యేసుబట్టి కలుగు శ్రమలోను, రాజ్యములోను సహనములోను పాలివాడనైన నేను" అని వ్రాశాడు. మనమైతే క్రీస్తును బట్టి పరలోక రాజ్యమును కోరుకుంటాము. శ్రమపడటాన్ని, సహించడాన్ని కోరుకోము. కాని పూర్వపు అపొస్తలులు, భక్తులు క్రీస్తునుబట్టి శ్రమించడాన్ని, సహించడాన్ని,

హింసించబడటాన్ని, ఉమ్మి వేయబడుటను, తలక్రిందులు సిలువ వేయబడటాన్ని (పేతురు), దేవుని ప్రజలతో శ్రమపడలాన్ని (మోషే) కోరుకున్నారు. వీరందరూ ప్రభువును స్వార్థము కొరకు కాక నిజ భక్తితో ఆయన్ను సేవించారు కదా! ఆలాగున అత్తతో శ్రమించడాన్నే కోరుకున్న రూతు యొక్క తీర్మాణం అత్యంత అభిలషనీయం, మాదిరికరం, నిస్వార్థకరం. రూతు జీవిత ధ్యేయమే వేరు.

17వ.లో "మరణము తప్ప ఏదైనను నిన్ను నన్ను ప్రత్యేకించిన యెడల యెహోవా నాకు ఎంతకీడైన చేయును గాక!" అని రూతు అత్తతో చెప్పిందని చదువుచున్నాము. ఈ లోకంలో ఎవరైనా అత్తకు ప్రత్యేకంగానే వుండాలనుకుంటారు. కానీ రూతు అత్తతో మరణంవరకు హత్తుకొని వుండాలని, ప్రత్యేకంగా వుండకూడదని అలా ప్రత్యేకంగా వుంటే యెహోవా నాకు ఎంతకీడైన చేయును గాక! అని తీర్మాణం చేసి చెప్పింది. అత్తకు దూరంగా వుండాలని తలంచే కోడళ్ళారా! అలా అత్తలకు దూరంగా వుండాలనుకుంటే యెహోవా మీకు ఎంత కీడైనా, చేస్తాడట. మీ లాంటి కోడలైన రూతు మీకు హెచ్చరిక ఇస్తోంది. తన అత్తమామలు 10 రోజులుకంటే ఎక్కువగా తమ ఇంటిలో వుండకూడదని" చెప్పే కోడళ్ళారా! అలా చేస్తే కీడు వస్తుందని (యెహోవా కీడు చేస్తాడని) మీకు తెలిసినట్లు లేదు. వాక్యాన్ని చదివి తెలుసుకోండి.

4 అధ్యాయాలు కలిగిన "రూతు" అనే ఈ చిన్న గ్రంథాన్ని తప్పక స్త్రీలు అందరూ చదవాల్సిందే. ప్రాముఖ్యంగా వివాహం చేసుకొనే ముందే, యవ్వనులందరూ ఈ గ్రంథాన్ని చదివి క్రైస్తవ విశ్వాస తల్లుల ద్వారా లేక దేవుని సేవకురాండ్ర ద్వారా అత్త-కోడళ్ళ కౌన్సిలింగ్ నేర్చుకోవాలి. కోడళ్ళు చేసే ఉద్యోగాలు కాదు ప్రాముఖ్యం. వివాహం చేసికొని, పిల్లలనుకని, గృహపరిపాలన చేస్తూ భర్తకు, పిల్లలకు ప్రియులుగా వుంటూ, నిందించుటకు విరోధికి అవకాశమివ్వకుండా వుండాలి. (1 తిమో 5:14). కొద్దిమంది యవ్వనస్తురాండ్రు పెళ్ళి చేసుకోము అంటున్నారు. ఒకవేళ పెళ్ళి చేసుకున్నప్పటికీ మీకు పిల్లలు వద్దు అని అంటున్నారు. కొద్దిమంది పెళ్ళి చేసుకుంటున్నారు. భర్తకు లోబడేది లేదు అంటున్నారు. భర్తకు కోపము రేపి కోపము వచ్చేట్లు చేసి వాదాలకు దిగి తల్లి గారింటికి వెళ్ళి చాలాకాలంగా భర్తలకు దూరంగా వుంటున్నారు. ( 1కొరి 7:2-5; 1 కొరి 7:10). స్త్రీలకే అంత రోషము వుంటే, కోపముంటే పురుషులకు ఇంకెంత ఎక్కువగా కోపం, రోషం వుంటాయో ఆలోచించండి. భర్తకు పుట్టు రోషము క్రోధము వంటిది. (సామె 6:34వ) అని బైబిల్‌లో వ్రాయబడింది. కొద్ది మంది స్త్రీలు పిల్లలను కూడ తమతోపాటు తల్లిగారింటికి తీసుకెళ్తూ అక్కడే తిష్టవేసి వుంటున్నారు. ఇక్కడ భర్త ఒంటరిగా వుండి మానసిక క్షోభ అనుభవిస్తూ వుంటాడు. నరుడు ఒంటరిగా వుండుట మంచిది కాదని ప్రభువు చెప్పలేదా? స్త్రీల మొండివైఖరి ద్వారా పురుషులు పరస్త్రీల స్నేహంలో, వారి బారిలో పడుటకు ఆస్కారమౌతోంది, మీ కోపాలు సూర్యుడు అస్తమించే లోపలే మనస్సులో నుండి తీసేసుకోవాలి.

ఇట్లు 7 రీతులుగా తన తీర్మాణాన్ని ఇంతగట్టిగా ధృఢంగా ఆమె అత్తగారితో చేసిందంటే, ఆ అత్త తన కోడలిని ఎంత ఎక్కువగా ప్రేమించి వుంటుందో కదా! తనను అంతగా ప్రేమించిన ఆ అత్తను నేడు ( ఈ క్రొత్త దేశములో) మగదిక్కులేని ఈ దేశంలో అత్తభారం తన మీద వేసికొని ఆమెను వెంబడించడంలో తనను ఎన్ని కష్టాలు రాబోతున్నాయో అవన్ని పట్టించుకోకుండా అత్తను నేను ఎడబాస్తే దేవుడు ఎంత కీడైనా చేయును గాక! అనింది. ఈ సమయంలో రోమ 8:34-39 అలాగే మనలను ఎంతగానో ప్రేమించిన క్రీస్తు ప్రేమనుండి మనలను ఏ శ్రమయైనను, బాధయైనను, కరువైనను, వస్త్రహీనతయైనను, ఉపద్రవమైనను. ఖడ్గమైనను ఎడబాయవు. మరణమైనను, దేవదూతలైనను, ప్రధానులైనను ఉన్నవియైనను, అధికారులైనను ఎత్తైనను, లోతైనను సృష్టించబడిన మరియేదైనను, మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమ నుండి మనలను ఎడబాపనేరవు.

రూతు పరిశుద్ధాత్మకు గుర్తుగా ఉన్న అత్తను విడువక వెంబడించునట్లు మనమును యెహె 1:20లో వున్నట్లు ఆత్మ యెక్కడికి పోవునో అక్కడికే ఆత్మ పోవలసిన వైపుకే జీవులు పోవుచుండెను" అని వ్రాయబడినట్లు మనమందరము ఆత్మ వైపుకే వెళ్తూ వెంబడించాలి.

18వ. ఈలాగున రూతు తన మనఃపూర్వకముగా అత్తతో తీర్మాణం చేసిన కారణాన తనతో కూడ వచ్చుటకు ఆమెకు మనస్సు కుదిరినదని నయోమి తెలుసుకొని ఇక అందుకు గూర్చి ఆమెతో మాటలాడుట మానివేసింది. అత్తతో కూడ వెళ్ళుటకు రూతుకు మనసు కుదిరిందట. ప్రియ సోదరీ! నీ అత్తతో కూడ నీ యింట్లో వుండుటకు, నీకు మనస్సు కుదిరిందా? భర్తతోనే వుండుటకు, హత్తుకోవడానికి ఇష్టము లేని వారు ఇక అత్తతో వుండుటకు ఇష్టపడి మనస్సులు కుదుర్చుకుంటారా? రూతు ఎంత మాదిరి జీవితం కలిగివుందో కదా! భర్తతో భర్తను మనకిచ్చిన అత్తతో కూడ మనము మనస్సు కుదుర్చుకోవాలి. ప్రభువుతో కూడ మనస్సు కుదుర్చుకోవాలి. దేవునితో నీ మనస్సు కుదిరిందా? రూతు అత్తతో చేసిన తీర్మాణం నీ ప్రభువుతో నీవు ఎన్నడైనా చేశావా? ఆయన వెళ్ళిన చోటు పరలోకం నీ పరలోకానికి వస్తాను ప్రభువా! అని ఎన్నడైనా చెప్పావా? నా దేవుడవు నీవే. నా జీవితమంతా మరణం వరకు నిన్నే వెంబడిస్తానని ఎప్పుడైనా చెప్పావా? ఆయనను నీవు ఎడబాస్తే రూతు అత్తను ఎడబాస్తే వచ్చే కీడుకంటే మరి ఎక్కువైన కీడు (నరకమనే) నీవు అనుభవించవలసి వస్తుంది. రాబోయే దేవుని ఉగ్రతను ఈనాడే తప్పించుకో. ప్రభువు నుండి పాప క్షమాపణ కోరుకో ప్రభువుతో మనస్సు కలపడానికి మనస్సును కుదురించుకో. నీవు అలా ప్రభువుతో రక్షించబడిన అనుభవముంటే "ఇక ఎవ్వరు కూడ నిన్ను రక్షించబడ్డావా?" అని అడగరు. అలాగున నయోమి రూతులు ఇద్దరూ బేత్లెహేము చేరువరకు ప్రయాణము చేశారు. నీవు కూడ పరమ బేత్లెహేము చేరువరకు ప్రభువుతో ప్రయాణం చేయాలి.

1. (ఈ సందర్భములో 'ఈనాడు' వార్తా పత్రికలో ఎడిటర్ రామ్ గారు 'అత్తమ్మ' అనే శీర్షికలో వ్రాసిన సంగతులు పొందుపరచాలనుకుంటున్నాను.

"అత్తగారంటే సమాజంలో ఒక వ్యతిరేక భావం నాటుకుపోయింది. మెట్టినింట అడుగుపెట్టినప్పటి నుంచి కుటుంబ బాధ్యతలతో అలసిపోయిన ఆమె అత్తగారిగా మారగానే కోడలి దగ్గర నుండి కూతురి మమకారం కోరుకుంటుంది. రోజురోజుకు వయస్సు పై బడుతుంటే కోడలి ఆసరా చేయూతకోసం ఎదురు చూస్తుంది. అయితే సమాజం అనుకున్నట్లుగా అత్త 'విలన్' కాదు. గయ్యాళికాదు. ఆమె కూడ ఒక అమ్మే. ఎంతో దర్జాగా బ్రతికిన తన యింటిలోనే కొడుకు కోడళ్ళను తన పెన్షన్‌లో తానే చాకుతూ, వాళ్ళు వండిపెట్టే నాలుగు మెతుకులకోసం చేయిచాస్తున్న అత్తగార్లూ లేకపోలేదు. ఇంటి పనిమనిషిగా మిగిలిపోయినవారు మరికొందరు. కోడళ్ళు కొందరు తమకు అనుకూలంగా వున్న చట్టాలను అడ్డుపెట్టుకొని అత్తగార్లపై తప్పుడు కేసులు బనాయించి జైళ్ళపాలు, అప్రతిష్టపాలు చేస్తున్నారు. వీటన్నిటికి కారణం... ఎక్కడో జరిగిన కొన్ని సంఘటనలను ఉదహరిస్తూ తల్లిదండ్రులు, సమాజం పెళ్ళికి ముందే అమ్మాయి మనస్సులో కాబోయే అత్తగారిపై ఒకరకమైన వ్యతిరేక భావాన్ని కలిగించడం, భయాన్ని రేకెత్తించడం. అలాంటి అనారోగ్యకరమైన ఆలోచనలతో మెట్టినింటిలో అడుగు పెట్టిన ఆడపిల్ల తన అత్తగారిలో వున్న అమ్మను చూడలేకపోతుంది. దాంతో మనస్పర్ధలు, గొడవలు కొట్లాటలు మొదలవుతున్నాయి. ఎంతసేపూ "కోడళ్ళే అత్తల చేతుల్లో హింసకు గురవుతున్నారు" అనుకుంటున్నాము. కానీ, ప్రస్తుతం వారికంటే ఎక్కువగా కోడళ్ళ చేతుల్లోనే అత్తలు హింసకు గురవుతున్నారు.

2. నిజానికి చాలామంది అత్తలు కోడళ్ళ చేతుల్లో మానసిక హింసకు గురువుతున్నారు. కానీ ఆ వార్తలు బయటికి రావడము లేదు. అలా అత్త బయటికి చెబితే వేసే నాలుగు మెతుకులు కూడ వేస్తారో లేదోనని ఆమెకు భయం. అత్తలు బయటికి వచ్చి చెప్పుకుందామన్నా వారి మాటలను నమ్మే స్థితిలో సమాజం లేదు. అందువలన అత్తలు మౌనంగా తమ బాధను అనుభవిస్తున్నారు. ఎందుకంటే ఇది కోడళ్ళ కాలము కాబట్టి.

3. రక్తసంబంధం వున్న తల్లీకూతుళ్ళ మధ్య, జీవితాంతం ఒకరికొకరు తోడుగా వుండి భార్యాభర్తల మధ్య వుండే ప్రేమానురాగాలు ఒక ఎత్తయితే ... అత్తా కోడళ్ళ మధ్య వుండే అనుబంధము ఒకెత్తు. నిజంగా అది ఒక అపురూపమైన అనుబంధం. ఆ అందమైన బంధం కొనసాగాలంటే కావలసింది రెండు మంచి మనస్సులు. ప్రతి కోడలు తన అత్తలో తల్లిని చూచుకుంటే... తను కూడ మంచి అత్తగా మారుతుంది. ప్రతి అత్త ఒకప్పటి కోడలే కదా. కనుక మదర్స్ డేకి మీ తల్లికి గిఫ్ట్ ఇచ్చి మీ ప్రేమను చూపించినట్లు కోడళ్ళూ! మదర్-ఇన్-లా డేకి 'మీ సర్‌ప్రైజ్ గిఫ్ట్ మీ అమ్మలాంటి అత్తకిచ్చి మీ ప్రేమను చాటుకోండి. రూతులాంటి దీవెన మీరు పొందగలరు.

4. ఈరీతిగా అత్త మీద కోడలికి, కోడలిమీద అత్తకు మనస్సులు కుదిరితే ప్రతి అత్తాకోడళ్ళు నయోమి-రూతుల్లాగా మోడల్ అత్తకోడళ్ళు అవుతారు. ప్రియ సోదరీలారా!

అత్త, కోడళ్ళైన మీకు మనస్సులు కుదిరాయా! కుదుర్చుకునే ప్రయత్నము ప్రభువు కృప ద్వారా చేసుకోండి.

5. ఒకరు అన్నట్లుగా ప్రతి ఆడపిల్ల జీవితంలో ఇద్దరు అమ్మలుంటారు. ఒకరు ప్రేమానురాగాలతో పెంచుతారు. మరొకరు ఆ ఆడపిల్లకోసం జీవితభాగస్వామిని కని పెంచి ప్రయోజకుడిని చేసి జీవితాంతం తోడుగా వుండమని అప్పగిస్తారు. ఇద్దరి ప్రేమ ఒక్కటే. కానీ పేర్లు వేరువేరు. ఒకరు "అమ్మ" అయితే మరొకరు "అత్తమ్మ". కానీ అత్తమ్మలో అమ్మ వుందనే సంగతి మనం మరచిపోతుంటాం. అత్తలేని కోడలు ఉత్తమురాలు అన్న సామెతలను అత్త వున్న కోడలు ఉత్తమురాలు అని తిరుగరాద్దాం. అప్పుడే కుటుంబ జీవితంలో ఆనందం సమాధానాలతో ప్రభువు మహిమకై అందరం జీవించగలము.)

రూతు 1:19వ-22వ:- నయోమి యెహోవా విషయములో పలికిన విరుద్ధమైన సాక్ష్యము. "ఈ భాగమును గూర్చి 'నయోమి తన కోడండ్రతో చేసిన సంభాషణ' అను భాగములోనే 1వ అధ్యా.లో వివరముగా వివరించబడినది.

## 2వ అధ్యాయము

**విభజన: 2:1-2వ.**

**(ఎ) బోయజు పొలములో పరిగె ఏరుకొనుటకు వెళ్ళుటకై నయోమి సెలవు తీసికొనిన రూతు:-** బేత్లెహేముకు వారిద్దరూ చేరిన తరువాత అత్తను పోషించవలెనను బాధ్యతను తన మీద వేసుకున్నదై రూతు ఇల్లు దాటి బయటికెళ్ళేటప్పుడు అత్త సెలవు తీసుకుంటున్నది. ఎంత చక్కని మాదిరి కదా! చాలామంది ఇళ్ళు దాటి వెళ్ళేటప్పుడు అత్తలకు చెప్పి వెళ్ళరు. ఈమెకేంటి చెప్పేది? అని అనుకుంటారు. ఒక అత్తతో నేను 'ఆంటీ! మీ కోడలేది? అని అడిగితే 'నా కోడలు నాకు చెప్పి వెళ్ళదు' అని అనింది. పెద్దవారికి చెప్పి వెళ్తే అది మర్యాదగాను క్రమముగాను వుంటుంది. వారిని మనము లక్ష్యపెడుతున్నామని వారు సంతోషిస్తారు. మనము ఎక్కడికి వెళ్తున్నామో! ఏ పని మీద వెళ్తున్నామో చెప్పివెళ్తే దాని విషయమై వారు ప్రార్థన చేస్తూ ఉంటారు. అది మనకు మన పనికి క్షేమమే కదా! అలాగే అత్తయైన నయోమి పరిశుద్ధాత్మకు సూచనగా తలస్తూ వున్నాము గనుక విశ్వాసి ఎక్కడికెళ్ళాలన్నా, ఏమి పని చేయాలన్నా పరిశుద్ధాత్మ సెలవు తీసుకోవడం మనకు క్షేమం. ఆయన నడుపుదల మనకు క్షేమం. యోహా 16:13లో పరిశుద్ధాత్ముడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును అని వ్రాయబడినట్లు మనకు ముందుండి నడిపించమని పరిశుద్ధాత్మ నడుపుదల కొరకై మనము ప్రభువుని కోరుకోవాలి. కీర్త. 32:8లో నీ మీద దృష్టి వుంచి నీకు ఆలోచన చెప్పెదనని వ్రాయబడినట్లు పరిశుద్ధాత్ముడు తన ఆలోచన ద్వారా నిన్ను చక్కని త్రోవలో నడిపిస్తాడు. యోహా 1:12 ప్రకారము మన కోడలే మన కుమార్తె. కనుక నయోమి 'నా కుమారీ! వెళ్ళుము' అనింది.

**(బి) 2:3-7వ. బోయజు పొలములో పరిగెనేరుకుంటున్న రూతు:-**

బోయజు బేత్లెహేము నుండి వచ్చి 'ఈ చిన్నది ఎవరిదని' చేను కోయువారి మీద వుంచబడిన పనివానిని అడుగగా ఈమె మోయబు దేశము నుండి నయోమితో కూడ వచ్చిన మోయాబీయురాలైన యౌవ్వనరాలు అని చెప్పాడు. మోయాబు ఇహలోకానికి సాదృశ్యం. బేత్లెహేము పరలోకానికి పోల్చుకుంటే ఇహలోకాన్ని విడచి పరలోకాన్ని చేరాల్సిన సమయము యౌవనకాలములోనే. బాల్యమందే సృష్టికర్తను స్మరించుకొని యౌవనకాలమున కాడిమోయాలి. అత్తను పోషించే కాడిని తన భుజస్కందాల మీద మోపుకుంది రూతు. నేటి యువకులు తమ యౌవనాన్ని లోకంలో పాడుచేసుకుంటున్నారు. కాటికి కాళ్ళు చాపినప్పుడు నమ్ముకుందాము అనుకుంటారు. కానీ తన యౌవనకాలమందే తన జన్మభూమిని, తల్లిదండ్రులను విడచి బేత్లెహేముకు రూతు వచ్చిందని చేనుకోయువారి మీద వున్న పనివాడు చెబుతున్నాడంటే అది ఎంత మంచి సాక్ష్యము? అమ్మా సోదరీ! నీకు అలాంటి సాక్ష్యమున్నదా? నీవు ఏ వయస్సులో లోకాన్ని విడిచావు? ఎప్పుడు ప్రభువు దగ్గరి కొచ్చావు? ఇంకనూ రాలేదా?

7వ.లో రూతు పనివానిని సెలవు తీసికొని పరిగె ఏరుకుంటున్నది. ఇంట్లో అత్త సెలవు, పొలంలో పనివాని సెలవు తీసుకుంటున్నది. సెలవు (permission) తీసుకొనక అమర్యాదగా పనిలో దూరలేదు. సంఘంలో ఏ పనైనా చేయవలసినప్పుడు పెద్దల సెలవు తీసికోవడం సభ్యతగా వుంటుంది. ఈమె చేనుకోయువారి వెనుక పరిగె ఏరుకుంటానని చెప్పింది. తన కంటే పొలములో ముందుగా వుంటున్న వారి వెనకగా వుండి పరిగె ఏరుకుంటున్నది. ఆమె ఉదయము నుండి పరిగె ఏరుకుంటున్నట్లు కొద్దిసేపు మాత్రం ఇంట కూర్చున్నట్లు సాక్ష్యమిస్తున్నాడు ఆ పనివాడు. రూతులాగ మనము ఉదయమునుండి సాయంకాలం వరకు బైబిల్‌లో వాక్యాలను ఏరుకుంటున్నామా? కీర్త 1వ. అధ్యాయంలో వ్రాయబడినట్లు దివారాత్రములు ధర్మశాస్త్రమును ధ్యానిస్తున్నామా? కొంతసేపే ఇంటిలో విశ్రాంతి లేక భోజనము కొరకు గడిపింది. వాక్యము చెంత మనమెంత సమయం గడుపుతున్నాము? వాక్యము విషయమైన ఆశ, ఆకలిదప్పులు యౌవనకాలంలో ఎంతో అవసరం. యౌవనస్తులు తొట్రిల్లకుండా చేసేది దేవుని వాక్యం (కీర్త 119:165). యౌవనస్థులు పాపం చేయకుండా చేసేది దేవుని వాక్యం (కీర్త 119:9). వాక్యాన్ని ప్రేమిస్తే ఎంతో నెమ్మది (119:165). వాక్యము మన పాదాలకు దీపము (119:105). దేవుని వాక్యం మధురమైనది. మేలిమి బంగారుకంటెను కోరతగినది. కీర్త 19:10,11వ. ఈలాగున అనేక అనేక విధములైన మేలులనిచ్చే దేవుని వాక్యము చెంత ఎంతసేపైనా గడపడం అన్ని వయస్సుల వారికి క్షేమమే. కాని విచారంతో చెప్పుకోదమేమంటే యౌవనస్థులు వాక్యము చెంతకాక, దుష్ట సాంగత్యముచెంత, ఇంటర్‌నెట్స్ (Internets) చెంత, లోకస్థుల చెంత, టి.వి.ల చెంత సెల్‌ఫోన్స్ చెంత గడుపుతూ పాపాల ఊబిలోకి వెళ్తున్నారు. ఇది విచారమే.

కాని యౌవనస్థురాలైన రూతు యౌవనస్థుల చెంత కాదు. వాక్యానికి సూచనగా వున్న పరిగె నేరుకుంటున్నది. ఈమె జీవితం నేటి యువకులకు ఎంత మంచి మాదిరో కదా!

**(సి) 2:8వ. -16వ. రూతులో సంభాషిస్తున్న బోయజు:-** అవును, బైబిల్ చెంత మనము కూర్చుని ఆయన వాక్యమును మనము చదువుచున్నప్పుడు మన పరమ బోయజైన ప్రభువు మనతో సంభాషిస్తూ వుంటాడు. బోయజు మాట్లాడిన మాటలు: 1. 'నా కుమారీ! నా మాట వినుము. వేరొక పొలములో ఏరుకొనుటకు పోవద్దు. 2. దీనిని విడిచిపోవద్దు. 3. ఇచ్చట నా పనికత్తెల యొద్ద నిలకడగా వుండుము. 4. వారు కోయు చేను కనిపెట్టి వారిని వెంబడించుము. 5. నిన్ను ముట్టకూడదని యౌవనస్థులకు ఆజ్ఞాపించియున్నాను. 6. నీకు దాహమగునప్పుడు పనివారు చేదిన నీళ్ళకుండ యొద్దకు పోయి త్రాగుము. అని 6 రీతులుగా మాట్లాడినట్లు చదువుచున్నాము.

ప్రభువు పిల్లలమైన మనము మన ప్రభువు మాటలే వినాలి. వేరొక పొలము ఈ లోకము. అది సైతాను పొలము. దానిలో ఏరుకొనుటకు వెళ్ళవద్దు. ఈ లోకములోనున్న నేత్రాశ, శరీరాశ, జీవపుడంబము గల లోకములోనికి వెళ్లవద్దు. ఇచ్చట దేవుని పనికత్తెలున్నారు. వారితోనే సహవాసము చేయాలి. సహవాసము చెలికత్తెలతోనే చేయాలి. అబ్బాయిలు అబ్బాయిలతోనే, (Boys, boy friendsతో) అమ్మాయిలు అమ్మాయిలతోనే (girls, girl friendsతో) సహవాసము చేయాలని ప్రభువు నేర్పుతున్నాడు. ఎస్తేరు పారశీకుపు చెలికత్తెలతోనే ప్రార్థించింది. యెఫ్తా కుమార్తె తన కన్యాత్వమును గూర్చి ప్రలాపించుటకు తన చెలికత్తెలతో కూడ కొండలకు వెళ్ళింది. ఒకమ్మాయి ఆంటీ! నేను ఒక అబ్బాయితో కలసి ప్రార్థన చేసికోవచ్చా అని అడిగింది. అప్పుడు నేను ఆ అమ్మాయితో "నీవు ప్రార్థన చేసుకోవడానికి అమ్మాయిలెవరూ లేరా?" అన్నాను. చివరికి ఆ అమ్మాయి ఎవరితో కలసి ప్రార్థన చేసికోవాలనుకుందో ఆ అబ్బాయినే పెళ్ళి చేసుకుంది. ప్రార్థన అనే ముసుకులో వుండి చివరికి వారితోనే ఫ్రెండ్‌షిప్ చేస్తూ ఆ అబ్బాయిలనే పెళ్ళి చేసుకుంటున్నారీవేళ. ఇది యథార్థ ప్రార్థనయేనా? మనకంటే ముందుగా ప్రభువును నమ్ముకున్నవారిని, సేవకులు, పెద్దలైన వారిని కనిపెట్టి వారిని వెంబడించాలి. కానీ వారి మీద ఆధిపత్యము, అధికారం చేయాలని గానీ వారిని మించి వెళ్ళాలని గానీ, వారికి వ్యతిరేకంగా పనిచేయాలని గానీ, వారికి ఆటంకం కలుగచేయాలని గానీ అనుకొనకూడదు. హెబ్రీ 13:17వ.లో వ్రాయబడినట్లు మీ పైని నాయకులుగా వున్నవారు లెక్క ఒప్పచెప్పవలసినవారివలె మీ ఆత్మలను కాయుచున్నారు. వారు దుఃఖముతో ఆ పని చేసిన యెడల మీకు నిష్ప్రయోజనము. గనుక దుఃఖముతోకాక, ఆనందముతో చేయునట్లు వారి మాట విని వారికి లోబడి యుండుడి. 1థెస్స 5:12,13వ. "మీలో ప్రయాసపడుచు ప్రభువునందు మీకు పైవారై యుండి మీకు బుద్ధి చెప్పువారిని మన్నన చేసి వారి పనినిబట్టి వారిని ప్రేమతో మిక్కిలి ఘనముగా

ఎంచవలెనని వేడుకొనుచున్నాను. పై వచనముల ప్రకారము సంఘములో ప్రభువు పనిని మనకంటే ముందునుండి చేస్తున్న అనుభవజ్ఞులను సేవకులను, పెద్దలను వెంబడిస్తూ, అనుసరించి వెళ్ళాలే కానీ, వారికి అడ్డుగా ఆటంకంగా, సమస్యాత్మకంగా వుండకూడదు అని మనము గ్రహించాలి.

10వ.లో రూతు సాగిలపడి తలవంచుకొని ఏమి తెలిసి పరదేశినైన నాయందు లక్ష్యముంచునట్లు నీకు కటాక్ష్యము కలిగెనో అని చెప్పినట్లు చూస్తున్నాము. అలాగే మన పరమ బోయజుయైన మన ప్రభువు ఎదుట సాగిలపడి తలవంచుకొని పరదేశులమైన మాయందు లక్ష్యముంచునట్లు నీకు కటాక్ష్యము ఎందుకు కలిగిందని మనమును ఆయనను ఆరాధించాలి. నాసికారంధ్రములో ఊపిరి కలిగిన మానవులమైన మనల్ని దేవుడు యెష 2:23వ ప్రకారము లక్ష్యపెట్టకూడదు. అంతేకాక "ఆయన కలుగజేసిన సూర్యచంద్ర నక్షత్రములను చూచినప్పుడు నరుని జ్ఞాపకము చేసికొనుటకు వాడు ఏపాటివాడు? అని కీర్త 8:3,4వ.లోని వాక్యము చెబుతుంది. కానీ అటువంటి జ్ఞాపకము చేసికొనకూడని మనల్ని ప్రభువు ఎంతో లక్ష్యపెట్టాడు. తన ప్రియ కుమారుని ప్రాణము మన కొరకు అర్పించునట్లు ఏర్పాటు చేశాడు. ఆ ప్రియ కుమారునితో పాటు సమస్తమును ఇవ్వడానికి వెనుతీయని దేవున్ని మనమెంతగా సాగిలపడి తలవంచి ఆరాధించాలో కదా! అలా ఆరాధించవలసిన విశ్వాసికి సాదృశ్యంగా వుంది ఈ రూతు. ఈమెను లక్ష్యపెట్టడానికి, ఈమె మీద కటాక్షము చూపడానికి కారణం తన భర్త చనిపోయిన తరువాత తన అత్తను వెంబడించి బేత్లెహేముకు వచ్చి అత్తను పోషించడానికి పరిగె ఏరుకోడానికి వచ్చిందని, తన అత్తకు రూతు చేసినదంతయూ బోయజుకు తెలిసే రూతుకు కటాక్ష్యము చూపించాడని మనకు తెలుసు. కానీ ప్రియ సోదరీ! నిన్ను నన్ను గురించి మనము పాపములో పుట్టామని, పాపములో పెరిగామని, మనలో మంచిదేదియూ లేదని, మంచిదేదియు మనలో నివసించదని, దౌర్భాగ్యులమని, గ్రుడ్డివారము, దిగంబరులము, దిక్కులేనివారము, శావగ్రస్తులము, అన్యులము, ఊరి వెలుపల వుండినవారమని, నశించి నరకాగ్నికిపాలయ్యేవారమని మనము యింకనూ పాపులమైయుండగా, బలహీనులము, భక్తిహీనులము, శత్రువులమైయుండగా ప్రభువు మనలను తన ప్రాణము పెట్టునంతగా ప్రేమించిన ప్రేమకు మనమెంతగా ఈ విషయాలనుబట్టి ప్రభువును ఎంతగా ఆరాధించాలో కదా!

10వ.లో నీవు నీ అత్తకు చేసినదంతయూ నాకు తెలిసింది అని రూతుతో అనడంబట్టి, ఈ లోకంలో మనము ఎవ్వరెవ్వరికి ఏమి చేశామో అవన్నీ పరమబోయజుకు తెలుసు. ఆమె అత్తకు ఈలాగున త్యాగముతో పరిచర్య చేసిన కారణాన 2:12వ.లో యెహోవా నీవు చేసిన దానికి ప్రతిఫలమిచ్చునని అన్నాడు. అవును మనము చేసిన

ప్రతిదానికి, ఆ పనులు చేయించుకున్నవాళ్ళు ప్రతిఫలమివ్వరు. కానీ యెహోవా దేవుడు ప్రతిఫలమిస్తాడు. 1:9లో చనిపోయిన వారి యెడలను, నా యెడలను మీరు దయచూపినట్లు యెహోవా మీ యెడల దయచూపును గాక అని అత్త కోడండ్రతో చెప్పింది. సామె 31:30వ. చేసిన పనినిబట్టి అట్టిదానికి ప్రతిఫలమియ్యబడును అని వ్రాయబడినది. 2 కొరింథీ 5:10వ.లో ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందుతామని వ్రాయబడింది. 12వలో యెహోవా రెక్కల క్రిందికి నీవు వచ్చితివని బోయజు రూతుతో అన్నాడు. యెహోవా తన రెక్కల క్రింద మనల్ని ఉంచుకున్నాడు. కీర్త 91:4 ప్రకారం ఆయన రెక్కలతో నిన్ను కప్పుతాడు. ఆయన రెక్కల క్రింద నీకు ఆశ్రయము కలుగును అని వ్రాయబడినది. మలాకి 4:2వ. ప్రకారము ఆయన రెక్కలు మనకారోగ్యము నిస్తాయి. యౌవనకాలంలోనే లోకంలాంటి మోయాబును విడిచి యెహోవా రెక్కల క్రిందికి వచ్చి సురక్షితాన్ని పొందింది. లోకంలో రక్షణ లేదు. ప్రభువు వద్దనే రక్షణ ఆయన నీకు సంపూర్ణమైన బహుమానమిస్తాడని బోయజు రూతుతో చెప్పాడు. మనం చేసిన సత్క్రియలకు మనుష్యులు ఎవరైనా కొంత ప్రతిఫలము మాత్రమే ఇవ్వగలరేమో! కానీ ప్రభువు సంపూర్ణమైన బహుమానమిస్తాడు. సొలొమోను తనకు సహాయము చేసిన దానికి ప్రతిఫలముగా ఇచ్చిన పట్టణములు, 'కాబూల్' అని హీరాము రాజు అన్నాడు. అనగా నిష్ప్రయోజనమైన వాటిని సొలొమోను రాజు ఇచ్చాడని హీరాము రాజు అన్నాడు. (1రాజు 9:13). కానీ పరమ సొలొమోను మనము చేసింది కొంత అయితే ఆయన నిష్ప్రయోజనమైనవి కాక సంపూర్ణ బహుమానము శ్రేష్ఠమైనదే యిస్తాడు.

అందుకు 13వ. రూతు "నా యేలినవాడా నేను నీ పనికత్తెలలో ఒకదానను కాకపోయినను, నీవు నన్నాదరించి నీ దాసురాలనగు నాయందు ప్రేమ కలిగి మాటలాడితివి. కనుక నాయందు కటాక్షము కలుగనిమ్మని చెప్పింది. రూతు బోయజు పనికత్తెలలో ఒకతె కాదు. పొలం పనులేమి ఆమెకు తెలియదు. మోయాబులో ఎన్నడు ఆమె పొలం పనులెలాటివో ఆమెకు తెలియవు. కానీ అత్తను పోషించుటకై బీదలైన వారు చేయునట్లు పరిగె ఏరుకోవడానికి వెళ్ళింది. పరిగె తనకోసం అత్తకోసం ఏరుకోవడానికి మాత్రమే వెళ్ళింది. కానీ బోయజు పని ఆమె ఏమియూ చేయలేదు. అయినా బోయజు ఆమెను ఆదరించినట్లు ప్రేమ కలిగి మాటలాడినట్లు మన ప్రభువు కూడా మనలను ఆదరించి ప్రేమించేవాడు. అలాగే ప్రభువు పని చేయక వున్న భక్తిహీనులమై వుండిన మనలను నీతిమతులనుగా చేయడం మాత్రమే కాక, తన యొక్క ఏ పనికి పనికిరాని నిష్ప్రయోజకులమైన మన అవసరాలను కూడ తీర్చుచున్న ప్రభువుగా ఆయనను మనము చూస్తున్నాము. కీర్త 145:15,16వ.లో ఉన్నట్లుగా తన గుప్పిలి విప్పి ప్రతి వాని కోరికలు తీరుస్తున్నాడు. తగిన కాలమందు నీవు

వారికి ఆహారమిచ్చుదువు. కీర్త 132:15వలో వున్నట్లు దాని ఆహారమును నేను నిండుగా దీవించెదను అన్నాడు. కీర్త 72:12,13లో వ్రాయబడినట్లు దేవుడు దరిద్రులు మొఱ్ఱ పెట్టగా (రూతు బోయజును వేడినట్లు) అతడు వారిని విడిపించును. దీనులను నిరాధారులను అతడు విడిపించును. నిరుపేదలయందును, బీదలయందును అతడు కనికరించును. అలాగుననే మనము కూడా మనకేమియు సహాయము చేయని వారికి వారి బీదరికమునుబట్టి మనమును ప్రభువు వలె ఉపకారము చేయబద్ధులమై యున్నాము. కీర్త 146:8వ.లో "ఆయన పరదేశులను కాపాడువాడు. ఆయన తండ్రిలేని వారిని విధవరాండ్రను ఆదరించువాడు. కీర్త 94:19 ప్రకారము "నా అంతరంగములో విచారములు హెచ్చగా నీ గొప్ప ఆదరణ నా ప్రాణమునకు నెమ్మది కలుగచేయుచున్నది" అని వ్రాయబడినది. ఈలాగున బోయజు ఆదరణతో ప్రేమ కలిగి మాట్లాడాడు. కనుక నా యెడల నీకు కటాక్ష్యము కలుగనిమ్మని చెప్పింది. ఏమి తెలిసి నా యెడల నీకు కటాక్ష్యము కలిగెనో అని 10వ.లో అన్నది. ఇప్పుడు 13వ. నా యెడల నీకు కటాక్ష్యము కలుగనిమ్మని చెప్పింది. 10వ.లో <u>ఆరాధించింది</u>. 13వ. కటాక్ష్యము కలుగనిమ్మని <u>ప్రార్థించింది</u>. ఆమె అలాగున కటాక్ష్యము కలుగనిమ్మని ప్రార్థన చేయగానే మరికొన్ని మేలులు ఆమెకు ప్రకటించాడు. 1. భోజనకాలమును నీవిక్కడికి వచ్చి భోజనము చేయమన్నాడు. 2. చిరకలో నీ ముక్క ముంచి తినమని చెప్పాడు. 3. పేలాలిచ్చాడు. 4. ఆమె పేలాలు తిని తృప్తిపొంది తన అత్తకు కూడ మిగిల్చింది. 5. పనల మధ్య ఆమె ఏరుకొనవచ్చును అన్నాడు. 6. ఆమెను అవమానపరచవద్దు అన్నాడు. 7. ఆమెకు 'పిడికెళ్ళు' పడవేయండి అన్నాడు. 8. ఆమెను గద్దించవద్దు అన్నాడు. ఈలాగున 8 మేలులతో ఆమె విషయమై బోయజు చేశాడు. చివరకు ఆమె ఏరుకొనిన వాటిని దుల్లగొట్టగా అవి తూమెడు యవలు అయ్యాయట. ఒక్కరోజే 30 శేర్లు దాదాపు అయ్యాయి. ఒక్క రోజులో 30 శేర్లు అయ్యాయి. అంటే రోజుకు ఒక శేరు యవలు అత్తా, కోడళ్ళు ఖర్చుచేసినా ఇక ఆ నెలంతా తినగలిన యవలు ఒక్కరోజులోనే వచ్చాయంటే ఎంత సమృద్ధి బోయజు పొలంలో ఆమెకు దొరికిందో చూడండి. ఒక్క రోజులోనే నెల అంతటికి కావాల్సిన ధాన్యం దొరికింది. 12సార్లు మాత్రము పొలానికి వెళ్ళి (లేక 12 రోజులు వెళ్తే) ఒక సం॥ మంతటికి సరిపడే గింజలు ఆమె తెచ్చుకోగలదు.

(డి) 2:17వ. –23వ. వరకు బోయజును గురించి అత్తా కోడలు ఇచ్చిన సాక్ష్యము:-

రూతు పొలంలో నుండి ఏరుకొని వచ్చిన తూమెడు యవలను అత్త చూచిందని 2:18వలో వ్రాయబడింది. ప్రియసోదరీ! నీవు బైబిల్‌లో ఏరుకొనిన వాక్యాలను కూర్చుకొనిన వాక్యాలను, లేక గ్రహించిన, నేర్చుకొనిన వాక్యాలను ఎవరికైనా చెప్పావా? వినిపించావా? నీవు పొందిన వాక్యాహారాన్ని యితరులతో పంచుకున్నావా? దేవుడు నీకు నేర్పినవాటిని, ఆయన పాదల దగ్గర మరియవలె నీవు నేర్చుకున్న వాటిని యితరులతో చెప్పావా? నేను చేసినవన్ని నాతో చెప్పినవాడు మెస్సియ కాదా? అని తన ఊరి ప్రజలతో సమరయ స్త్రీ

చెప్పలేదా? అలాగున మనము పొందిన మేలులను ఇతరులు చూస్తున్నారా? నీ అభివృద్ధి అందరికి తేటగా కనబడనిమ్ము. 1 తిమో 4:15.

రూతు 2:18వ.లో ఆమె తాను తిని తృప్తి పొంది మిగిల్చిన పేలాలను అత్తకు చూపించి యిచ్చిందట. అమ్మా! దేవుడు మనకిచ్చిన ఆశీర్వాదాలను మనము మాత్రమే ఆరగిస్తున్నామా? నయోమి లాంటి విధవరాండ్రకు, దిక్కులేని వారికి, సేవకులకు పంచగలుగుతున్నామా? నెహె 8:10వ.లో వున్నట్లు "ఇదివరకు ఏమియు తమ కొరకు సిద్ధము చేసికొనని వారికి వంతులు పంపించండని దేవుని వాక్కు చెబుతోంది. దావీదును అతని జనులు అరణ్యములో అలసి ఉన్నారని ఆకలిగొని దప్పిగొని ఉందురని తలంచి షోబీ, మాకీరు, బర్జిల్లయి 1. పరుపలు 2. పాత్రలు 3. కుండలు 4. గోధుమలు 5 యవలు 6. పిండి 7. వేచిన గోధుమలు 8. కాయధాన్యములు 9. చిక్కుడుకాయలు 10. పేలాలు 11. తేనె 12. వెన్న 13. గొఱ్ఱెలు 14. జున్నుముద్దలు వీటన్నిటిని దావీదు నొద్దకును అతని యొద్దనున్న జనులు ఇంచుమించు 400 మంది భోజనము చేయుటకై తీసికొనివచ్చారు. అలాగే తన ఇంటి వారిని చంపడానికి వస్తున్న ఆకలిగొనిన దావీదు కొరకు అతనితో వున్న 400 మంది కొరకును అబీగయీలు త్వరపడి సిద్ధపరచిన కానుకల పట్టీని చూద్దామా? 2 సమూ 24:18. అబీగయీలు త్వరపడి రెండు వందల రొట్టెలను, రెండు ద్రాక్షారసపు తిత్తులను, వండిన 5 గొఱ్ఱెల మాంసమును, ఐదు మానికల వేచిన ధాన్యమును, నూరు ద్రాక్ష గెలలను, రెండువందల అంజూరపు అడలను, గార్ధభముల మీధ వేయించి దావీదుకు పంపింది. వీటన్నింటినిబట్టి చూడగా దేవుడు మనికిచ్చినవన్ని మనకే కాదు. మన గిన్నెలు నిండిపొర్లే అనుభవం ప్రభువిచ్చినప్పుడు మాత్రమేకాక, కడు బీదలైన మాసిదోనియ సంఘపువారి దాతృత్వాన్ని కూడ మనము కలిగియుండాలి. రెండే కాసులున్న బీదరాలు రెండూ ప్రభువుకి ఇవ్వలేదా! కనుక మన ధనములోను, బట్టలలోను, మనకున్నవన్నిటిలోను ప్రభువునుబట్టి లేని వారికి మనమును వంతులు పంపి ప్రభువు దీవెనలకు పాత్రులు కావాలని కోరబడుచున్నాము.

తన కివ్వబడిన పేలాలను అత్త కొరకు మిగిల్చినట్లు మనమును ఇతరుల కొరకు గుర్తుంచుకొని వారిని దృష్టిలో ఉంచుకొని వారి కొరకు మిగిలిస్తున్నామా? మన కుటుంబాల్లో మన డబ్బంతా మనమే వాడుకుంటున్నామా? మిగులుందా? లేక తగులుందా? సామె 31:16,11 వచనాల్లో గుణవతియైన భార్య ద్రవ్యము కూడబెడుతుందట. భర్త లాభప్రాప్తికి వెలితి కలుగదు. అమ్మా! నీ విషయమై నీ భర్త ఈలాగు సాక్ష్యమీయగలడా? నీవు చేయలనుకుంటే చేయగలవు. డబ్బు కూడబెట్టి ద్రాక్షతోట అనే సంఘాన్ని కొంతవరకైనా కట్టలేవా? అలాగే తబితా విధవరాండ్రకు తల్లిదండ్రులు లేని వారికి బట్టలు కుట్టి ఇవ్వగలిగినది. యాకో 1:27 ప్రకారం తబితలాగా చేయడమే నిజమైన భక్తి అని

వ్రాయబడివుండుట మనము చదువుచున్నాము. ఇటువంటి వ్రాతలేమియు ఆనాటి రూతు చదువలేదు. కానీ దేవుడు ఆత్మయే ఆమెను అలా నడిపించాడు.

19వ.లో ఆమె అత్త "నేడు ఎక్కడ ఏరుకొంటివి? ఎక్కడ పనిచేసితివి? నీయందు లక్ష్యముంచినవాడు దీవించబడును గాక" అని అత్త అప్పుడే అలసి యిల్లు చేరుకున్న కోడలికి మీద మీద 3 ప్రశ్నలు వేయగా అత్త ప్రశ్నలకు రూతు విసికిపోలేదు. తాను ఎవని యొద్ద పనిచేసిందో ఆ సంగతి సావధానముగా అత్తకు తెలియపరచింది. కొన్నికుటుంబాల్లో ముసలివారిని, పెద్దవారిని గౌరవించరు. వారి మాటలకు విలువనివ్వరు. వారి మాటలను తీసిపారేసినట్లు చేస్తారు. ముసలివారి నోరు మూయించేస్తారు. "మీరు పాతకాలమునాటి వాళ్ళు మీకేం తెలుసు? అని అంటుంటారు. "ఇదిగో మీ మంచములు మీ కొరకు వేచివున్నాయి. వెళ్ళి పడుకోండి" అని ఈ కాలపు యౌవనులు అంటూవుంటారు. కానీ రూతు అలా అనలేదు. తన అత్తకు విషయాలన్నీ తెలియచెప్పింది. 20వ.లో ఎవని యొద్ద పనిచేశానో అతని పేరు బోయజు అని చెప్పగానే నయోమి "బ్రతికిన వారికిని, చచ్చినవారికిని ఉపకారము చేయుట మానని ఇతడు యెహోవా చేత ఆశీర్వదించబడును గాక!" అని తన కోడలితో అన్నది. బోయజు పేరు వినగానే 1. ఉపకారము చేసేవాడు, 2. మానక ఉపకారము చేసేవాడు. 3. బ్రతికిన, చచ్చిన వారికి ఉపకారము చేయక మాననివాడు అనే సాక్ష్యము ఆమెకు గుర్తుకువచ్చింది. ప్రియసోదరీ! నీ పేరు చెబితే ఇతరులు నిన్ను గూర్చి ఏమంచి సాక్ష్యము చెప్పగలరు? మంచిగానా? లేక చెడ్డగానా? ఏమని సాక్ష్యం చెబుతారు? దావీదును అతని మనుష్యులును "మాకు ఎంతో ఉపకారము చేసియున్నారు. మేము పొలములో వారి మధ్యను సంచరించుచున్నంత సేపు అపాయముగాని, నష్టముగానీ; సంభవించనేలేదని చక్కని సాక్ష్యము చెబుతున్నారు. నీ విషయమై అట్టి సాక్ష్యమెవరైనా చెప్పగలరా? సోదరీ! మన ప్రభువైన యేసుక్రీస్తు "అందరికి ఉపకారి" కీర్త 145:9. మనమును సాధ్యమైనంతవరకు ఇతరులకు ఉపకారులుగా వుండాలి. నీవు నీ పరమ బోయజు అయిన ప్రభువు నీకేమి చేశాడో దాని విషయమై నయోమి వలె సాక్ష్యమిస్తున్నావా? నేను నీకేమి చేశానో వెళ్ళి నీయింటివారికి చెప్పమని ప్రభువు సేన దయ్యము పట్టిన వానితో చెప్పగా వాడు దెకపొలి అంతటా చెప్పాడని వ్రాయబడింది. 20వ.లో మరియు నయోమి "ఆ మనుష్యుడు మనకు సమీపబంధువు" అని 2వ సాక్ష్యము చెబుతోంది. అతడు మనలను విడిపంపగలవారిలో ఒకడు అని మూడవ సాక్ష్యం తన కోడలితో చెప్పింది? ఇప్పటికే బోయజు 'ఉపకారి' అని చెప్పింది. ఇప్పుడు రెండవదిగా అతడు 'మనల్ని విడిపంపగలవారిలో ఒకడు, సమీప బంధువుడు' అని చెప్పింది. ధర్మశాస్త్రకాలములో ఏ స్త్రీకైనా సంతానము కలుగకుండా భర్త చనిపోతే తన భర్త యొక్క సోదరుడు ఆ స్త్రీని పెళ్ళి చేసికొని ఆమెకు తన

అన్న తరపున సంతానము కలుగచేయాలి. దీనినే బంధువుని ధర్మము అంటారు. అలా చేసి ఆమెను వైధవ్యము నుండి విడిపించాలి. అలా విడిపించే వారిలో బోయజు ఒకడట. నీ పరమ బోయజైన నీ ప్రభువు నీకు సమీపముగా ఉన్నాడా? వాక్యమేమి చెబుతోంది. నేను దూరమున వున్న దేవుడను మాత్రమేనా? సమీపమందున్న దేవుడను కానా? అని అన్నాడు కదా! ఆయన నీ హృదయములో వుంటానని చెప్పిన దేవుడు. నీవు ఆయనపై విశ్వాసముంచావు. కనుక ఆయన నీ హృదయంలోనే నీ చుట్టూ నీ మధ్య నీలోనే వున్న సమీప బంధువు. నీతోనే వుండాలని కోరుకుంటున్నాడు. నీవూ ఆయనకు సమీపంగానే వుంటున్నావా? లేక ఆయనకు దూరంగా వుంటున్నావా? సమీపంగా వున్న నీ పరమబోయజు నిన్ను విడిపిస్తాడు. పాపంలో వుంటే పాపము నుండి విడిపిస్తాడు. ఇబ్బందులలో, శ్రమలలో, దుఃఖములో వున్నా కూడ విడిపిస్తాడు. ఇక్కడ యౌవనకాలంలోనే విధవరాలైన రూతును వైధవ్యం నుండి బోయజు విడిపించినట్లుగా ప్రియ సోదరీ! ప్రస్తుతము నీ సమస్య ఏదైనను దాని నుండి విడిపంచే దేవుడు. ఐగుప్తు కొలిమి నుండి ఇశ్రాయేలీయులను విడిపించాడు. ఎఱ్ఱ సముద్రము గుండా వాగ్దాన దేశానికి నడిపించాడు. ఈలాగున మన ప్రతి సమస్యనుండి విడిపించేవాడు మన సమీప బంధువైన యేసుక్రీస్తు. తలిదండ్రులకంటే, పిల్లలకంటే, ఆప్తుల, మిత్రులకంటే మనకు అతి సమీపస్తుడు ఆయనే. రూతును వైధవ్యమునుండి విడిపించే వారిలో బోయజు ఒకడట. ఈ బోయజుకంటే మరీ సమీప బంధువుడు మరొకడున్నాడట. 4వ అ.లో ఈ విషయము తెలుస్తుంది. కానీ, మన పాపములనుండి విడిపించేవాడు, మరణబలము నుండి, అపవాది నుండి విడిపించువాడు మన సమీప బంధువుడు ఒక్కడే ఒక్కడు. ఆయనగాక వేరు బంధువుడు మనకు లేడు. ఆయనవుండగా మరొకడు అవసరము లేదు. ఆయనే క్రీస్తు యేసు. మరి ఎవనివలనను మనకు రక్షణ లేదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలసియున్నది. (అపొ 4:12) అలాగున మనము మన ప్రభువుని గూర్చి చక్కని సాక్ష్యమివ్వవలసిన వారముగా వున్నాము. ఈ సమీప బంధువుని గూర్చి 4వ అధ్యాయంలో సవిస్తారంగా ధ్యానించుకుందాం. 21వ.లో బోయజు "పంట కోత అంతయు ముగియువరకు తన పనివారి యొద్ద నిలుకడగా వుండుమని రూతుతో చెప్పినట్లు 22వ.లో రూతు తన కోడలైన రూతుతో - నా కుమారీ! అతని పనికత్తెలతో కూడనే బయలుదేరుచు వేరొక చేనిలోని వారికి నీవు కనబడకపోవుట మంచిదని బోయజు చెప్పిన మాటలనే అత్త కూడ చెప్పింది. అవును, వృద్ధస్త్రీలు యౌవనస్త్రీలకు ఉపదేశం చేయాలని తీతు పత్రిక 2:3-5వ.లో వ్రాయబడినది. పనికత్తెలతో కూడ బయలుదేరమని చెప్పింది, అంటే ఒంటరిగా వెళ్ళకూడదు అని చెబుతోంది. దేవుడు నరుడు ఒంటరిగా వుంటే మంచిది కాదన్నప్పుడు, సేవకు కూడ యిద్దరిద్దరుగా వెళ్ళాలని ప్రభువు శిష్యులతో చెప్పినప్పుడు స్త్రీ ఒంటరిగా

పనికి వెళ్ళడం క్షేమంకాదు. వీలైనంతవరకు ఎవరినో ఒకర్ని తోడు తీసికెళ్ళడం ఎంతో మంచిది. దీనా "షెకెము" వూరిలోని కుమార్తెలను చూట్టానికి ఒంటరిగా వెళ్ళింది. కనీసం తల్లినిగాని, ఒక చెలికత్తెను గానీ తనతో తీసుకెళ్ళలేదు. కనుక హమోరు కుమారుడైన షెకెముతో చెరుపబడింది. జీవితానికి మచ్చ తెచ్చుకుంది. ఒంటరితనంలో భద్రత లేదు. తల్లిదండ్రుల, పెద్దల ఉపదేశం మన మేలు కొరకే. వారి మాట యౌవనస్థులు తప్పక పాటించాలి. వేరొక చేనిలోని వారికి నీవు కనబడకపోవుటే మేలని చెప్పింది. స్త్రీలు అవసరమైతెనే తప్ప అనవసరంగా బయటికి కనబడక (expose అవ్వకుండ) పోవుటే మేలు. బజారుల్లో, సైట్ సీయింగ్స్‌లో, రోడ్స్ మీద పచార్లు చేయుటం పబ్బులలో కనబడటం మంచిది కాదు. అనవసరంగా శోధనల్లో పడుటకు ఆస్కారమవుతుంది. అవసరమైన సమస్యలు తలవని తలంపుగా వచ్చిపడతాయి. యెష 26:21వ. ప్రకారం నీవు వెళ్ళి నీ అంతఃపురములో ప్రవేశించుము. నీవు వెళ్ళి నీ తలుపులు వేసికొనుము, ఉగ్రత తీరిపోవు వరకు కొంచెము సేపు దాగి వుండుము" అని వాక్యము చెబుతోంది. గనుక సాధ్యమైనంత వరకు ఈ భ్రష్టలోకానికి స్త్రీ అనవసరంగా బయటికి కనిపించకపోవడం మన మంచికొరకే. 2013లో ఢిల్లీలోని 'నిర్భయ' అనే యౌవనస్థురాలు తనకు ప్రధానము చేయబడిన అబ్బాయితో కలసి షాపింగ్‌కు వెళ్ళి 'బస్'లో తిరిగి వస్తుండగా 'బస్' లోని దుర్మార్గులు ఆ అమ్మాయిని ఎలా రేప్ చేశారో మనమందరము న్యూస్ పేపర్‌లో చదివాము. తల్లితోపాటు వెళ్తున్న మరో అమ్మాయిని ప్రకాశం జిల్లాలో ఎలా పాడుచేశారో, విన్నాము. తండ్రితో 'ఆటో'లో వెళ్తున్న కుమార్తెను ఆ ఆటోలోని పురుషులు ఎలా పాడుచేశారో వార్తా పత్రికల్లో చదువుతూ వున్నాము. సమీపస్తులతో, స్వకీయులతోడుతో వెళ్తుంటేనే భద్రత లేని ఈ రోజుల్లో ఒంటరిగా వెళ్తే భద్రంగా వుండగలమా? లేదు కనుక 'చెలికత్తెలతో కూడ బయలుదేరు' అని అత్త రూతుతో చెబుతోంది. అంతేకాక వేరొక చేనిలోని వారికి కనబడకూడదు అంటే వేరొక చేను ఈ లోకమే. ఈ లోకం మన చేను కాదు. మన చేను సంఘమే. మన చేనులో భద్రత. మన సంఘములో భద్రతే. ఏ యౌవనస్థుడు ఈమెను ముట్టకూడదని సంఘములోని వారికి దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. లోకమనే వేరొక చేనివారైన లోకస్తులకు ఈ ఆజ్ఞలున్నాయా? ఆజ్ఞలు అదుపులు వారికి లేవు. ఏ దేవుడు, ఏ జనానికి ఈలాంటి మేలుకరమైన ఆజ్ఞలు యివ్వలేదు. కనుక బరితెగించి అన్యజనులు పాపాలను చేయడానికి తెగిస్తున్నారు. కామాంధులుగా వున్నారు. కనుక స్త్రీకి భద్రత లేదు. యౌవనస్తురాండ్రకు మొత్తానికి క్షేమము లేదు. 1 యోహాను పత్రిక 5:18లో దేవుని మూలముగా పుట్టినవాడు తన్ను తాను భద్రము చేసికొనును గనుక దుష్టుడు వానిని ముట్టడు అని వ్రాయబడింది. ఒకవేళ పని నిమిత్తమై లోకంలోనికి వెళ్తే విశ్వాసి తనను తాను భద్రంచేసుకోవాలి. ఎలా భద్రం చేసుకోవాలి? స్త్రీలు విపరీతంగా (overగా) అలంకరించుకొని షోకేసుల్లోని బొమ్మల్లాగ వుంటూ పురుషులను

రెచ్చగొట్టే ప్రవర్తనతో, లుక్ ఎట్ మి (look at me) అనేట్లుగా తయారవ్వకూడదు. కొద్దిమంది సహజంగానే అందంగా కనబడతారు. మంచి ప్రవర్తనతో వుంటారు. కొద్దిమందికి అందం లేకపోయినా అందంగా కనబడడానికి నానా ప్రయత్నాలు చేసికొంటూ తమ భద్రతను గురించి పట్టింపులేకుండా వుంటున్నారు. మెట్టుకు ఎక్కడికెళ్లినా ప్రభువు కాపుదలకై ప్రభువుని ప్రార్థించుకొని, ప్రభువుని మనతోపాటు తీసుకెళ్ళడం చాలామంచిది. ఈ చిన్న వాక్యపు సలహాలు మనం పాటిస్తే, మనం భద్రంగా వుండగలం. లేకపోతే మనమందరం 'దీనా'లు అయిపోయే ప్రమాదముంది. తల్లిదండ్రుల, పెద్దల సలహాలు మన మేలు కొరకే కాబట్టి వాటిని స్వీకరించడం మనకు మేలే కానీ కీడు కాదు. అలా అయితే మన పాఠ్యభాగములోని రూతు, తన అత్తగారి సలహా పాటించిందా? లేదా? 23వ. కాబట్టి గోధుమలకోత, యవలకోత ముగియువరకు ఆమె అతని పనికత్తెల యొద్ద బోయజు అలాగే అత్త చెప్పినట్లుగానే నిలుకడగా వుండి తన అత్తయింట నివసించెను అని చదువుచున్నాము. బోయజు (ప్రభువు) అత్త (పరిశుద్ధాత్ముడు) చెప్పినట్లుగానే రూతు చేసింది. ప్రభువు చెప్పినదే పరిశుద్ధాత్ముడు చెబుతాడని పరిశుద్ధాత్ముడు ప్రభువు మాటలే తీసికొని మనతో చెబుతాడని యోహాను సువార్త 16:13వ.లో చదువుతాము. కాబట్టి అత్తలారా! మీ ఉపదేశాలు, మీ సలహాలు పరిశు ద్ధాత్మలాగ (మీకు మీరే యేమియు బోధింపక) ప్రభువు వాటిలోనివే తీసికొని చెబుతున్నారా? ఒకరిని హెచ్చరించేముందు ప్రభువు దగ్గర కనిపెట్టుకొని చెప్పాలి? పెద్దవాళ్లము కదా! మేము ఏమి చెప్పినా యౌవనస్థులు వినాల్సిందే అని స్వంత సలహాలు, హెచ్చరికలిస్తున్నారా? అత్తలారా! ఈ విషయంలో జాగ్రత్తగా వుండాలి. మరో విషయం. కోతలు ముగియు వరకు రూతు అత్త యింటిలో నిలుకడగా వుండింది అని చదువుచున్నాం. ఈనాటి కోడళ్ళు అత్త యింటిలో నిలుకడగా వుంటున్నారా? లేక మాటిమాటికీ తల్లి గారింటికి వెళ్ళి మకాం వేస్తున్నారా? మీరిలా చేస్తే ముసలివారైన నీ అత్త మామల యోగక్షేమ విషయమేంటి? భర్త సంగతేంటి? నీ సుఖం చూచుకొని అమ్మ వాళ్ళింటికెళ్ళితే ఇక్కడ వాళ్ళ సంగతేంటి? మరువుము నీ తండ్రి ఇంటిని మరువుము నీ స్వజనమును అనే వాక్యం సంగతేంటి? తల్లిగారిల్లు నీ యిల్లు కాదు, మెట్టినిల్లే లేక అత్తగారిల్లే నీ యిల్లు. దాన్ని అభివృద్ధి చేసుకో. కొద్దిమంది కోడళ్ళు ప్రతి సెలవులకు తల్లిగారింటికెళ్తూ వుంటారు. ఒక్కసారి కూడ అత్తగారింటికి వెళ్ళరు. నీ యింటిగూడు విడిచి తిరిగే పక్షిలాగ, నీ వుంటావా? (సామె. 27:8) ఈ విషయమైన ఉపదేశము 1వ. అధ్యాయములోనే చాలా నేర్చుకున్నాము. ఇక ముందుకెళ్దాం.

## 3వ. అధ్యాయము

**(ఎ) 3:1-7వ. కళ్ళములోని బోయజును చేరుటకై అత్తచేత సిద్ధపరచబడిన రూతు:-** నయోమి ఈ అధ్యాయములో తన ఒంటరితనములో తనతో కూడ నివసించుచూ, తన పోషణ

కొరకు బోయజు పొలములో పని చేస్తూ వచ్చిన తన కోడలి జీవిత భవిష్యత్తును గురించి లేక ఆమె జీవిత సెటిల్‌మెంట్‌ను గురించి తనకోసం రోజూ పొలంలో అవిశ్రాంతంగా పాటుపడుతున్న కోడలికి విశ్రాంతి విచారించాలనుకుంటున్నది. విశ్రాంతి అనగా ఇంట్లో విశ్రాంతి తీసుకోవడం కాదు. కానీ, తనను ఒక యవనస్థునితో పెండ్లి చేయించాలని విచారిస్తోంది. రూతుకు ఒక జీవిత భాగస్వామి దొరకాలని, ఆమెకు సంతానం కలగాలని, ఆమెకంటూ ఒక గృహం ఉండాలని ఆమె భవిష్యత్తును గూర్చిన ఏర్పాటుల విషయమై ఆలోచన కలిగి ఉన్నది. రూతుకు తనను గూర్చిన విచారము లేదు. అత్తను గూర్చి మాత్రమే ఆలోచిస్తోంది, నిజమే దేవుని బిడ్డలారా! ప్రభువు 1 పేతు 7వ. ప్రకారము మనలను గూర్చి చింతించుచుండగా మన చింత యావత్తు ప్రభువు మీద వేయాలి. ఇక్కడ వున్న మాట చొప్పున పిల్లల భవిష్యత్తంతటిని గూర్చిన విచారము మొదట దేవుడు తరువాత తల్లిదండ్రులు చేయాలి. కానీ, ఈ దినాల్లో యౌవనస్థులు వాళ్ళ పెళ్ళిళ్లు వారే చేసుకోవాలి అనుకుంటున్నారు. ఆదాము పెళ్ళి దేవుడే చేశాడు. నీ పెళ్ళి కూడా ఆ దేవుడే చేయాలి. సామె 3:6 ప్రకారం "నీ ప్రవర్తన అంతటిమీద ఆయన అధికారానికి ఒప్పుకొనుమని" వాక్యం చెబుతోంది. ఆయన తప్పుడు నిర్ణయాలు చేయడు. కనుక ప్రియ సోదరీ! నీ పుట్టుపూర్వోత్తరాలు, నీ భవిష్యత్తంతటిని ఎరిగిన ప్రభువుకే నిన్ను గూర్చిన, నీ వివాహమును గూర్చిన విచారము ఆయనకే అప్పగించుము. ఆయనే నీ మార్గములను డైరెక్ట్ చేసేవాడుగా వున్నాడు. వాక్యము ద్వారానే ఆయన నిన్ను నడిపిస్తాడు (direct ).

3:2వ.లో ఆ బోయజు కళ్ళములో యవలు తూర్పారబట్టింపబోవుచున్నాడు గనుక నీవు స్నానము చేసి తైలము రాచుకొని బట్టలు కట్టుకొని ఆ కళ్లమునకు వెళ్ళుము అని నయోమి రూతుతో చెబుతోంది. రూతు ఇంతవరకు పొలం పనితో అలసి, వైధవ్య వస్త్రములు ధరించియుండగా ఇప్పుడు స్నానము చేసి, వేరు వస్త్రములు ధరించి తైలము పూసుకొని వెళ్ళమని చెబుతోంది. అత్తయైన నయోమి. ఇది శరీరసంబంధమైన సిద్ధపాటు. కానీ మన వరుడైన ప్రభువు మధ్యాకాశమనే కళ్ళమునకు మన క్రియలనుబట్టి తీర్పు తీర్చుటకై రాబోతున్న ప్రభువును ఆ కళ్ళములో కలువబోతూ వుండగా స్నానము చేసిన అనుభవముండాలి. ప్రభువు రక్తములో కడుగబడి శుద్ధీకరించబడ్డాం. కానీ, రోజురోజూ మన దైనందిన జీవితంలో అంటుకొనుచున్న పాపపు బురదను ఆయన సన్నిధికి వచ్చినప్పుడెల్లా వాక్యస్నానం చేత శుద్ధి చేసుకోవడం అవసరం. దీన్ని గురించే హెబ్రీ 10:22 వ.లో "మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షించబడిన హృదయములు కలవారమై, నిర్మలమైన ఉదకములో స్నానము చేసిన శరీరములు కలవారమై వుండాలని యదార్థ హృదయముతో దేవుని సన్నిధానమునకు చేరాలని వ్రాయబడినది. ప్రియ విశ్వాసీ! దినదినమూ ఈ వాక్యస్నానము చేసుకుంటున్నావా? కనుక వాక్యస్నానము వ్యక్తిగత బైబిల్ స్టడీ ఇంట్లో చేసుకోవడం ద్వారాను,

మనకు తెలియని విషయాలను సంఘ నియామక కూడికలకు వచ్చినప్పుడు వినిన వాక్యము ద్వారాను స్నానము చేసికొనవలసిన వారముగా వున్నాము. సోదరీ! ప్రభువు ఈ క్షణమే మధ్యాకాశమనే కళ్ళముకు వస్తే, వాక్య స్నానము చేయబడినదానవై సిద్ధముగా వున్నావా? ఆ తరువాత బట్టలు వేసుకోమని అత్త చెప్పింది. అంతకుముందు తన భర్తను 'మహ్లోనును'ను పోగొట్టుకొని వైధవ్యవస్త్రం వేసుకొని ఉంది రూతు. ఇప్పుడు తైలము రాచుకొని ఆ పాతవస్త్రం, మాసిపోయిన, నలిగిపోయిన వస్త్రం విడిచి వేరు వస్త్రము ధరించమని నయోమి చెబుతోంది. తైలము పరిశుద్ధాత్మకు సూచనగా ఉంది. ప్రభువు రక్తంలో పాపములను కడుగుకున్న వారిని ప్రభువు తన ఆత్మచేత ముద్రించాడు కానీ, ఆత్మ నింపుదల దినదినమూ మనము కలిగి వుండాలి. ఆత్మకు జీవితంలో ప్రాధాన్యతనిస్తూ, ఆత్మచేత శారీరక క్రియలను చంపుతూ ఆత్మ ఆధ్వర్యానికి అప్పచెప్పుకోవాలి. దేవుడిచ్చిన ఆత్మీయ వస్త్రాలు 1. రక్షణ వస్త్రము 2. నీతి వస్త్రము 3. ప్రేమ, వస్త్రము 4. దీనమనస్సు అను వస్త్రము 5. ఉల్లాసమనే వస్త్రము మొదలగునవి ధరించుకొనివుండాలి. అనగా ఈ గుణాలన్ని మనము కలిగి ఉండి ఆయనను మధ్యాకాశంలో ఎదుర్కొనాలి. అలాగున సిద్ధపడిన రూతు బోయజు అన్నపానములు పుచ్చుకొనుట చాలించువరకు అతనికి మరుగైయుండుమని నయోమి చెప్పింది. బోయజు అన్నపానములు అనగా మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క అన్నపానములను సూచిస్తున్నాయి. ప్రభువు అన్నపానాలేంటి? ఒకసారి సమరయ స్త్రీతో ప్రభువు మాట్లాడుచుండగా తన శిష్యులు ప్రభువుకు ఆహారం తెచ్చారు. ప్రభువు వారితో మీకు తెలియని ఆహారం నాకున్నది" అన్నాడు. ఎవరైనా ఏమైనా ఆయనకు తెచ్చిపెట్టారేమో అని వారనుకున్నారు. కానీ ప్రభువు యోహాను 4:34వ.లో నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటయు ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నది అని చెప్పాడు. తండ్రి తనను ఆత్మల రక్షణార్థమైన పనిచేయుట కొరకు లోకానికి పంపాడు గనుక ఇక్కడ సమరయ స్త్రీ యొక్క ఆత్మరక్షణ జరిగింది కనుక అదియే ఆయన ఆహారమని ప్రభువు చెబుతున్నాడు. అలాగున చిట్టచివరి ఆత్మ రక్షించబడి సంఘములో చేర్చబడితేనే ప్రభువు అన్నపానములు ముగించినట్టు. కనుక ఆత్మల రక్షణ ముగిసిన తరువాతనే రూతు అను సంఘము పరమ బోయజు అయిన ప్రభువును మధ్యాకాశమనే కళ్ళములో కలుసుకుంటుంది. అంతవరకు సంఘము భూలోకంలోనే వుంటుంది.

4వ. అతడు పండుకొనిన తరువాత అతని కాళ్ళమీద బట్టతీసి పండుకొనుమని నయోమి రూతుతో చెప్పింది. దీని అర్థమేమిటి? రూతు తన వివాహము కొరకైన మనవిని చేయుటకు బోయజు పాదములను ఆశ్రయిస్తోంది. ఆయన పాదసన్నిధిలోనే యౌవనస్థులు తమ వివాహములో దేవుని చిత్తము నడిపింపుకొరకు ప్రార్థించాలి. అలా నీవు ప్రార్థిస్తే నీవు ఏమి చేయాలో ఎవరిని పెండ్లాడాలో ఆయన నీకు చెబుతాడు. అలా అత్త చెప్పిపంపగా

రూతు "నీవు సెలవిచ్చినదంతయు చేస్తాను" అని చెప్పి కళ్ళానికి వెళ్ళినట్లు 4,5వ.లో వ్రాయబడినది. రూతువలె పరిశుద్ధాత్మ దేవుడు నీతో చెప్పినదంతయూ నీవు చేస్తే నీ వివాహ జీవితము దీవెనకరమై ఉంటుంది. అత్త చెప్పినదంతా చేసింది కనుకనే 11వ.లో బోయజు నీవు చెప్పినదంతయు నీకు చేసెదనని బోయజు రూతుతో అన్నాడు. ఎంత ఆనందకరమైన విషయమో కదా! పరిశుద్ధాత్మ ప్రేరేపణ ప్రకారం మనము ప్రార్థిస్తే పరమ బోయజు అట్టి మన ప్రార్థన ప్రకారమంతయూ మనకు చేస్తాడు. మన మాట ప్రకారం ఆయన మనకు చేయాలంటే ఆయన మాట ప్రకారం మనమునూ చేయాలి. మనం విత్తిందే మనం కోస్తాము. 'కానా' వివాహంలో పరిచారకులు ఆయన మాట ప్రకారం ఆ రాతి బానలను నీటితో నింపారు. వారు కోరిన ప్రకారం యేసు ప్రభువు వారికి ద్రాక్షారసమిచ్చారు. ప్రియ యౌవన బిడ్డలారా! దేవుని మాటను మీరు అన్ని విషయాల్లో ( మీ పెండ్లి సమయంలో కూడ రూతు వలె) వింటే మీ ప్రార్థన దేవుడు వింటాడు. బోయజు దగ్గరికి రూతు 7వలో మెల్లగా పోయి అత్త చెప్పినట్లే ఆయన కాళ్ళమీద బట్టతీసి పండుకున్నది. ఆమె బట్టతీయగా ఆయన కాళ్ళు కనిపించాయి. అంటే "ప్రభువు పాదాలను ఆశ్రయించింది. బోయజు తల దగ్గర కాదు ఆమె స్థానము, బోయజు ప్రక్కలో కాదు ఆమె స్థానము, బోయజు కాళ్ళ దగ్గరే. మనము ప్రార్థనలో ప్రభువు పాదాల చెంత గడపాలి. ముఖ్యంగా యౌవన స్త్రీలు అనగా 1 కొరి 7:35వ.లో "అటువలె పెండ్లికాని స్త్రీయు, కన్యకయు తాము ఆత్మయందును, శరీరమందును పవిత్రురాండ్రై యుండుటకు యోగ్య ప్రవర్తనులై యుండుటకు ప్రభువు సన్నిధానవర్తనులై వుండాలి" అని వ్రాయబడినది.

కాబట్టి ఈ వాక్య ప్రకారము ఈనాడు పెండ్లి కావలసిన యౌవనురాండ్రందరును ఆ విషయములో దేవుని చిత్తాన్ని అన్వేషించుటకు ప్రభువు సన్నిధానవర్తనులై వుండాలి అని మనము నేర్చుకుంటున్నాము. ప్రియ యవనస్థులారా! ప్రభువు పాదాల దగ్గర మీ పెండ్లి కొరకు ప్రార్థిస్తున్నారా? ఇస్సాకు ప్రతి సాయంకాలములో పొలములో ధ్యానింపవెళ్ళేవాడని వ్రాయబడింది. ధ్యానింప వెళ్ళెను అంటే హీబ్రూ భాషలో lasuach అని వ్రాయబడింది. అనగా శరీరాన్ని మనస్సుని దేవుని సన్నిధిలో వంచుట అనగా ప్రార్థించుట అను అర్థమిస్తోంది. అలా ప్రార్థించాడు గనుకనే ఇస్సాకు కన్నులెత్తి చూడగా (అనగా దేవునివైపు ప్రార్థనలో కన్నులెత్తగా) ఒంటెలు వస్తూ వుండడం గమనించాడు. ఆ ఒంటెలలో ఒక ఒంటె మీద తన పెండ్లి కుమార్తె వస్తుండడం గమనించాడు ఇస్సాకు. నీవు అలాగున ప్రార్థన సన్నిధిలో వుండుటకు నిశ్చయించుకుంటావా? ఈనాడు చాలామంది యవనస్థులు మ్యారేజ్ బ్యూరో సన్నిధిలో, ఇంటర్నెట్ సన్నిధిలో, ఫ్రెండ్స్ సన్నిధిలో, మనుష్యుల సన్నిధిలో గడుపుతున్నారు కానీ, దేవుని సన్నిధిలో దేవుణ్ణి అడుగుట లేదు. కనుక సరియైన వివాహ సంబంధాలను పొందలేకపోవుచు తమ ఇష్టానుసారమైన పెళ్ళిళ్ళు చేసుకొని కుటుంబ జీవితంలో నరకయాతన అనుభవిస్తున్నారు.

**(బి) 2:8-9వ. కళ్ళములో బోయజుతో మనవి చేసిన రూతు:-**

8వ.లో మధ్య రాత్రియందు బోయజు వులికిపడి తిరిగి చూచినప్పుడు ఒక స్త్రీ తన పాదముల యొద్ద పరుండుట చూచాడు. బోయజు వయసు రీతిగా రూతుకంటే చాలా పెద్దవాడని భక్తులు చెబుతుంటారు. అందుకే బోయజు రూతును పొలంలోను, కళ్ళములోను కుమారీ! అనే సంబోధించాడు. వయస్సులో పెద్దవాడు ఒక చిన్నది తన పాదాల దగ్గర పడుకున్నట్టు కనబడితే వులికిపడుతున్నాడెందుకు? ఈనాడు ఒక 4సం॥ పసిబిడ్డగానీ, ఒక యవన పిల్లగానీ, అది నడివయస్సులో వున్న స్త్రీ గానీ, వృద్ధ స్త్రీగాని మధ్యరాత్రి ఎవరూ లేని ఒంటరివేళలో కనబడితే ఈనాటి పురుషులు ఆమెను ఊరకనే వదలిపెడతారా? ఒంటరితనంలో సహాయం కొరకు వేడుకున్నా అటువంటి స్త్రీలను అత్యాచారం, మానభంగం చేయడం, ఆమెను చెరపడం, ఆమెను బలవంతంగా అనుభవించడం వంటివి చేస్తున్నారు. కానీ తండ్రిలాంటి బోయజు రూతు అను చిన్నదాన్ని చూడగానే ఉలికిపడ్డాడంటే ఇది ఆయన పవిత్రతను సూచిస్తుంది. ఈనాడు పురుషులు స్త్రీని చూస్తే ఉలికిపడాలి. భయపడాలి. అలాగే స్త్రీలు, పురుషులు కనబడినప్పుడు ఉలికిపడాలి, భయపడాలి. దేవుని భయాన్ని బట్టి అలా చేయాలి. లేకపోతే విచ్చలవిడి జీవితాలౌతాయి.

9వ.లో అతడు నీవెవరవు? అనగా రూతు – "నీ దాసురాలిని, నీవు నా సమీప బంధువుడవు. నీ కొంగు నా మీద కప్పుమని కోరింది. ఇదంతా అత్తయైన నయోమి నడిపింపు చొప్పుననే చేసింది. రూత 2:12వ.లో యెహోవా రెక్కల క్రింద సురక్షితంగా నుండునట్లు వచ్చింది. ఇప్పుడు 3:9వ.లో తన సమీప బంధువుడైన బోయజు కొంగు క్రిందికి రావలెనని బోయజుతో ఆమె మనవి చేస్తుంది. ఇది ఆమె బోయజుతో చేసిన రెండవ మనవి. మొదటి మనవి "నా యెడల నీకు కటాక్ష్యము కలుగనిమ్ము అని 2:13వ.లో చదువుతాము. ఆ మొదటి విన్నపానికి 9 రీతులుగా జవాబు నిచ్చాడని 2వ అధ్యాయంలో చూచాము. నీ కొంగు నా మీద కప్పుము అనేది రెండవ మనవి. ఇప్పుడు ఈ రెండవ మనవికి కూడ జవాబునిచ్చాడు. అదేంటో చూద్దాం.

**(సి) 3:10-15వ. బోయజు నుండి చక్కని సాక్ష్యమును, చక్కని జవాబును ఆహారమును పొందుకున్న రూతు:-** 10వలో బోయజు నా కుమారీ! నీవు యెహోవా చేత దీవెననొందిన దానవు అని అంటున్నాడు. యెహోవాచే మాత్రమే కాక, అత్తతో కూడ 1వ అధ్యాయం 9వ వచనములో దీవించబడింది. "మీలో ఒక్కొక్కతె పెండ్లి చేసుకొని తన ఇంట నెమ్మది నొందునట్లు యెహోవా మీ యెడల దయచేయును గాక! అని దీవించబడింది. అనగా మనుష్యుల దీవెన, దేవుని దీవెన ఈమె పొందుకుంది. ప్రభువుని నమ్మిన మనము verticleగా దేవుని దీవెన horizontalగా మానవుల దీవెన కూడా సంపాదించుకోవాలి. దీన్ని గురించే లూకా 2:52వ.లో మనుష్యుల దయను, దేవుని దయను అని వ్రాయబడింది. దేవుని

దీవెన, దయ మాత్రమే కాక, మనుష్యుల దీవెన, దయకూడ ప్రభువు కలిగియున్నట్లు మనమునూ కలిగి వుండాలి. అలాగే బోయజు 10వ.లో కొద్దివారినే గానీ, గొప్ప వారినే గాని, యవనస్థులను నీవు వెంబడించకపోవుటనుబట్టి నీ మొదటి సత్ప్రవర్తనకంటే, వెనుకటి సత్ప్రవర్తన మరి ఎక్కువైనది అని రెండవ సాక్ష్యమిస్తున్నాడు. కనీసం కొంతకాలము, యవలకోత, గోధుమల కోత ముగియు వరకు బోయజు పొలములో రూతు పరిగె నేరుకొనుచూ వుండగా ఆమె ప్రవర్తనను చక్కగా పరిశీలించిన బోయజు ఎంత మంచి సాక్ష్యమిస్తున్నాడో కదా! బోయజు రేపే ఆమెను పెళ్ళి చేసుకోబోతున్నాడు. కానీ ముందురోజు వరకు రూతు ఎంతమంచి సాక్ష్యము తాను పెండ్లి చేసుకోబోతున్న బోయజు ద్వారా పొందినదో కదా! ప్రియ సోదరీ! నిన్ను గూర్చి నీ కాబోయే భర్త నుండి ఎలాంటి రమ్యమైన సాక్ష్యాన్ని నీవు పొందేదానివిగా వున్నావు? ఈనాడు అనేకమంది పెండ్లి కాకమునుపే అవాచ్యముగా ప్రవర్తిస్తున్నారు. పవిత్రతకు వారి మధ్య చోటులేకుండా పోతోంది. రూతు కొద్దివారిని గాని, గొప్పవారిని గాని యవనస్థులను వెంబడించలేదట. పెద్ద వయస్సు కలిగిన బోయజును, తనను కుమారీ! అని సంబోధించే తండ్రిలాంటి వాడైన బోయజును అత్త మాటవిని పెండ్లి చేసుకోవడానికి ఒప్పుకుంది. ఆమె మొదటి సత్ప్రవర్తన కంటే, వెనుకటి సత్ప్రవర్తన మరి ఎక్కువైనదే కానీ, రాను రాను తక్కువ కాలేదు. మొదటి సత్ప్రవర్తనే, చివరలోకూడా కాదు మరీ, ఎక్కువైన సత్ప్రవర్తన ఆమె కలిగుంది. రోజులు గడుస్తుండగా ప్రియసోదరీ! మన సత్ప్రవర్తన ఎక్కువ అవుతోందా? లేక రానురాను రాజు గుఱ్ఱము గాడిద అయిపోయిన తీరులో నీ సాక్ష్యముందా? కార్యారంభముకంటే కార్యాంతము మరీ మేలుగా ప్రసంగి 7.8లో వుండాలని వాక్యం చెబుతోంది. బోయజు 11వ.లో నా కుమారీ! భయపడకుము. నీవు చెప్పినదంతయు నీకు చేసెదను అన్నాడు. ఈ మాటనుబట్టి మనకు అర్థమయ్యేదేమిటంటే ఒక పురుషుడు (బోయజు) ఆ రాత్రిలో ఒంటరివేళ తనతో మాట్లాడుతూ వుంటే రూతు భయపడుతోంది. కాబట్టియే నా కుమారీ! భయపడకుము' అని బోయజు రూతుతో అంటున్నాడు. ఒక పురుషుడు (పెద్ద వయస్సు కలిగిన పురుషుడు) మాట్లాడుతూ ఉంటే ఒక 16 యేళ్ళ చిన్నదానికి ఒళ్ళులో ఈనాడు భయమున్నదా? ఈనాటి యవనస్థులు ఎంత భయం లేకుండా, ఎంతో ఫ్రీగా నానా చెత్త చెదారంలాంటి సంగతులు మాట్లాడుకుంటూ పగలబడి నవ్వుకుంటూ, రాత్రుల్లో, క్లబ్బులకు, పబ్‌లకు, సోషల్‌ఫంక్షన్‌లకు వెళ్ళుతూ, పురుషులతో కూడ మద్యాన్ని సేవిస్తూ, సిగరెట్స్ కాల్చుతూ భయం భక్తి లేకుండా కనిపిస్తున్నారు. ఇంత భయభక్తులు, పవిత్రత బోయజు రూతుల మధ్య వున్నాయి కదా! రేపే కదా! మా వివాహం. ఎలాగూ పెళ్ళి చేసుకోబోతున్నాము. నయోమికి కూడ మా పెళ్ళి అంగీకారమే కదా? అని వివాహానికి ముందే హద్దుమీరి తమ శరీరాలు ఒకటయ్యేందుకు (premarital sex) ప్రయత్నించారా? లేదు. ఈవేళ చాలామంది యవ్వనులు ప్రభువును నమ్మిన వాళ్ళు

పెళ్ళికి ముందే అనేక పాపాలు జరిగించి వారి మొదటి సత్ప్రవర్తనను కోల్పోతున్నారు. కానీ రూతు సత్ప్రవర్తన మొదటికంటే చివరిలో మరీ ఎక్కువైన సత్ప్రవర్తనతో వుంది. ఎంత మంచి సత్ప్రవర్తన. రూతు, బోయజు శరీరాలను ఆ చీకటి రాత్రిలో సదా తమ యవ్వన కోరికలను ఎంత హద్దులో, ఆత్మ ఆధీనంలో వుంచుకున్నారో కదా! ఎంతగా యవనేచ్ఛలను, ఎంతగా శరీరేచ్ఛలను, ఎంతగా మానుషేచ్ఛలను ఆత్మ కంట్రోల్‌లో వుంచుకున్నారో కదా! అదే 11వ. వచనంలో నీవు 'యోగ్యురాలవని' నా జనులందరూ ఎరుగుదురు అని బోయజు ఆమెను గూర్చి 3వ వచనములో సాక్ష్యమును ఇస్తున్నాడు. రూతు దేనికి యోగ్యురాలు? బలవంతుడు, ఆస్తికర్త, భూస్వామి. ప్రభువుకు ముంగుర్తుగా వున్న బోయజుకు భార్య అగుటకు 'యోగ్యురాలని' బోయజు జనులందరూ ఆమెను గూర్చి ఎరుగుదురట. ఇంకనూ పెళ్ళికాని యవనస్థురాండ్లారా! మీరు పెళ్ళి చేసుకోబోయేవారు బోయజులాంటి మంచి సాక్ష్యము గలవారేనా? మరి నీవు రూతులాంటి సాక్ష్యాన్ని నీవు పెండ్లి చేసుకోబుతున్న నీ కాబోయే భర్తతో పొందగలవా? పరీక్షించుకో.

12వ.లో మరియు "బోయజు నేను నిన్ను విడిపింపగలవాడను" అను మాట వాస్తవమే. అయితే నీకు నాకంటే సమీపమైన బంధువు ఒకడున్నాడు. ఈ రాత్రి వుండుము. 13వ. ఉదయమున అతడు నీకు బంధువుని ధర్మము జరిపిన యెడల సరి. అతడు విడిపింపవచ్చును. నీకు బంధువుని ధర్మము జరుపుటకు అతనికి ఇష్టము లేకపోయిన యెడల యెహోవా జీవముతోడు నేనే నీకు బంధువుని ధర్మము జరిపెదను. ఉదయమగు వరకు పండుకొనుమని చెప్పెను" అని చదువుచున్నాము. కాబట్టి 14వ. ఆమె ఉదయమగు వరకు అతని కాళ్ళ యొద్ద పండుకొని ఒకనినొకడు గుర్తించుపాటి వెలుగు రాకముందే లేచిందని చదువుచున్నాము. కనుక రూతు బోయజు పాద సన్నిధిలో ఒక రాత్రంతా గడిపినట్లు విశ్వాసులు ప్రభువు పాదాల చెంత ఒక రాత్రంతా ప్రార్థనలో గడిపితే ఇక మన భారమంతా ఆయనే చూచుకుంటాడు. ఈ వచనంలో రూతు ఒకనినొకడు గుర్తించుపాటి వెలుగు రాకముందే నిద్రనుండి లేచిందట. 15వ వచనములో ఉదయమే లేచిన రూతుకు 6 కొలల యవలను కొలిచి యిచ్చాడట. ఉదయమునే లేచి ప్రార్థించిన వారికి ప్రభువు తన వాక్యధాన్యాన్ని 6 కొలలుగా మనకిస్తాడు. అనగా 6 అనే సంఖ్య మానవ సంఖ్య. మానవులముగా మనము గ్రహించగలినంత వాక్యాన్నిస్తాడని దాని భావము. క్రొత్త నిబంధన క్రిందనున్న మనకు మన ప్రభువైన యేసుక్రీస్తు 6 కొలల యవలు కాదు, 7 కొలల యవలు అనగా 7 అనే సంఖ్య దేవుని సంపూర్ణ సంఖ్య. అనగా దేవుడు తన గ్రహింపులో తన ద్వారా వచ్చిన సంపూర్ణ వాక్యాన్ని యుగముల్లోను, తరముల్లోను మరుగుచేయబడిన వాక్య మర్మాన్ని ఈ పరిశుద్ధాత్మ యుగములో మరుగు, మర్మము లేకుండా సంపూర్ణంగా

తన వాక్యాన్ని మనకు దయచేయు పరమబోయజై వున్నాడు. ప్రియసోదరీ! ఉదయకాలమే నీ హృదయ దుప్పటిని ఆయన సన్నిధిలో పరుస్తావా? నీ హృదయాన్ని సంపూర్ణ వాక్యంతో ఆయన నింపుతాడు. అనేకమంది విశ్వాసులు ఉదయమే లేచే అలవాటు పెట్టుకోరు. పనిమనిషి, పాలవాడు, వచ్చాక లేస్తారు. కొద్దిమంది ఫోన్ వచ్చినప్పుడు లేస్తారు. కొద్దిమంది స్త్రీలకంటే వారి భర్తలే ముందు లేచి భార్యలను లేపుతారు. స్త్రీలు రేయి మొదటి జామున లేవాలని విలాపవాక్యములు 2:19 వ.లో చదువుతాము. యోబు అరుణోదయమే తన పిల్లల కొరకు దేవుని యొద్ద బలిచేయుటకు వేకువనే నిద్రలేస్తున్నాడు. మగ్దలేను మరియ ఇంకా చాలా చీకటిగా వున్నప్పుడే ప్రభువు దేహానికి సుగంధ ద్రవ్యాలను రుద్దడానికి వెళ్ళినట్లు యోహాను 20:1లో చదువుతాము. ప్రియసోదరీ! నీవు మేల్కొనే వేళ ఎప్పుడు? భర్తకంటే, పిల్లలకంటే ముందే లేచి ప్రార్థిస్తూ, బైబిల్ చదివే అలవాటు నీకున్నదా? ప్రభువు నీ హృదయ ఒడిని తన వాక్యంతో నింపుతాడు. బోయజు, రూతుతో నీ అత్త ఇంటికి ఒట్టి చేతులతో వెళ్లవద్దని చెప్పాడు. మన తండ్రి ఇల్లు సంఘము. మన అత్త యిల్లు లోకము. విశ్వాసిగా మనము ఏ యింటికి వెళ్ళినా వట్టి చేతుల్తో వెళ్ళకూడదు. లోకమనే ఈ అత్తగారింటిలో ఎక్కడికి వెళ్ళినా దేవుని వాక్యము పట్టుకొని జీవసజ్యోతులుగా కనబడుతూ అనేకులకు వాక్యమైయున్న ప్రభువు రక్షణ సువార్తను చెప్పాలి. సంఘమనే తండ్రి ఇంటికి వస్తే ప్రభువును ఎరిగిన వారికి బోధ వాక్యాన్ని, హెచ్చరిక వాక్యాన్ని ఆదరణ వాక్యాన్ని ప్రభువు రాకడకు సిద్ధపరిచే వాక్యాన్ని, ఎదుగుదలనిచ్చే వాక్యాన్ని పంచాల్సినవారముగా వాక్య ఐశ్వర్యాన్ని కొరింథీయులలాగ కలిగియుండాలి. ఎవరైనా వాక్యాన్ని పంచమని అడిగితే లేదండీ! నేను సిద్ధపడలేదు అనకూడదు. ఎప్పటికీ వాక్యాన్ని పంచగలుగుటకై 'దైవజనుడు సన్నద్ధుడై' యుండాలి అని వ్రాయబడిన ప్రకారము Ever ready batteries లాగా ఎప్పుడు మన హృదయాలను వాక్యముతో నింపుకోవాలి. పరలోకానికి కూడ మనము ఒట్టి చేతులతో వెళ్ళకూడదు. ద్వితీ 25:25. ఆత్మలను చేత పట్టుకొని ప్రభువు పరలోకరాజ్యానికి తీసుకెళ్ళాలి.

**డి) 16,17వ. బోయజు తనకు చేసినదంతయు అత్తకు తెలియచేసిన రూతు:-**

అవును ప్రభువు మనపట్ల ఏమేమి మేలులు చేశాడో, అవన్ని ప్రభువు మనకిచ్చిన జవాబులు, అభయాలు ప్రభువిచ్చిన ఆదరణ, అన్ని ఇతరులతో పంచుకోవాలి. సాక్ష్యమివ్వాలి. సేనా దయ్యము పట్టినవాడు బాగయ్యాక ప్రభువు ఆయనతో "నేను నీకు ఏకార్యాలు చేశానో వాటిని నీ యింటివారికి తెలియ చెప్పుమంటే అతడు దెకపొలి అంతటా అనగా 10 ప్రాంతాల్లో దేవుని కార్యాలను తెలియజేశాడట. సమరయ స్త్రీ యేసయ్యను గురించి తన సమరయ గ్రామమంతటా సాక్ష్యమిచ్చింది. నీవు ఎన్ని చోట్ల ప్రభువు నీకేమి చేశాడో వాటిని గూర్చి సాక్ష్యమిచ్చావు? మీరు యెరూషలేములోను, యూదయ, సమరయ ఆ తరువాత భూదిగంతములవరకు నాకు సాక్ష్యులై వుండుమని చెప్పారు. మరి నీవెక్కడ సాక్ష్యమిస్తున్నావు?

(ఇ) 18వ. బోయజును గురించి మంచి సాక్ష్యమిస్తూ, రూతును జవాబుకై ఊరకుండమని అనగా నిరీక్షించమని లేక కనిపెట్టమని చెప్పిన నయోమి:- "నేటి దినమున ఆ మనుష్యుడు నీ మనవిని నెరవేర్చితేగాని ఆ మనుష్యుడు ఊరకుండడు" అని మంచి సాక్ష్యమిస్తోంది. అవును. ప్రభువు నేటి దినమే కాదు, మనకు సమస్యలు రాకమునుపే మన సమస్యలకు కావలసిన జవాబులు వాగ్దాన రూపంలో ఎప్పుడో ఇచ్చేశాడు. మీరు అడుగువాటినెల్ల పొందియున్నామని నమ్మండి. అప్పుడు అవన్నియూ, కొన్ని కాదు, అవన్నియు మీకు దేవుడ అనుగ్రహిస్తాడని వాక్యము చెబుతోంది. అడగువాటిన్నిటికంటెను ఊహించువాటన్నిటికంటెను ఎక్కువగా ప్రభువు మన పట్ల చేస్తాడు. మనల్ని ఊరకుండి, నమ్మి, విశ్వాసంతో కనిపెట్టమంటున్నాడు. ఆయన మాత్రము ఊరుకొనకుండా మన కార్యాలను నెరవేర్చుచున్నాడు. ఊరకుండుడి, నేనే దేవుడని తెలిసికొనుడి (కీరత& 46:10). మీరు మరలి వచ్చి ఊరకుండుటవలన రక్షించబడుదురు. (యెష30:15) ఊరకుండుడి నేనే దేవుడని తెలుసుకొనుడి (కీర్త 46:10) ఈలాగున మనము ప్రభువుని, ఆయన మాటలను విశ్వసించి మన భారాన్ని ఆయన మీద మోపడమే ఊరకుండుట. కానీ, ఆయన ఊరకొనకుండ మన భారమును తన మీద మోపుకొని మన పనులు జరిగిస్తూ ఉంటాడు. ఈ రీతిగా ఊరకొనకుండా మనకు పనులు చేసిపెట్టేవారు ఈ లోకంలో ఎవరున్నారు? క్రీస్తుయేసులో మనకు దొరికిన సదుపాయాలెన్నో కదా!

# 4వ అధ్యాయము

## బోయజు ఇంటికి వచ్చిన రూతు

<u>1. 4:1-10వ. రూతు పని మీద ఉన్న బోయజు అనగా పెండ్లి పని మీద ఉంటూ, ఊరకుండక పనిచేయుచున్న బోయజు. లేక రూతు మీద తన కొంగు కప్పుచున్న బోయజు. లేక రూతు కోరినట్లు ఆమెను పెండ్లాడుచున్న బోయజు.</u>

ఇక్కడ రూతు కోరినట్లు బోయజు ఆమెను పెండ్లి చేసుకున్నాడు. మనల్ని పెండ్లి చేసుకోమని మనము ప్రభువును కోరనేలేదు. మన యెడల ఆ ప్రభువుకున్న శ్రద్ధ ఎంత గొప్పదో చూస్తున్నాం. మనము అడగనివాటిని మనకిచ్చాడు. మనము కోరకున్నను ఆయనే మనల్ని వరించడానికి ఇష్టపడ్డాడంటే మనల్ని ప్రభువు ఎంత ప్రేమించాడో కదా! ఆయన ప్రేమను ఎలాగు వర్ణించగలము? అట్టి ఆయన అంతులేని, ఎనలేని, అనంతమైన, మితిలేని, అమోఘమైన, దివ్యమైన, విశేషమైన సిలువనెక్కిన, ప్రాణమిచ్చిన అంత్యము వరకు ప్రేమించిన ప్రేమను, దాని, లోతు, ఎత్తు, పొడవు, వెడల్పుల కొలతలు గ్రహించి, గ్రహించినంతవరకు ఆయనను జీవితాంతము ప్రేమించి స్తుతించి ఆరాదిద్దాము.

మొదటి రెండు వచనాలలో కూర్చుండెను, కూర్చుండిరి, కూర్చుండగా, కూర్చుండమని, కూర్చుండుడని అని ఈ పదాలు 5సార్లు వ్రాయబడ్డాయి. ఎవరు కూర్చున్నా,

ఎవరు కూర్చోకపోయినా బోయజు పురద్వారము నొద్ద కూర్చుండగా అనే విషయాన్ని చూస్తున్నాము. బోయజు రూతు పనిని నెరవేర్చడానికి కూర్చున్నాడు. మన పరమ బోయజైన యేసుప్రభువు మార్కు 16:19వ.లో వ్రాయబడినట్లు తండ్రి ఈ లోకంలో తనకిచ్చిన పనిని అనగా పాపులమైన మన కొరకు రక్తము కార్చి చనిపోయి, తిరిగి లేపబడి, తండ్రి చిత్తాన్నిబట్టి తన సంఘ వధువును రక్షించే పనినే నెరవేర్చిన తరువాతనే ఆయన పరమున చేర్చుకొనబడి, దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడయ్యెనని చూస్తున్నాం. తండ్రి మన విషయమై అప్పగించిన పనిని నెరవేర్చేంతవరకు ప్రభువు కూర్చోలేదు. ప్రక 5:6లో వ్రాయబడినట్లు వధింపబడినట్లుండిన గొఱ్ఱెపిల్ల, 24 పెద్దలు, 4 జీవుల మధ్య నిలబడియున్నట్లు చదువుచున్నాము. ఇక్కడ 16:19లో ఆ తండ్రిపని నెరవేర్చిన తరువాత ప్రభువు తండ్రి కుడిపార్శ్వమున కూర్చున్నాడు. పని ముగించే వరకు విశ్రాంతి తీసికొననివాడు మన ప్రభువు. ఆయన సంఘమైన మనమును అవిశ్రాంతంగా ఈ లోకంలో పగలు వుండగానే ప్రభువు పనిని చేయవలసిన వారమైయున్నాము.

పురద్వారములోనే పూర్వం వ్యాపార లావాదేవీలు జరిగేవి. ఇది ప్రజా సమస్యలను పరిష్కరించే రచ్చబండ వంటిది. బోయజు అక్కడ కూర్చుండగా రూతుకు తన కంటే సమీప బంధువుడు ఆ త్రోవను వెళ్లుచుండగా అతనిని బోయజు పిలువగా అతడు వచ్చి కూర్చున్నాడు. బోయజు ఆ వూరి పెద్దలలో 10 మందిని పిలువగా వారును వచ్చి పురద్వారమున కూర్చున్నప్పుడు వారందరి ముందర బోయజు - నయోమి తన పెనిమిటియైన ఎలీమెలెకు భూభాగమును అమ్మివేయుచున్నది గనుక నీవు ఆ భూమిని, విడిపించుమని సమీప బంధువునితో చెప్పగా అతడు నయోమి భూమిని విడిపిస్తానన్నాడు. కానీ బోయజు 5వ.లో చనిపోయిన మహ్లోను భార్యయైన రూతు యొద్ద నుండియు ఆ భూమిని సంపాదించుకొని రూతును పెండ్లి చేసికొని వైధవ్యమునుండి ఆమెను విడిపించమని చెప్పగా ఆ సమీపబంధువు "నేను నా స్వాస్థ్యమును పోగొట్టుకొందునేమో, నేను దానిని విడిపించలేనని బోయజుతో చెప్పాడు. ఎందుకలా చెప్పాడంటే అతడు నయోమి యొక్కయు, రూతు యొక్కయు భూమి విడిపించాలంటే అతడు రూతుని పెళ్ళి చేసుకొని రూతు ద్వారా కనబడిన సంతానాన్ని నయోమిని పోషించాల్సిందే. అలాగున రూతును పెండ్లి చేసుకుంటే తన స్వాస్థ్యములో కొంతభాగము రూతుకు ఆమె సంతానానికి చెందుతుంది. తనకు నష్టమొస్తుందేమో అనుకొని అతడు నేను విడిపంపలేను అని చెప్పాడు. పైగా రూతు వలన కలిగిన సంతానము చనిపోయిన వాడైన మహ్లోను సంతానమని పిలువబడుతుందే కానీ తన సంతానముగా పిలువబడదు. అందుకు అతడు దానికి ఒప్పుకోలేదు. ఇశ్రాయేలీయులలో బంధు ధర్మమును గూర్చిగానీ, క్రయవిక్రయములను గూర్చిగానీ, ప్రతి సంగతిని స్థిరపరచుటకు పూర్వము జరిగిన మర్యాద ఏమిటంటే ఒకడు తన చెప్పును తీసి తన పొరుగువానికి ఇవ్వాలి. 8వ.లో ఆ సమీప బంధువు తన చెప్పుతీసి నీవే ఆ భూమిని విడిపించి సంపాదించుకొనుమని, ఆ చెప్పును

బోయజుకు ఇచ్చివేశాడు. అందుకు 9వ.లో బోయజు ఎలీమెలెకు కలిగిన యావత్తును, కిల్యోనుకు, మహ్లోనుకు కలిగిన యావత్తును, నయోమి చేతి నుండి సంపాదించాను. అలాగే చనిపోయిన వారి పేరు అతని సహోదరుల నుండియు, అతని స్థలము యొక్క ద్వారము నుండియు కొట్టివేయబడక యుండునట్లు నేను మహ్లోను భార్యయైన రూతును సంపాదించుకొని, పెండ్లి చేసుకొనుచున్నాను. దీనికి మీరందరూ సాక్ష్యులై వున్నారని పెద్దలతోను, ప్రజలందరితోను చెప్పాడు. ఇక్కడ బోయజు మహ్లోను పేరు కొట్టివేయబడకుండా తన పేరు కొట్టివేయబడుటకు ఇష్టపడ్డాడు. అలాగే యేసుప్రభువు బ్రతికి యుండగానే స్మశాన భూమికి తీసికొని రాబడ్డాడు. సజీవుల భూమిలోనుండి అతని పేరు కొట్టివేయబడింది. కానీ మన పేరు జీవగ్రంథములో వ్రాయబడేటట్లు ప్రభువు చేశాడు.

రూతుకు బోయజుకంటే అతి సమీప బంధువుడు రూతును పెండ్లి చేసుకుంటే నా స్వాస్థ్యమును పోగొట్టుకుంటానేమోనని, తాను నష్టము పొందదానికి ఇష్టపడలేక ఆమెకు బంధువుని ధర్మము జరపలేను అన్నాడు. కానీ బోయజు ఎటువంటి నష్టానికైనా ఒప్పుకొని ఆ భూమిని విడిపించి, రూతును తను పెండ్లి భార్యగా చేసికోవడానికి, ఆమె ద్వారా తనకు పుట్టబోయే సంతానాన్ని మహ్లోను సంతానమే అని అంటారు కానీ బోయజు సంతానమని అనరు. తాను కొనవలసిన భూమికి తన పేరు పెట్టడానికి లేదు. అది మహ్లోను భూమి అనే పిలువబడుతుంది. బోయజు అనే తన పేరు ఇక కనబడదు. అయినా రూతును, మహ్లోను సంతానాన్ని, నయోమిని వారిసందరినీ పోషించే భారం తన మీద పడుతుంది. వీటన్నిటికి బోయజు ఎంతగానో నష్టపోవాల్సి వస్తుంది. క్రొత్త భారాలను తన భుజస్కంధములపై వేసికోవాల్సి వస్తుంది. అయినా బోయజు ఈ నష్టాలన్నిటికీ ఒప్పుకొని రూతు అను మోయాబీయురాలిని, అన్యురాలిని, విధవరాలిని, బీదరాలిని, యవసురాలిని, పెండ్లిచేసుకోవడానికి యిష్టపడ్డాడు.

బోయజులో మన ప్రభువైన యేసుక్రీస్తు ఎంత పుష్కలంగా కనబడుతున్నాడో కదా! రూతు సమీప బంధువుడు నేను నష్టపోతానేమో నేను విడిపించలేను అన్నాడు. అలాగే పాపులమైన మనల్ని మనపాపముల నుండి పాప జీవితమైన మరణమునుండి నరకగుండము నుండి లోకంలో మనలను విడిపించువాడు. కీర్త 49:7లో ఎవడును ఏవిధముచేతనైనను తన సహోదరుని విమోచించలేడు అని వ్రాయబడినట్లు ఎవరునూ లేకపోగా 9వ.లో వాని ప్రాణ విమోచన క్రయధనము బహు గొప్పది. అది ఎన్నటికీ తీరక అట్లుండవలసినదే అని వ్రాయబడినట్లుగా ఎవరూ తీర్చలేని గొప్ప క్రయధనమైన తన రక్తాన్ని, తన బలాన్ని, తన ఆరోగ్యాన్ని, ఆయన జీవితాన్ని, ఆయన అందాన్ని, ఆయన పరలోకాన్ని, తండ్రిని, దేవదూతల ఆరాధనని అన్నిటిని నష్టపోవుటకును, చనిపోవుటకును, తిరిగి లేచి మనలను పరమునకు చేర్చుకొనుటకును అన్యులమైన మనలను తన పెండ్లి

భార్యగా చేసికొనుటకును ఇష్టపడిన మన ప్రభువు ప్రేమను ఏమని వర్ణించగలము? ఎంత ప్రేమామయుడో! ఎంత కృపామయుడో! ఎంత దయాపరుడో! ఆ ప్రభువు. బోయజు తన డబ్బుతో రూతు పొలమును కొని విడిపించాడు. ప్రభువు మనల్ని తన రక్తముతో విమోచించి కడిగాడు. (ప్రక 1:6) ఆ సమీప బంధువు నీవే నాకు ప్రతిగా బంధువుని ధర్మము చేయమన్నాడు. ఈ లోకంలో దేవుండ్లమని, దేవతలమని, స్వాములు, భగవానులమని, బాబాలమని, మతోద్ధారకులమని, మత సంస్కర్తలమని, గురువులమని, ఎందరో చెప్పుకున్నారు. అపొస్తలుల కార్యములు 4:12లో వ్రాయబడినట్లు మరి ఎవని వలనను మనకు పాపముల నుండి విడుదల, రక్షణ, మోక్షము కలుగలేదు. యేసుక్రీస్తు నామముననే మనకు రక్షణ కలుగుతుంది. మిగితా వారందరూ "మేము విడిపించలేము" అనేవారే. తమను తామే పాపం చేయకుండా ఉండలేకపోయారు. ఇక యితరులను ఏలాగు రక్షించగలరు? ఒక్క యేసు ప్రభువు మాత్రమే మానవులను పున్నామ నరకము నుండి విడిపించగలరు. ఎందుకంటే రక్తము చిందింపనిదే పాపానికి క్షమాపణ లేదు. మనందరి (లోకస్తులందరి) పాపాలను పరిహరించుటకై యేసు ప్రభువు ఆ సిలువ మ్రానుపై దెబ్బలు గాయాలు కొట్టించుకొని, అన్యాయపు తీర్పుపొందినవాడై రక్తాన్ని కార్చి చనిపోయి, మరణాన్ని జయించి తిరిగి లేచాడు. కనుక ఆయన మాత్రమే పాప పరిహారం చేయగల అధికారం కలవాడు. అట్టి యేసు ప్రభువును నమ్మి మోక్షరాజ్యం చేరాలని చదువరులందరిని ప్రభువు పేరట కోరుచున్నాను.

అలాగున 10వ.లో బోయజు "నా పెండ్లికి మీరే సాక్షులు అని ఆ పురద్వారమునకు వచ్చిన ప్రజలకు, పెద్దలకు, చెప్పాడు. ఆయనది దొంగగా చేసుకున్న పెండ్లి కాదు. ప్రియ యౌవన సోదరీ! నీ పెళ్ళి దొంగగా చేసుకున్న పెళ్ళియా? నీ పెళ్ళికి ప్రభువును, భక్తులను, సంఘపెద్దలను పిలిచావా? కన్న తలిదండ్రులకు కూడా తెలుపక, ఒక యౌవనస్తునితో తాళి మెడలో కట్టించుకొని అన్యదేవతా గుడిచుట్టూ ప్రదక్షిణం చేసుకొని నీ పెళ్ళి అయిపోయిందనుకుంటున్నావా? అట్టి పెళ్ళితో నీకు సుఖముందా? అర్జెంటుగా చేసుకున్న పెండ్లి అర్జెంట్‌గా విడాకులకు దారి తీస్తుంది. నీ జీవితమంతా సమస్యల ఊబి అయిపోతుంది. రూతులాగ ప్రార్థించి దేవుని చిత్తము తెలుసుకో. దేవునికే నీ పెళ్ళి బాధ్యత అప్పగించు. ప్రభువు శ్రేష్టమైన సంబంధమును నీకు చూపిస్తాడు. అలాగే తన రెండవ రాకడలో ప్రభువే తన సంఘాన్ని పెండ్లి చేసుకొనుటకు రాబోతున్నాడు. బోయజు మోయాబీయులలో 10వ తరము వారిని కూడ పెండ్లి చేసుకొనకూడని మోయాబీయురాలైన, బీదరాలైన, విధవరాలైన రూతును పెండ్లి చేసుకోవడానికి యిష్టపడినట్లు ప్రభువు అన్యజనులము ఊరి వెలుపల వుండినవారము, కుక్కలతో సమానమైన మనలను ప్రభువు తన పెండ్లి కుమార్తెగా చేసుకున్నారు. బీదలమైన మన కొరకు దరిద్రులమైన మన కొరకు ఆయన దరిద్రుడయ్యాడు.

రూతు, అత్తను ప్రేమించి త్యాగముతో జన్మభూమిని, తల్లిదండ్రులను విడచి, అత్త దేవున్ని నమ్ముకుని అత్తకు పరిచర్య చేసిందని బోయజుకు తెలుసు. రూతు యోగ్యురాలని, యోగ్యురాలు పెనిమిటికి కిరీటము వంటిదని తెలుసు. రూతు మొదటి సత్ప్రవర్తనకంటే, వెనుకటి సత్ప్రవర్తన మరీ ఎక్కువైనదని తెలిసి బోయజు ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. గానీ అన్యులమైన మనలో ఏముందని తెలిసి మనల్ని తన పెళ్ళి భార్యగా చేసుకున్నాడు? పాపులమని, బలహీనులమని, శత్రువులమని, విరోధులమని తెలిసి తెలిసి పెళ్ళి భార్యగా చేసుకున్న ఆ ప్రభువు ప్రేమ ఏమని పొగడగలము?

**(బి) 4:11-17 పెళ్ళి రోజున దీవించబడిన బోయజు, రూతు వారి సంతానము మరియు నయోమి:-** 11వ. పురద్వారము నొద్ద నుండిన ప్రజలందరూ, పెద్దలు - యెహోవా నీ యింట వచ్చిన ఆ స్త్రీని ఇశ్రాయేలీయుల వంశమును వర్ధిల్లచేసిన రాహేలును పోలినదానిగాను, లేయాను పోలిన దానిగాను చేయును గాక అని మొట్టమొదట రూతును దీవించారు. మొదటిగా నీ యింటికి వచ్చిన స్త్రీ అన్నారు. 1 అధ్యాయంలో మొదట బేత్లెహేముకు వచ్చిన స్త్రీగా 2వ అధ్యాయంలో బోయజు పొలమునకు వచ్చిన స్త్రీగా, 3వ అధ్యాయంలో బోయజు కళ్ళమునకు వచ్చిన స్త్రీగా, 4వ అధ్యాయంలో బోయజు యింటికి వచ్చిన స్త్రీగా చూస్తున్నాము. బోయజు ఇంటికి వచ్చిన రూతు - రాహేలు, లేయాలాగ ఇశ్రాయేలు వంశాన్ని వర్ధిల్లచేస్తుందని దీవించారు. రాహేలు, లేయాలు ఇద్దరూ అక్కాచెల్లెళ్ళు అయినప్పటికీ పోటీపడి పిల్లలను కనడమే కాక, తమ దాసీలతో కూడ పిల్లలను కనేటట్లు చేసి ఇశ్రాయేలీయులను 12 గోత్రాలుగా వర్ధిల్లచేశారు. ఇలా వంశాభివృద్ధి చేసే పనిలో రాహేలు యాకోబును తానే తనయింటిలోనే కట్టేసుకున్నట్లు చేసి తన అక్క ఇంటికి ఒక రాత్రికి భర్తను పంపడానికి పుత్రదాతవృక్షపు పండ్లను కోరింది. అలాగే లేయా ఒక రాత్రి తన భర్తయైన యాకోబును తన యింటికి వచ్చేందుకు పుత్రదాత వృక్ష ఫలములతో భర్తను కొనుక్కోవాల్సి వచ్చింది. ఎందుకంటే భర్త కొరకు సంతానము కనాలనే ఆశ వారిలో ఎంత ఎక్కువగా వుందో మనకు తెలుస్తున్నది. కానీ ఈ పోరాటంలో గెలిచింది లేయాయే. రాహేలు యింటిలోనే యాకోబు ఎక్కువ కాలముండేవాడు. లేయా మాత్రము ద్వేషించబడినదైనప్పటికీ, తన భర్త తన యింటికొచ్చే అవకాశాలు అరుదైనప్పటికీ, ప్రతి అవకాశాన్ని ఆమె సద్వినియోగం చేసుకొని యాకోబుకు 6గురు మగపిల్లల్ని, ఒక కుమార్తెను మొత్తం ఏడుగురు పిల్లల్ని అందించింది. రాహేలు గొడ్రాలైనప్పటికీ దేవునికి మొఱ్ఱపెట్టి ఇద్దరు మగ పిల్లల్ని కనింది. చివరికి బెన్యామీనుకు జన్మనిస్తుండగానే ప్రాణం పోగొట్టుకుంది. ఇలా ఆ ఇద్దరు స్త్రీలు ఇశ్రాయేలు వంశమును వర్ధిల్లచేశారు. ప్రియసోదరీ! యేసు ప్రభువు పెండ్లి భార్యగా వున్న నీవు ఆయనను నమ్మి రక్షించబడి ఎంతకాలమైంది? లేయా ద్వేషించిన నా భర్తకు 6గురిని కన్నాను అని చెబుతుంటే ప్రేమించుచున్న నీ పరలోకపు భర్తకు నీవు ఎంతమందిని కని, ఏర్పరచబడిన వంశాన్ని ఉద్ధరిస్తున్నావు? ప్రభువు ఆత్మల విషయమై

దాహముగొని వుండగా నీవు పరలోకానికి, వెళ్ళక వెళ్ళక ఒక్కసారిగా వెళ్లబోతుండగా వట్టి చేతులలో తండ్రి యింటికి వెళ్తున్నావా? పేతురు ఒక ప్రసంగంలో 3,000 మందిని రెండవ ప్రసంగంలో 5000 మందిని, జీవితమంతటిలో ఇక ఎన్నివేల మందిని ప్రభువువైపు త్రిప్పాడో, అలాగే భక్తుల వెంట మిషనరీలవెంట ఎన్ని ఆత్మలు రేపు వెళ్తాయో, తల్లి కొంగుచుట్టూ పిల్లలు వెళ్ళినట్లు నీ వెంట కొన్ని ఆత్మలైన వస్తాయా? కొన్ని ఆత్మలకైనా జన్మనిచ్చావా? నీ ద్వారా ఏర్పరచబడిన వంశము అభివృద్ధి కొరకు ఇకనుండియైనా ప్రయత్నిస్తావా?

ఆ పురద్వారమున ఉన్న ప్రజలు, పెద్దలు రెండవదిగా బోయజును 12వ. వచనంలో దీవిస్తున్నారు. "ఎఫ్రాతాలో నీవు క్షేమాభివృద్ధి గలవాడవై, బేత్లెహేములో నీవు ఖ్యాతి నొందుదువు గాక!" అని దీవిస్తున్నారు. 2వ అధ్యాయం 4వ. వచనంలో బోయజు తన పొలములో తన పనివారి ద్వారా "యెహోవా నిన్ను ఆశీర్వదించును గాక!" అని దీవించబడ్డాడు. ఇప్పుడు పురద్వారము నొద్ద కూడ ప్రజలందరిచేత, పెద్దలచేత దీవించబడుచున్నాడు. ముందుగానే బోయజును దేవుడు దీవెనకరముగా చేశాడు. ఇప్పుడు, తన పొలములోని పనివారలచేత, ప్రజలందరిచేత పెద్దలచేత, 2 అధ్యాయము 20వచనంలో "బ్రతికియున్న వారికిని, చచ్చినవారికిని ఉపకారము చేయుట మానని ఇతడు యెహోవాచేత దీవించబడును గాక!" అని బేత్లెహేము ఊరిలో వుంటున్న నయోమి చేతను బోయజు దీవించబడ్డాడు. ఎంత ఆశీర్వాదపరుడో కదా! మన బోయజు! అనగా బేత్లెహేము పొలములోను, బేత్లెహేము ఊరిలోను, బేత్లెహేము ఊరి బయట పురద్వారములోను దీవెనల వర్షము బోయజు మీద కురిసింది. ఎఫ్రాతాలో బోయజుకు క్షేమాభివృద్ధి అట.

బేత్లెహేములో 'ఖ్యాతి' అట. 'ఎఫ్రాతా' అనగా రెండంతల ఫలమని అర్థము. ఎఫ్రాయీము, గోత్రములో క్షేమాభివృద్ధి అట. 'బేత్లెహేము' ఆ గోత్రములో ఒక కుగ్రామము, స్వల్ప గ్రామము. అంటే బోయజు తన గోత్రమంతటిలో క్షేమాభివృద్ధిని ఖ్యాతిని దీవెనకరంగా పొందుకున్నాడు. అంతేకాక "ఈ యవనురాలి వలన నీకు దయచేయు సంతానమును నీ కుటుంబమును తామారు యూదాకు కనిన పెరెసు కుటుంబము వలె ఉండును గాక! అని పురప్రజలు, పెద్దలు, బోయజు సంతానాన్ని, మూడవదిగా దీవించారు. ప్రియ తలిదండ్రులారా! దీవెనలు మనకే కాదు, మన పిల్లలకు కూడా రావాలి. అబ్రాహాముకు పాలు తేనెలు ప్రవహించే దేశమిస్తానని చెప్పిన యెహోవా దేవుడు, ఆ దేశాన్ని నీ తరువాత నీ సంతానమునకు కూడ ఇస్తానన్నాడు. (ఆది 12:7). ఇది శరీర సంబంధమైన దీవెన కానీ అపో కార్యములు 2:38-39 వచనాలలో ఇశ్రాయేలు వంశమంతటికీ, వారి పిల్లలకు, అన్యజనులమైన మనకందరికి, దేవుని రక్షణ పొందిన వారందరికి పరిశుద్ధాత్మ అనే వరమును దీవెనగా ఇస్తాడని వ్రాయబడినది. అవును, మనం దేవుని ద్వారా పొందిన శారీరక, ఆత్మీయ

దీవెనలను మనం మాత్రమే కాకుండా మన సంతానము కూడ పొందాలని, మాత్రమే కాక, అబ్రాహాము వలె మనము ఇతరులకు (ఆది 12:3) కూడా ఆశీర్వాదకరంగా వుండాలని మనల్ని ఆయన ఆశీర్వదిస్తున్నాడు.

ఇక్కడ ఆ పురద్వారమున ప్రజలు, పెద్దలు, రూతు బోయజుల సంతానము పెరెసు కుటుంబంలాగా వుండాలని ఆశీర్వదించారు. పెరెసులో వున్న ప్రత్యేకత ఏమిటని మనము ఆలోచిస్తే, తామారు గర్భములో కవలలుండగా ఆమె ప్రసవించుచుండగా ఒకడు తన చెయ్యి బయటికి చాచివుండగా మంత్రసాని ఎఱ్ఱనూలు తీసి వాని చేతికి కట్టి ఇతడు మొదట బయటికి వచ్చాడని చెప్పింది. ఈ బిడ్డ మొదట బయటికి వచ్చినట్లే వచ్చి మళ్ళీ చెయ్యి లోపలికి తీసుకున్నాడు. మొదటివాడు కడపటివాడయ్యాడు. మొదటి హుషారు తగ్గి వెనక్కి వెళ్ళిపోయాడు. మొదటి స్పీడు తగ్గింది. ఆదిలో శూరత్వం, వీరత్వం, రాను రాను తగ్గిపోయి వెనకెళ్ళిపోయాడు. అతని పేరే 'జెరహు'. తాను వెనెక్కెళ్ళినప్పుడు వెనుకటివాడు ముందుకు భేదించుకొని ముందుకు రావడం జరిగింది. తాను పెరెసు. అనగా అరుణోదయము లేక చిగురు అని అర్థము. పగటివేళ అన్నిటికంటే ముందుగా మనకు కనబడేది అరుణుడే. కానీ ఆ అరుణోదయంలాగే జీవితంలో ముందుగా వుండవలసిన జెరహు వెనుకటి వాడైపోయాడు. ఎఱ్ఱని దారము చేతి వ్రేలికి కట్టబడినందువలన యేసురక్తములో కడుగబడినవాడుగా సాక్ష్యము కలిగి యుండినప్పటికీ, అరుణుడు (సూర్యుడు) చీకటిని భేదించుకొని వచ్చునట్లు జెరహు అరుణోదయము వలె ముందే బయటికి వచ్చినప్పటికీ వెనకబడి బహుమానము పొందురీతిగా పరుగెత్తలేకపోయిన వానికి సాదృశ్యంగా వున్నాడు. మొదట బాగా స్పీడు పెంచినవాడు ఆ తరువాత ఆత్మీయ జీవితంలో వెనక్కి తగ్గిపోయి రెండవ స్థానానికి వచ్చినట్లు వుంది జెరహు పరిస్థితి. పౌలు గలతీయులతో 5:7వ.లో మీరు బాగుగా పరుగెత్తుచుంటిరి. సత్యమునకు విధేయులు కాకుండా మిమ్మును ఎవడు అడ్డగించెను అంటున్నాడు. మొదటి స్థానము పోగొట్టుకున్నాడు. జ్యేష్ఠత్వమును, దాని వలన వచ్చే ఆశీర్వాదాలన్నింటిని పోగొట్టుకున్నాడు 'జెరహు'. ప్రియ సోదరీ! నీవెలా వున్నావు? ఆరంభంలో శూరత్వాన్ని చూపించి ఇప్పుడు వెనుకటి స్థానంలోకి వెళ్ళిపోయావా? నీవు వెనుకబడితే ఇంకొకరు ఆ అవకాశం దక్కించుకుంటారు. నీవు ఆ అవకాశాన్ని కోల్పోయిన దానవవుతావు. నీవు బహుమానాన్ని పోగొట్టుకుంటావు. నీ కిరీటాన్ని ఎవరునూ అపహరింపకుండా చూచుకో. కాబట్టి నీ విశ్వాస, ఆత్మీయ, సేవా జీవితంలో, ప్రార్థనలో, యిచ్చుటలో, వచ్చుటలో, మెళకువలో, మాదిరిలో, సేవలో వెనక్కు తగ్గగానే అవకాశాన్ని జారవిడచుకోకుండ 'పెరసు' భేదించుకొని మొదటగా బయటికి వచ్చాడు. 'పెరెసు' అనగా వేరుపరచబడుట అని అర్థము. 3000 మంది రక్షించబడి బాప్తీస్మము తీసుకున్నవారిని పౌలు మీరు వారిలో నుండి (నమ్మనివారిలో నుండి లేక అన్యులలోనుండి) బయలు వెడలి ప్రత్యేకంగా వుండుడని చెప్పాడు. అనగా పెరసులో వేరైన జీవితం. ప్రత్యేక జీవితం (sepa-

rated life) పవిత్ర జీవితం కనిపిస్తుందని భావము. కడపటి వాడుగా 'జెరహు' వెనక్కు తప్పుకోగా ప్రత్యేక జీవితాన్ని సూచించేవాడుగా 'పెరసు' బయటికి వచ్చాడు. జ్యేష్టుడుగా దీవెనల నందుకున్నాడు. ఇస్సాకుకు పుట్టిన ఏశావు జ్యేష్ఠుడేకానీ, జ్యేష్ఠత్వాన్ని తృణీకరించాడు. యాకోబు రెండవవాడుగా ఇస్సాకుకు పుట్టినా జ్యేష్ఠత్వ దీవెనలు కావాలనుకున్నాడు. అదను చూచి అన్న నుండి పొందుకున్నాడు. యాకోబుకు దీవెనయందు ప్రీతి అనగా ఇష్టము వున్నది. అలాగున జెరహు కంటే ముందుగా భేధించుకొని వచ్చిన పెరెసు జ్యేష్ఠత్వపు దీవెన పొందుకున్న తన తాతగారైన యాకోబును పోలినవాడుగా చూస్తున్నాం. జెరహు అయితే ముందుకు వచ్చినట్లే వచ్చి వెనక్కి తగ్గి 'పెరసుకు' అవకాశము దొరికేటట్లు జారవిడుచుకున్నట్లు చూస్తున్నాం. హెబ్రీ. 10:38వ.లో "నీతిమంతుడు విశ్వాసమూలమున జీవించును. కానీ, అతడు వెనకతీసిన యెడల అతనియందు నా ఆత్మకు సంతోషముండదు" అని వ్రాయబడినట్లు 'జెరహు' వెనకబడిన కారణమునుబట్టి దేవునికి సంతోషము కలిగించలేక పోయాడు. ప్రియసోదరీ! నీవు కూడ ఈ రోజు జెరహువలె ఒకప్పుడు అన్నింటిలో ముందుగా వుండి ఇప్పుడు అన్ని విషయాల్లో వెనుకబడ్డావా? వేకువజామున ప్రార్థన కొరకు అందరికంటే ముందులేస్తున్నావా? ప్రభువుకిచ్చే విషయంలో ముందుగా వున్నావా? సేవకెళ్ళే విషయంలో ముందుగా వస్తున్నావా? సమర్పణలో ముందున్నావా? రానురాను "రాజు గుఱ్ఱము గాడిద అయ్యింది" అన్నట్లు ఆత్మీయ విషయాల్లో వెనుకగా వున్నావా? మొట్టుకు పెరెసు మొదటివాడుగా జ్యేష్టుడుగా విశ్వాసములో ముందున్నవాడుగా, ప్రత్యేకంగాను, వేరైన జీవితం, జీవించుచున్నవాడుగాను, దీవెనకరమైనవాడుగా, భేదించుకొని మొదట బయటికి వచ్చిన శక్తిగల బలవంతుని చేతిలోని బాణమువంటి వాడుగా వుంటాడని ఊరి పెద్దలతో, ప్రజలతో దీవించబడ్డాడు. మనము మన సంతానము కూడా పెరెసులాగ దీవించబడుదుము గాక! పెరెసు అంతమాత్రమేకాక పాపులలో చేరక ప్రత్యేకముగా వున్న మన ప్రభువైన యేసుక్రీస్తుకు పోలికగా వున్నాడు. 'జెరహు'ను భేదించుకొని ముందుకు వచ్చాడంటే తన బలమునుబట్టి బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రికి పోలికగా కూడా వున్నాడు. కనుక ఫెరెసు ఇన్ని రీతులుగా దీవెనకరమైనవాడుగా ఉన్నాడు.

13వ.లో బోయజు రూతును పెండ్లి చేసికొని ఆమె యొద్దకు పోయినప్పుడు యెహోవా ఆమె గర్భవతియగునట్లు అనుగ్రహించెను అని చదువుచున్నాము. ఇక్కడ పెండ్లియైన తరువాతనే బోయజు ఆమెను కూడినట్లు ఆమె గర్భవతియైనట్లు చూస్తున్నాము. వాక్యక్రమమిదే. కానీ ఈవేళ అనేకమంది యవనస్థులు, యవనరాండ్రు వివాహము కాక మునుపే premarital sex లో పాల్గొంటూ, ఆడపిల్లలు గర్భవతులవుతూ "గర్భ స్రావము (Abortion) చేయించుకుంటూ, పిండముగా వుండగానే తమ అక్రమ సంతానాన్ని బలవంతముగా చంపేసుకుంటున్నారు. ఇక్కడ రూతును దేవుడే గర్భవతి అగునట్లుగా

అనుగ్రహించెను అని వ్రాయబడినది. ప్రియ యవ్వన బిడ్డా! యింతకుమునుపు నీవు కలిగి యుండిన గర్భములు యెహోవా వలన నీకు అనుగ్రహించబడిన గర్భములా? లేక నీకు నీవే తెచ్చుకొనిన గర్భములా? యెహోవాచేత ఇవ్వబడిన గర్భాలు, ఆ సంతానం పెరెసువలె దీవించబడినవై పరిశుద్ధ సంతానమై వుంటారు. నీవేమో అక్రమ సంబంధాలవల్ల అక్రమ సంతానాన్ని గర్భములో పొంది, పైగా ఎంతోమంది పిల్లలను పిండదశలోనే చంపుట నీకు న్యాయమా? లేక దొంగచాటుగా ఆ పిల్లలను కని చెత్తబుట్టలో పడవేసి ఏమి ఎరుగనట్లు నటిస్తున్నావా? ప్రభువుకు ఏమి లెక్క చెబుతావు? రూతుకు బోయజుద్వారా దేవుడే గర్భవతి అగునట్లు అనుగ్రహించాడు. భార్యనిచ్చేవాడు ఆయనే. ఆ భార్యలు గర్భవతులగునట్లు అనుగ్రహించువాడును ఆయనే. సుబుద్ధి గల భార్య యెహోవా యిచ్చు దానము. (సామె 19:14). కుమారులు యెహోవా అనుగ్రహించు స్వాస్థ్యము. గర్భఫలము ఆయన యిచ్చు బహుమానము (కీర్త 127:3). ఈలాగున యెహోవా దేవుడు శ్రేష్టమైన ప్రతిఈవియు, సంపూర్ణమైన ప్రతి వరమును అనుగ్రహించేవాడుగా వున్నాడు. (యాకోబు 1:17). ఆయన ఎప్పుడు శ్రేష్టమైనవే ఇస్తాడు. నీకు నీవు చేసుకున్నవి పనికిమాలినవిగా ఉంటాయి. కనుక నీవు ప్రభువును అడిగితే శ్రేష్ఠ ఈవులను పొందుకోగలవు.

ఇట్లు రూతు బోయజు ద్వారా గర్భవతియై కుమారుని కనగా ఆ పురములోని స్త్రీలు నయోమిని ఈలాగున దీవిస్తున్నారు. ఈ దినమున నీకు బంధువుడు లేకుండ చేయని యెహోవా స్తుతినొందును గాక! ఆయన నామము ఇశ్రాయేలీయులలో ప్రకటింపబడును గాక! అని నాలుగవసారిగా దీవించారు. బోయజు రూతును వివాహము చేసికొనగా నయోమికి దేవుడు బోయజు అనే సమీప బంధువుడు దొరికాడు. ఇలా సమీప బంధువుడు లేకుండ చేయని యెహోవా స్తుతినొందాడు. అవును, నయోమి విధవరాలై, ఒంటరిగా, బీదరాలుగా, చేదైన 'మారా' జీవితాన్ని కలిగి, సంతోషము లేనిదిగా, బంధువులేనిదిగా వున్న సమయంలో చాలా దుఃఖముతో వున్న సమయంలో యెహోవా ఆమెకు సమీప బంధువునిగా బోయజునిచ్చాడు. గనుక యెహోవా దేవుడు స్తుతించబడ్డాడు. ప్రియ సోదరీ! నీ జీవితం కూడ నయోమిలాగానే వుందా? ఒంటరిగా, విడువబడినదానవై, ఎవరి ప్రేమకు నోచుకొనక అంతా పోగొట్టుకొనబడినదానవై చేదైన జీవితంలో ఎవరి ఆదరణ, తోడు, లేనిదానివైయున్నావా? పరమబోయజు నీకు తోడు, ఆనందము, ఆదరణ సమీప బంధువు, రక్షకుడు, ప్రభువు, విమోచకుడు అయ్యాడు. అనేక మేళ్ళు చేసిన యెహోవా దేవుడు నీవలన స్తుతించబడుచున్నాడా? ఆ మేళ్ళను గురించి నీవు ఇతరులకు సాక్ష్యమిచ్చుటవలన, లేక ఆ మేళ్ళను యితరులు నీలో చూచుట ద్వారా ఆ ప్రభువు స్తుతించబడుచున్నాడా? అలా స్తుతించబడుట మాత్రమే కాక ఆయన నామము నీ జనులలో, నీ ప్రాంతంలో నీ జీవిత దినాలలో ప్రకటించబడుచున్నదా? దేవుడు మనకు చేసిన మేళ్ళనుబట్టి అనేకసార్లు మనము మన ఇళ్ళలో స్తుతి కూడికలు పెట్టి అనేక మందిని మన యింటికి ఆహ్వానించి

వారికి ప్రభువు యొక్క రక్షణ మోక్ష మార్గములను గురించి ప్రకటింపచేసి ప్రభువును మహిమపరచవలసిన వారమై యున్నాము. అనేకసార్లు మనము ప్రభువు నుండి అనేక మేలులు, సహాయాలు పొందినప్పటికీ, ఆయనను స్తుతించక, ప్రకటించకపోవుట వలన మనము ఎంత కృతజ్ఞతలేనివారముగా, ఋణస్థులుగా వుంటున్నామో ఆలోచించి మనల్ని దిద్దుకోవాలి. ఈ రీతిగా బోయజు రూతును వివాహము చేసికున్న రోజును ఆ పుర పెద్దలు, ప్రజలు ఆ కుటుంబమంతటికి మరియు దేవునికి గాక! గాక! గాక! గాక! గాక! అని 5సార్లు దీవెన వచనములు పలికారు. గనుక ఈ 4వ అధ్యాయానికి 'గాక!ల' అధ్యాయము అని పేరు పెట్టవచ్చు. లేక దీవెనల అధ్యాయమని పేరు పెట్టవచ్చు. అలాగే కీర్త 109 అధ్యాయములో కూడ 18సార్లు 'గాక!' అనే పదము వచ్చింది. కీర్త 109 అధ్యాయము శాపము కొరకైన అధ్యాయము. ప్రియ సోదరీ! నీ జీవితములో దీవెనల కొరకైన గాక! అనే వచనాలు చెప్పబడుతున్నాయా? లేక శాపము కొరకైన గాక! అనే వచనాలు నీ విషయమై చెప్పబడుతున్నాయా? కీర్త 109లో శాపము వచనాలు ఎందుకు పలుకబడ్డాయి? అంటే 17వ.లో దీవెనయందు వానికిష్టము లేదు. గనుక అది వానికి దూరమాయెను అని చదువుచున్నాము. ప్రియసోదరీ! నీకు దీవెనయందు యిష్టమా? శాపమునందు యిష్టమా? ప్రభువైన యేసుక్రీస్తు దీవించడానికే యిష్టపడుచున్నాడు. ఆయన యిచ్చే మొట్టమొదటి దీవెన, లేక ఆశీర్వాదము అపొ. 3:26వ.లో వ్రాయబడినది. "దేవుడు తన సేవకుని పుట్టించి, మీలో ప్రతివానిని వాని దుష్టత్వము నుండి మళ్లించుట వలన <u>మిమ్మునాశీర్వదించుటకు</u> ఆయనను మొదట మీ యొద్దకు పంపెను" మనలో ప్రతి వానిని తన దుష్టత్వము నుండి అనగా పాపములనుండి మళ్ళించి పరిశుద్ధతలోనికి, మోక్షమార్గములోనికి మళ్ళించుటయే, మొట్టమొదటి ఆశీర్వాదము. అమ్మా! నీ పాపాలకు ఫలితంగా నీవు పోయే నరకాగ్నిలో ఏడ్పు, పండ్లుకొరుకుటయు, భయంకరంగా నీవు కేకలు వేయుటయు, దేవుని దూషించుటయు, యుగయుగముల బాధ, వేదన, ఆకలి, దాహము ఇటువంటి బాధలకు అంతమే వుండక యుగయుగములు నిత్యము ఖాళీ లేకుండా కాలవలసి వుంటుంది. ఇట్టి బహు భయంకరమైన నరక కూపములో నుండి నిన్ను విడిపించి, తప్పించి, తన రక్తముతో నిన్ను కడిగి పవిత్రపరచి, నిత్య పరలోకరాజ్యములో చేర్చాలని ప్రభువు యిష్టపడుతున్నాడు. మరి ఇట్టి దీవెనయందు నీకిష్టమున్నదా? ఇష్టపడితే నీ హృదయపూర్తిగా ప్రభువుతో ఈ ప్రార్థన చెయ్యి.

"ప్రభువా నేను అనేక విధాలుగా మనో, వాక్కాయ, ఖర్మల ద్వారా పాపిని. శాపగ్రస్తురాలను. దుష్టత్వము కలిగినదాన్ని. నా పాపాల శద్ధీకరణము కోసము సిలువలో నీవు కార్చిన పవిత్ర రక్తధారలతో నా పాపమంతటినీ కడిగి పవిత్రపరచి నన్ను నా దుష్టత్వము నుండి మంచి మార్గమునకు నడిపించుము. నేను చనిపోయినప్పుడు నన్ను నీ పరలోక

రాజ్యములో (మోక్షములో) చేర్చుకొనుము. యేసుక్రీస్తు నామమున నిన్ను ప్రార్థించుచున్నాను తండ్రీ!". ఆమేన్. (ఆమేన్ అనగా తథాస్తు లేక అట్లు అవును గాక! అని అర్థము) అని హృదయ పూర్వకంగా ప్రార్థించు.

ఎవరైతే ఈ ప్రార్థన హృదయపూర్వకముగా చేస్తారో వారి లోనికి ప్రభువు ఆత్మపూర్ణుడుగా వచ్చి తన రక్తములో వారి పాపములను కడిగి పవిత్రపరచి తన "రక్షణ" అనే దీవెన మీకు అనుగ్రహిస్తాడు. ఎవరైతే పై సంగతులు అర్థమయినప్పటికీ ఈ ప్రార్థన యేసు ప్రభువుతో చెప్పకపోయిన యెడల వారికి దీవెనయందు ఇష్టము లేక శాపమునే తెచ్చుకుంటారు. నరకంలో వారి బాధ యుగయుగములు యింత అంత అని చెప్పడానికి వీలుండదు. కనుక ఈ సమయములో దీవెన లేక శాపం, మరణము లేక జీవము, వెలుగు లేక చీకటి, నరకము లేక పరలోకము, యేసు ప్రభువు లేక సైతాను, నీ యెదుట వుండగా నీవు దేవుని, లేక ఎవరిని కోరుకుంటావో నీ యిష్టం. నీ యిష్టానికే ప్రభువు నిన్ను వదిలివేస్తున్నాడు. నీవు దీవెన, జీవము, వెలుగు, పరలోకము, ప్రభువును పొందుకొనునట్లు ప్రభువుకు నీ హృదయములో చోటివ్వు. ప్రభువు నిన్ను దీవించును గాక.

15వ. వచనంలో మహ్లోను, కిల్యోను లాంటి 7గురు కుమారులకంటే నయోమికి తన కోడలైన 'రూతు' తన కుమారుల కంటే ఎక్కువట. ఈ మాట ఆ వూరి స్త్రీలు నయోమితో చెబుతున్నారట. అబ్బా! ఎంత మంచి సాక్ష్యము రూతు పొందుకుంది కదా! అమ్మా! కోడలైన నిన్ను గూర్చి నీ యిరుగు పొరుగు స్త్రీలు నీ అత్తతో ఏమని సాక్ష్యము చెబుతున్నారు? సాధారణముగా, ఏ అత్తకైనా తన కోడలి కంటే కొడుకే ముఖ్యమై వుంటాడు కానీ, నయోమికి మాత్రం కోడలే ముఖ్యం. రూతును త్రాసులోని ఒక పళ్లెములో వుంచితే, మరో పళ్ళెములో కిల్యోను, మహ్లోనులాంటి 7గురు కుమారులను వుంచితే రూతు ఒక్కతే బరువుగా తూగుతుందట. అనగా 7గురు కుమారులకంటే కోడలైన రూతు విలువైనది, ఉత్తమమైనదని అర్థమవుతుంది. ప్రాముఖ్యంగా ఈ అంశము మీద 1వ. అధ్యాయంలో వివరంగా వ్రాయబడింది. ప్రభువు కృపనుబట్టి ఈ దినాలలో కుమారులకంటే కోడళ్ళే అత్తలను ఎక్కువగా మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్న వారు కొందరు ఉన్నారు. అలాంటివారు చాలా తక్కువ సంఖ్యలో వున్నారు. అట్టివారిలో కొద్దిమందిని నేనెరుగగల కృపను 'దేవుని ఆశ్రయించిన' 'పరిశుద్ధ స్త్రీలలో' అత్యల్పురాలనైన నాకు ప్రభువిచ్చారు. అందులకై ప్రభువుకు లెక్కలేనన్ని స్తోత్రములు చెల్లిస్తున్నాను. అట్టి విలువైన, ప్రియమైన కోడళ్లను ప్రభువు రూతువలె దీవించును.

15వ.లో రూతు కనిన కుమారుడు "నీ ప్రాణమును ఓదార్చి ముసలితనమున నీకు పోషకుడని" పురపెద్దలు, ప్రజలు నయోమితో చెప్పారు. రూతు కనిన కుమారుని పేరు 'ఓబేదు' అని మనకు తెలుసు. ఇంతవరకు ముసలిది, ఒంటరిది, అనాధ, సర్వశక్తునిచేత బాధనొందిన నయోమి ప్రాణమును రూతు ఓదార్చి పొలంలో పరిగె ఏరుకొని పోషించింది.

ఇప్పుడు మనుమడైన ఓబేదు తన అవ్వ ప్రాణాన్ని ఓదార్చి ఆమెకు పోషకుడుగా వుంటాడట. అవును, 1 తిమో 5:4లో "అయితే ఏ విధవారాలికైనను పిల్లలుగాని, మనుమలు గాని యుండిన యెడల వీరు మొదట తన యింటివారి యెడల భక్తి కనబరుచుటకును, తమ తల్లిదండ్రులకు ప్రత్యుపకారము చేయుటకును నేర్చుకొనవలెను. ఇది దేవుని దృష్టికి అనుకూలమై యున్నది" అని వ్రాయబడిన ప్రకారము మనుమడైన ఓబేదు నయోమి ప్రాణమును ఓదార్చేవాడుగాను, పోషకుడుగాను వుంటాడని బేత్లెహేము పుర స్త్రీలు అంటున్నారు. మరి, ఈనాటి మనుమండ్లు అలాంటివారిగా వున్నారా? తమ యింటివారి మీద ముసలివారిమీద భక్తి కలిగివున్నారా? చాలాసార్లు ముసలివారిని యింట్లో మాట్లాడనివ్వరు పిల్లలు వారి నోళ్ళు మూయిస్తారు. ఏమైనా బుద్ధి మాటలు పెద్దవారు చెబితే, వెళ్ళి పడుకో, వెళ్ళు, అని వారితో నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. వారిని మాట్లాడనివ్వరు కానీ ఓబేదు నయోమి ప్రాణాన్ని ఓదార్చేవాడట మరియు ముసలితనమందు ఆమెను పోషించువాడట. ఇంట్లో ముగ్గురి ప్రాణాలను కోల్పోయిన నయోమికి ఓదార్పు అవసరం. అందరూ లేని లోటు నేను తీర్చుతాను నానమ్మా! ఎలీమెలెకు తాతయ్య, మహ్లోను నాన్న, కిల్యోను చిన్నాన్న లేని లోటు నేను తీర్చుతాను. ఏడ్వవద్దు. నీకేమి తక్కువ కాకుండ నేను చూచుకుంటాను. నీ పోషణ భారమంతా నాదే. పరిచర్య భారమంతా నాదే ఇంతవరకు అమ్మ పోషించింది. ఇప్పటి నుండి నేనే నిన్ను పోషిస్తాను అని చెప్పి నానమ్మను ఓదార్చేవాడుగా వుంటాడని ఆ స్త్రీలు నయోమితో చెప్పారు. అలాగే అబీషగు ముసలితనమందున్న దావీదును 1 రాజు 1:4,16వ. ప్రకారము. దావీదు రాజును ఆదరించి ఉపచారము చేయుచు గదిలో వుండి రాజును కనిపెట్టుచూ వుండింది. ఈనాటి మనుమండ్రు కూడ తమ నానమ్మలను అమ్మమ్మలను అలాగే ఓదార్చి, ఆదరించి పోషించువారుగా వుండాలని హెచ్చరించబడుచున్నారు.

16వ. వచనంలో నయోమి ఓబేదును కౌగిటిలో వుంచుకొని అతనికి దాదిగా వుండెనని చదువుచున్నాము. అవును, అమ్మమ్మలు నానమ్మలు తమ మనుమండ్రకు, మనుమరాండ్రకు దాదులుగా వుండాలి. బైబిల్లో మొట్టమొదట దాదిగా నటించిన తల్లి యాకెబెతు. కొన్ని పరిస్థితులనుబట్టి యాకెబెతు తల్లిగా మరియు దాదిగా కూడా నటించింది. మిర్యాము ఈ పిల్లవానికి పాలిచ్చుటకు దాదిని పిలుచుకొనివత్తునా? అని ఫరో కుమార్తెతో చెప్పి తన తల్లినే దాదిపనికి తీసికొని వచ్చింది. తల్లిగా దాదిగా ఆమె పాలిచ్చి దైవబోధతో పెంచింది. ఇశ్రాయేలీయులను భవిష్యత్తులో ఐగుప్తు నుండి విడిపించాలని బోధించింది. మగపిల్లలను చంపాలని ఫరోరాజు ఆజ్ఞాపించినప్పుడు విశ్వాసముతో మోషేకు ఒక జమ్ముపెట్టె తయారు చేసి మరణమునుండి మోషేను కాపాడింది. తిమోతి తల్లివలె, తిమోతి అవ్వవలె అమ్మమ్మలు, నానమ్మలు మనుమండ్రకు, మనుమరాండ్రకు వాక్యమనే పాలు

త్రాగించాలి. బైబిలు విషయాలు కథల రూపంలో, పాటల రూపంలో, వారికి నేర్పించాలి దేవుని ఆజ్ఞలు, కంఠస్తము చేయించాలి. ప్రార్థించడం, ప్రతి దానికి దేవున్ని అడగడం నేర్పించాలి. దేవునియందు విశ్వాసముంచడం నేర్పించాలి. సండేస్కూలుకు పంపడం అలవాటు చేయించాలి. బాలుడు నడువవలసిన రీతిని వానికి బోధించుము. పెద్దవాడైనప్పుడు వాడు దానిలోనుండి తొలగిపోడు అని దేవుని వాక్యము సామె. 22:6లో చెబుతుంది.

ఆసాపు భక్తుడు కీర్త 78:3లో తమ పితరులు యెహోవా స్తోత్రార్హక్రియలను, ఆయన బలమును, ఆయన ఆశ్చర్య కార్యములను దాచకుండ వారి పిల్లలకు చెప్పారట. ఆ పిల్లలు లేచి రాగల తరములలో పుట్టబోవు పిల్లలకు చెప్పారట. ఆ పిల్లలు మరలా తమ పిల్లలకు వాటిని వివరిస్తారట. అలాగున ఒక్కో తరము వారు, రాబోయే తరాలకు చెప్పాలని దేవుడు చెబుతున్నారు. ద్వితీ 6:6లో నేను నీకు ఆజ్ఞాపించు ఈ ఆజ్ఞలు నీ హృదయములో వుంచుకోవాలి. నీ కుమారులకు వాటిని అభ్యసింపచేసి నీ యింట కూర్చుండునప్పుడును, త్రోవను నడుచునప్పుడును పండుకొనునప్పుడును, లేచునప్పుడును, వాటిని గూర్చి మాటలాడవలెనని దేవుని వాక్యము చెప్పినట్లు తల్లిదండ్రులమును, అమ్మమ్మ తాతయ్యలమైన మనమును మన పిల్లలతో ఆ ఆజ్ఞలను గూర్చి ప్రతిదినం వారితో మాట్లాడాలి. న్యాయా 6:13లో పితరులు దేవుని అద్భుత కార్యాలను తమ పిల్లలకు వివరించి చెప్పారట. కనుక మన మనుమండ్రకు, మనుమరాండ్రకు దేవుని వాక్యాన్ని అవ్వ తాతలమైన మనమే నేర్పించాల్సిన దాదులుగా వుండాలని వాక్యము చెబుతుంది. 17వ.లో ఆమె పొరుగు స్త్రీలు "నయోమికి కుమారుడు పుట్టెనని చెప్పి" అతనికి ఓబేదు అను పేరు పెట్టారు. అతడు దావీదునకు తండ్రియైన యెష్షయి యొక్క తండ్రి అని వ్రాయబడింది. ఆ దావీదు కుమారుడుగా పుట్టిన వాడే జగద్రక్షుడైన మన యేసు ప్రభువు, రూతు జీవిత విశేషాలు రూతు గ్రంథములోని 4 అధ్యాయాల వరకే పరిమితం చేయుటకు మన ప్రభువుకు యిష్టము లేదు. క్రొత్త నిబంధన లోని మత్తయి సువార్త 1:5వ. వరకు విస్తరించి, పొడిగించి వ్రాయడానికి ఆయన కిష్టమైంది. దీనికి కారణం ఆమె యొక్క త్యాగపూరితమైన అత్తపైన గల ప్రేమ పూర్వకమైన తీర్మాణమే ముఖ్య కారణము. ఆ తీర్మాణాన్ని, త్యాగాన్ని ప్రభువు దీవించారు. ఘనపరిచారు కూడా. ఈ తీర్మాణాన్నిబట్టి ఆమె భవిష్యత్తే మారిపోయింది. విశ్వాసులమైన మన అందరి తీర్మాణాలను, త్యాగాన్నిబట్టి మన జీవితాల భవిష్యత్తు దేవునిచేత నిజంగా దీవించబడుతుందని ఈ రూతు జీవితాన్ని బట్టి నేర్చుకుంటున్నాము. అలాగుననే మోషే, ఐగుప్తు భోగభాగ్యములను అనుభవించుటకంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుటే క్రీస్తు విషయమైన నిందయే గొప్ప భాగ్యమని ఫలితముగా పొందబోయే బహుమానమందు దృష్టి యుంచుటచే తన భవిష్యత్తే మారిపోయింది. ఓర్పా, రూతు యొక్క తోడి కోడలైనా రూతు లాంటి సరియైన తీర్మాణం చేయలేక, మోయాబు అనే ఈ లోకం వైపు చూచి ఆత్మీయంగా వెనక్కు

వెళ్ళుటచే రూతు వచ్చినట్లు యెహోవా యొక్క సురక్షితమైన రెక్కల క్రిందికి రాలేక, సంపూర్ణ బహుమానము పొందలేక ఆమె భవిష్యత్తు జీవితానికి అడ్రస్ లేకుండా చేసుకుంది.

ఇప్పుడు రూతు బోయజునందు ఓబేదును అనగా జగద్రక్షకుడైన యేసు ప్రభువు యొక్క వంశావళిలో పుట్టిన ఓబేదుకు జన్మనిచ్చుటచే నిజముగానే సంపూర్ణమైన బహుమానముగా నున్న యేసు ప్రభువుని తన రక్షకునిగా రూతు పొందుకున్నది. రక్షణ కంటే సంపూర్ణ బహుమానము ఈ లోకంలో గానీ, పరలోకంలో గానీ, దాన్ని మించి బహుమానం ఏదైనా ఉన్నదా? లేదు కదా! ఒక ఆస్తిపరుని ఆస్తికంటే, ఆ ఆస్తిపరున్నే పొందుకోవడం ఇంకెంత గొప్ప బహుమానమే కదా! క్రీస్తే మనమందరి సంపూర్ణ బహుమానం. ఇది మనకెంత గొప్ప భాగ్యమో కదా! మోయాబులాంటి ఇహలోక పాపభోగములను త్యజించి చక్కని రూతులాంటి తీర్మాణం చేసికొనే వారికి ప్రభువు సిద్ధపరచిన మేలు ఎంతో గొప్పది. మోయాబీయులలో 10వ తరము వారు కూడా ఇశ్రాయేలులో చేరడానికి వీలులేని రూతు తన త్యాగసహిత తీర్మాణాన్నిబట్టి తన అత్తను ప్రేమించి, చేసిన పరిచర్యను నిండుగా ఘనపరచిన మన ప్రభువు రూతుకు ఇవ్వదలచిన సంపూర్ణమైన బహుమానం ఎంత గొప్పదో కదా! ఆమె పొందిన బహుమానం, ఆమె కుమారుడైన 'ఓబేదు' కూడా పొందుకోగలిగాడు. భక్తిపరులైన తల్లిదండ్రుల భక్తి, త్యాగజీవితాల ద్వారా వారు పొందిన ఆశీర్వాదాలు తమ పిల్లలకు కూడ విస్తరిస్తాయి. (ఉదా:- అబ్రాహాము - ఆయన సంతానము). నీతిమంతులు దాక్షిణ్యము కలిగి ధర్మమిస్తారు. వారి సంతానము అలాగే ధర్మమిస్తారు గానీ, భిక్షమెత్తరు. వారి సంతానము భిక్షమెత్తుట నేను చూడలేదు అని దావీదు భక్తుడు కీర్త 37:25లో వ్రాశాడు. ప్రియ తల్లిదండ్రులారా! రూతు తన కుమారునికి దీవెనకరముగా వున్నట్లు మీ సంతానానికి మీరు దీవెనగా మిగిలిపోతారా? లేక నష్టముగా, శాపముగా మిగిలిపోతారా? రూతు తన చక్కని త్యాగ నిరతి ద్వారా తాను ఒక యవ్వన విధవరాలిగా వుంటూ మరో ఒంటరి, వృద్ధ విధవరాలిని చేర్చుకొని, పోషించుటకు తన జీవితాన్ని అంకితము చేసుకోగా రూతు ఒంటరి తనమును దేవుడు బోయజు ద్వారా జంటగా చేసి, ఓబేదును సంతానముగా యిచ్చాడు. ఈ రూతు పుస్తక ధ్యానాన్ని చదువుచున్న ప్రియ పాఠకులారా! మీరు క్రీస్తు యేసు యొక్క వంశావళి వరుసలో (christ's geneology line) వున్నారా? మీ పిల్లలు కూడా అదే క్రీస్తు వంశావళి వరుసలో రక్షణ వరుసలో, ప్రభువు పరలోకపు మార్గములో వున్నారా? అపో.కా. 2:39వ. లోని వాగ్దానం మీకును, మీ పిల్లలకును, దూరస్థులందరికీ ప్రభువు అనుగ్రహిస్తారు. అప్పుడు మీ పిల్లలను రక్షించుకున్న వారుగాను, మీ పిల్లలకు ఆశీర్వాదకారకంగానూ వుంటారు.

ఈ గ్రంథములో మొదటి అధ్యాయానికి నాల్గవ అధ్యాయానికి గల తేడాలను కొన్ని క్రింద పొందుపరుస్తున్నాను.

| 1వ. అధ్యాయము | 4వ. అధ్యాయము |
| --- | --- |
| 1. 1వ. అధ్యా 3,5,వలో ఎలీమెలెకు, కిల్యోను మహ్లోను అను ముగ్గురి చావులతో మొదలయ్యింది. | 1. గ్రంథము ముగింపులో 4:20వ. ఓబేదు, యెష్షయి, దావీదు అను పుట్టబోయే ముగ్గురి పేర్లు వ్రాయబడ్డాయి. |
| 2. కరువుతో, నష్టాలతో, మరణాలతో మొదలైన ఈ గ్రంథము. | 2. సంతోషకరమైన బోయజు రూతుల పెళ్ళితో ఓబేదు పుట్టుకతో ముగిసింది ఈ గ్రంథం. |
| 3. ఈ అధ్యాయంలో పురుషునితో వుండలేని నయోమి అలాగే ఒంటరికత్తెలైన ఓర్పా, రూతులు కనిపిస్తారు. | 3. 4వ అధ్యాయంలో సమీప బంధువుని కలిగిన నయోమి జంటగా నున్న రూతు బోయజులు కనిపిస్తారు. |
| 4. 1వ. అధ్యాయములో నిష్ప్రయోజకులైన నయోమి ఇద్దరు కుమారులు కిల్యోను, మహ్లోను కనిపిస్తారు. | 4. 4వ. అధ్యాయంలో 7 మంది కుమారులకంటే ఎక్కువైన రూతు కనిపిస్తుంది. |
| 5. 1వ. అధ్యాయంలో మహ్లోను భార్యగా కనిపించిన రూతును చూస్తున్నాం. | 5. 4వ అధ్యాయంలో బోయజు భార్యయైన రూతును చూస్తున్నాం. |
| 6. 1వ. అధ్యాయంలో పోషించబడలేని ఓదార్పు పొందని, చాలా దుఃఖము పొందిన నయోమి కనిపిస్తుంది. | 6. 4వ. అధ్యాయంలో ఓబేదుచేత ఓదార్చబడి, పోషించబడే నయోమి కనిపిస్తుంది. |
| 7. 1వ. అధ్యాయంలో మహ్లోను అని పెనిమిటిచేత సంతానము పొందని రూతు కనిపిస్తుంది. | 7. 4వ. అధ్యాయంలో బోయజు అను భర్తచేత సంతానము పొందిన రూతు కనిపిస్తుంది. |
| 8. 1వ. అధ్యాయంలో ఇంకా కుమారులు నా గర్భమున వుందురా? అని పలికిన నయోమి కనిపిస్తుంది. | 8. 4:17లో నయోమి కొరకు కుమారుడు పుట్టెను అని యిరుగు పొరుగు స్త్రీలు నయోమితో అనినట్లు కనిపిస్తుంది. |
| 9. 1వ. అధ్యాలో యెహోవాను గూర్చి విరుద్ధ సాక్ష్యము పలికిన నయోమిని చూస్తాం. | 9. 4:13లో నయోమికి యెహోవా, బంధువునిచ్చిన యెహోవాగా, స్తుతినొందే యెహోవాగా, ప్రకటించబడే యెహోవాగా కనిపిస్తున్నాడు. |
| 10. 1వ. అధ్యాయంలో గొడ్రాలిగా కనబడిన రూతును చూస్తున్నాం. | 10. 4వ. అధ్యాయంలో ఇశ్రాయేలు వంశమును వర్ధిల్ల చేసిన రూతుగా చూస్తున్నాం. |
| 11. 1వ. అధ్యాయంలో బోయజు కనిపించడు. | 11. 4వ. అధ్యాయంలో బోయజు అందరికంటే ఎక్కువగా కనిపిస్తాడు. |

ఈలాగున అనేక కొరతలతో, సమస్యలతో రిక్తహస్తాలతో, సంతానహీనతలతో, ఒంటరితనములతో, బంధువులేక, ఆహారములేక, విమోచన లేక, అనేకానేక సమస్యలతో సతమతమైన నయోమి, రూతులు యేసు ప్రభువుకు సాదృశ్యముగా నున్న బోయజును ఆశ్రయించుటచే పొందుకున్న క్షేమమును, సమృద్ధిని తృప్తిని, ఆశీర్వాదాలను మనము చూచాం. మొదటి అధ్యాయంలో కనబడిన క్లిష్టపరిస్థితులు 4వ అధ్యాయంలో అన్ని కనబడకుండా అదృశ్యమైపోయాయి. దీనికి కారణం నయోమి, రూతులు, బోయజును ఆశ్రయించడమే. ఈ చిన్న పుస్తకాన్ని చదువుచున్న ఓ సోదరీ! నీ కుటుంబ వ్యక్తిగత, ఉద్యోగ, ఆత్మీయ జీవితాలు నయోమి కుటుంబ జీవితంలాగే వుంటున్నాయా? దేవునియందు భయభక్తులు మాని, దేవుని మార్గాన్ని విడచి, తిరుగుతూ ఏ మోయాబులాంటి లోకంలో వుంటూ సంపూర్ణ నష్టముతోను, కష్టముతోనూ రోగములతోను, క్షీణతలతోను చావులతోను ఇంకనూ అనేక విధాలుగా అవస్థలలో వున్నావా? లేక ఎక్కడికీ వెళ్లకుండా నీ మనస్సులో మోయాబులో వున్న అనుభవాన్నే కలిగి వుంటున్నావా? రూతు బోయజును ఆశ్రయించినట్లు నీవును పరమ దేవుడును, పరమ ప్రభువునైయైన యేసుక్రీస్తు దేవుని ఆశ్రయిస్తే రూతు 1 అధ్యాయములో వలె అన్నీ నష్టకష్టాలతో వున్న నీ జీవితాన్ని రూతు 4వ. అధ్యాయమువలె అన్నీ ఆశీర్వాదాలతో ప్రభువు నిన్ను నింపువాడై యున్నాడు. మరి నీవు రూతు 1వ. అధ్యాయంలోని రూతు నయోమిలవలె వున్నావా? లేక రూతు 4వ అధ్యాయంలోని రూతు, నయోమిలవలె వున్నావా?

ప్రభువును ఆశ్రయించుటకు మనల్ని ప్రేరేపించగలిగే కొన్ని వాక్య రెఫరెన్స్‌లను క్రింద చదువగలరు.

**I. మనము ఎవరిని ఆశ్రయించాలి?**

(1) కీర్త 62:7 నా ఆశ్రయము దేవుని యందే వున్నది.

(2) యెష 44:8 నేను తప్ప ఆశ్రయదుర్గమేమియు లేదు.

(3) కీర్త 118:8 మనుష్యులకంటే యెహోవాను ఆశ్రయించుట మేలు.

(4) కీర్త 118:9 రాజులకంటే అధికారులకంటే యెహోవాను ఆశ్రయించుట మేలు.

**II. ప్రభువును ఆశ్రయిస్తే కలిగే మేలులేంటి?**

1. కీర్త 9:10 నిన్ను ఆశ్రయించువారిని నీవు విడచిపెట్టు వాడవు కావు.
2. కీర్త 31:19 నిన్ను ఆశ్రయించు వారి నిమిత్తము నీవు సిద్ధపరచిన మేలు ఎంతో గొప్పది.

3. కీర్త 34:10. యెహోవాను ఆశ్రయించువారికి ఏ మేలు కొదువయై వుండదు.

4. విలా 3:25 తన్ను ఆశ్రయించువారి యెడల యెహోవా దయాళుడు.

5. దాని. 3:28. ఆయన తన్ను ఆశ్రయించిన తన దాసులను రక్షించెను.

**III. ఎవరెవరు ఆయనను ఆశ్రయించవచ్చును?**

1. యిర్మీ 49:11 విధవరాండ్రు నన్ను ఆశ్రయింపవలెను.

2. కీర్త 36:7 నరులు నీ రెక్కల నీడను ఆశ్రయించుచున్నారు.

3. కీర్త 2:12 ఆయనను ఆశ్రయించు వారందరూ ధన్యులు.

**IV. ఆయనను ఆశ్రయించువారికి పెట్టబడే పేరేంటి?**

1. 1 పేతు 3:5 పూర్వము దేవుని ఆశ్రయించిన పరిశుద్ధ స్త్రీలు

ఈలాగున రూతు మొదటి అధ్యాయంలో యూదా దేశంలో దేవుడు వర్షాన్ని కురిపించి దానిని దర్శిస్తున్నాడన్న సువార్తను నయోమి ద్వారా విని మోయాబును విడిచి బోయజు నివసిస్తున్న బేత్లెహేమునకు మొదట వచ్చింది. 2వ. అధ్యాయములో బోయజు పొలములోనికి వచ్చి బోయజు యొక్క ప్రేమను, ఆదరణను, ఆహారాన్ని అనేకరీతులుగా పొందుకుంది. 3వ. అధ్యాయంలో రూతు బోయజు కళ్ళములోనికి వ్యక్తిగతంగా వెళ్ళి తన వివాహవిషయమైన విన్నపం లేక ప్రార్థన చేయగలిగింది. 4వ అధ్యాయంలో మరింతగా సమీపమై బోయజును వివాహము చేసికొని బోయజుతో ఐక్యమైపోయి బోయజు యింటికే వెళ్ళింది. రూతు బోయజుతో ఐక్యమవ్వడానికి ఆమెను ప్రేరేపించినది పరిశుద్ధాత్మకు సూచనగా వున్న ఆమె అత్తయైన నయోమియే. అలాగుననే ప్రియసోదరీ! నిన్ను కూడ ప్రేరేపిస్తున్న పరిశుద్ధాత్మ స్వరానికి విధేయత చూపుచు, పరమ ప్రభువులో ఐక్యమైపోవడానికి యిష్టపడుచున్నావా? తక్షణమే, ప్రభువును ఆశ్రయించు.

ప్రియ పాఠకులారా! ఈ పుస్తకమును చదువుట ద్వారా యేసు ప్రభువు మిమ్మును దర్శించివుంటే, మీరు ఏ మేలునైనా ఆత్మీయముగా పొందివుంటే ఆ విషయాలను నాతో పంచుకోగలరు. ప్రభువు మిమ్ములను, మీ కుటుంబాలను దీవించును గాక!


ఇట్లు
ప్రభువు యొక్క ప్రేమలో, సేవలో
మీ కెజియక్క
ఫోన్ నెం: **9440469046**
**9440285883**

